




నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

visit us @ http://epaper.suryaa.com

శుక్రవారం | 22 మార్చి 2024 | హైదరాబాద్

సంపుటి 17 | సంచిక 147

| పేజీలు 10+8 | వెల: రూ. 6.50

Published from Hyderabad, Visakhapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Kadapa, Kurnool, Anantapuram, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bangalore, Mumbai, New Delhi







ఆనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం ఉత్తరాయణం - శిశిర ఋతువు, పాల్గుణ మాసం శుద్ధ త్రయోదశి పూర్తి, మఖ తె.4.48 వ్యర్జం మ.3.38 నుంచి 4.59 వరకు
రాహుకాలం ఉ.7.30 నుంచి 9.00 వరకు, దుర్ముహూర్తం ఉ.8.35 నుంచి 9.23 వరకు తిరిగి మ.12.32 నుంచి 1.20 వరకు

# కేజ్రీవాల్ అరెస్ట్



2లో

● ఢిల్లీ అంతటా టెన్షన్ టెన్షన్ ● మద్యం పాలసీ కేసులో కీలక పరిణామాలు ● పదోసారి సమన్లు ఇచ్చేందుకు వెళ్లిన 12 మంది అధికారులు ● అరెస్ట్ చేయాలని వారు ప్లాన్ చేసి వచ్చారన్న ఆప్ నేతలు

ఢిల్లీ మద్యం పాలసీ కేసులో కీలక పరిణామాలు చోటుచేసుకొంటున్నాయి. ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ నివాసానికి వెళ్లిన ఈడీ అధికారులు.. ఆయన్ను అరెస్టు చేశారు. అంతకముందు ఆయన ఫోన్‌ను సీజ్ చేశారు. తొలుత దాదాపు 12 మంది అధికారులతో కూడిన ఈడీ బృందం ఆయనకు పదోసారి సమన్లు ఇచ్చేందుకు వెళ్లినట్లు సమాచారం. సీఎం నివాసం వద్ద సిబ్బంది ఆరా తీయగా.. సెర్చ్ వారెంట్‌తోనే వచ్చామని చెప్పినట్లు తెలుస్తోంది. పోలీసులు లోపలికి వెళ్లడం, ఎవరినీ లోపలికి అనుమతించకపోవడాన్ని బట్టి చూస్తుంటే.. సోదాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. అరవింద్ కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేయాలని వారు ప్లాన్ చేసినట్లు అర్థమవుతోంది అని ఢిల్లీ మంత్రి సౌరభ్ భరద్వాజ్ అన్నారు. అయితే, ప్రస్తుతం కేజ్రీవాల్‌ను విచారిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. తాజా పరిణామాలతో సీఎం ఇంటివద్ద భారీగా పోలీసులు మొహరించడంతో హైటెన్షన్ వాతావరణం నెలకొంది. సీఎం నివాసానికి ఆప్ నేతలు, పెద్ద సంఖ్యలో ఆప్ కార్యకర్తలు తరలివస్తున్నారు.

మద్యం పాలసీకి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో విచారణకు రావాలని ఇప్పటికే తొమ్మిది సార్లు సమన్లు ఇచ్చినా కేజ్రీవాల్ హాజరయ్యేందుకు నిరాకరించిన విషయం తెలిసిందే. మరోవైపు, ఈ కేసులో కేజ్రీవాల్‌కు ఢిల్లీ హైకోర్టులో ఈరోజు ఊరట లభించలేదు. అరెస్టు నుంచి మినహాయింపు కల్పించేందుకు ఇప్పటికిప్పుడు ఆదేశాలిచ్చేందుకు ఉన్నత న్యాయస్థానం నిరాకరించింది.


## "వికసిత్ భారత్"
# సందేశాలు ఆపండి




6లో

● కేంద్రానికి ఈసీ ఆదేశం ● ఫిర్యాదులు అందిన నేపథ్యంలో ఈసీ ఆదేశం
● ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చాక ప్రభుత్వ కార్యక్రమాలు నిలిపివేయాలి
● కొనసాగిస్తే ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై చర్యలు ఉంటాయి
● నెట్ వర్క్ పరిమితుల కారణంగా డెలివరీ అయ్యాయి
● ఈసీకి ఐటీ శాఖ బదులు

## భారీ లాభాల్లో స్టాక్ మార్కెట్ సూచీలు



5లో

*దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు గురువారం భారీ లాభాలతో ప్రారంభమ య్యాయి. అంతర్జాతీయ మార్కెట్లలోని సాను కూల సంకేతాలు మార్కెట్లకు దన్నుగా నిలుస్తున్నాయి. ఉదయం 9:25 గంటల సమయంలో సెన్సెక్స్ 532 పాయింట్ల పుంజుకొని 72,633 వద్ద ట్రేడవుతోంది. నిఫ్టీ 160 పాయింట్లు పెరిగి 21,999 దగ్గర కొనసాగుతోంది.*

## ఇప్పుడు చట్టాన్ని ఆపితే గందరగోళమే



6లో

● ఈసీల నియామకంపై స్టేకు సుప్రీం నిరాకరణ ● కొత్తగా నియమితులైన వారిపై ఎలాంటి ఆరోపణలు లేవు ● తదుపరి విచారణ ఏప్రిల్ 5వ తేదీకి వాయిదా

## బీసీల్లారా కలిసి రండి

● వాటా కోసం పోరాటం చేద్దాం ● బీసీ వ్యతిరేక పార్టీలకు గుణపాఠం తప్పదు ● రేపు బీసీల జోడో సామాజిక న్యాయ యాత్ర ● ఆర్.కృష్ణయ్య



6లో

## అరుణాచల్ భారత్‌దే



6లో

● చైనాకు తేల్చిచెప్పిన అగ్రరాజ్యం ● చైనా చేస్తున్న వాదనలన్నీ అసంబద్ధమైనవే ● చైనా ప్రయత్నాలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్న అమెరికా అధికార ప్రతినిధి

# సత్తా చాటుదాం



3లో

● గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుదాం ● విభేదాలు వీడండి ● కేంద్రంలో అధికారంలోకి రావడమే లక్ష్యం ● జనంలోకి సర్కార్ పథకాలు ● ప్రతి కార్యకర్త బాధ్యత తీసుకోవాలి ● టిపిసిసి అధ్యక్షుడు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిశా నిర్దేశం

## ఫ్లైట్ టికెట్ కొనలేం
# ట్రైన్‌లో వెళ్లలేం

● మా అకౌంట్స్ అన్నీ సీజ్ చేశారు ● ఇప్పుడు నడిరోడ్డు మీద నిలబడ్డాం ● దేశంలో ప్రజాస్వామ్యమే లేకుండా పోయింది ● మమ్మల్ని అన్ని రకాలుగా బంధించేశారు
● కాంగ్రెస్ ముఖ్య నేత రాహుల్ గాంధీ ఆవేదన



6లో

సూర్య వెబ్‌సైట్

సూర్య ఈ - పేపర్

# ప్రచారానికి సర్వం సిద్ధం



2లో

● చంద్రబాబుతో పవన్ కల్యాణ్ భేటీ
● ఎన్నికల వ్యూహాలు, అభ్యర్థుల ఎంపికపై చర్చ
● విజయవాడ ఏ-వన్ కన్వెన్షన్ సెంటర్‌లో 23న ప్రత్యేక కార్యశాల ● 24, 25 తేదీల్లో కుప్పం నియోజకవర్గంలో చంద్రబాబు పర్యటన
● 26నుంచి 'ప్రజాగళం' పేరుతో చిత్తూరు లోక్‌సభ స్థానం నుంచి ఎన్నికల ప్రచారయాత్ర

ఎన్నికల వేల చంద్రబాబు – పవన్ కీలక నిర్ణయాల దిశగా అడుగులు వేస్తున్నారు. రెండు పార్టీలు తమ అభ్యర్థుల పై తుది నిర్ణయానికి వచ్చారు. ఎంపీ అభ్యర్థుల విషయంలో బీజేపీ నుంచి స్పష్టత రాకపోవటంతో తమ అభ్యర్థులను ప్రకటించలేదు. బీజేపీ నుంచి కొన్ని మార్పులతో తాజా ప్రతిపాదనలు అందాయి.

## తిరుమల శ్రీవారిని దర్శించుకున్న
# నారా లోకేశ్ కుటుంబ సభ్యులు



2లో

టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ కుటుంబసభ్యులు తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. కుమారుడు నారా దేవాన్ష్ జన్మదినం సందర్భంగా లోకేశ్- బ్రాహ్మణి దంపతులు, నారా భువనేశ్వరి స్వామివారి దర్శనానికి వచ్చారు. రంగనాయకుల మండపంలో అర్చకులు వారికి వేదాశీర్వచనం చేశారు. దేవాన్ష్ పుట్టినరోజును పురస్కరించుకుని మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద కేంద్రంలో భక్తులకు కుటుంబసభ్యులు అన్నదానం చేయనున్నారు.



## తిరుమల శ్రీవారిని దర్శించుకున్న
# నారా లోకేశ్ కుటుంబ సభ్యులు

తిరుమల, సూర్య బ్యూరో ప్రతినిధి : టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ కుటుంబసభ్యులు తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. కుమారుడు నారా దేవాన్ష్ జన్మదినం సందర్భంగా లోకేశ్- బ్రాహ్మణి దంపతులు, నారా భువనేశ్వరి స్వామివారి దర్శనానికి వచ్చారు. రంగనాయకుల మండపంలో అర్చకులు వారికి వేదాశీర్వచనం చేశారు. దేవాన్ష్ పుట్టినరోజును పురస్కరించుకుని మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద కేంద్రంలో భక్తులకు కుటుంబసభ్యులు అన్నదానం చేయనున్నారు. గురువారం ఉదయం శ్రీవారి భక్తులకు అల్పాహారం వడ్డించారు. ఒక్కరోజు అన్న వితరణకు అయ్యే ఖర్చు రూ.38 లక్షలను తితిదే అన్నప్రసాదం ట్రస్టు లోకేశ్ విరాళమిచ్చారు.





## ప్రచారానికి
# సర్వం సిద్ధం

### మేనిఫేస్టోకు తుది రూపు

- చంద్రబాబుతో పవన్ కల్యాణ్ భేటీ
- ఎన్నికల వ్యూహాలు, అభ్యర్థుల ఎంపికపై చర్చ
- విజయవాడ ఏ-వన్ కన్వెన్షన్ సెంటర్లో 23న ప్రత్యేక కార్యశాల
- 24, 25 తేదీల్లో కుప్పం నియోజకవర్గంలో చంద్రబాబు పర్యటన
- 26నుంచి 'ప్రజాగళం' పేరుతో చిత్తూరు లోక్‌సభ స్థానం నుంచి ఎన్నికల ప్రచారయాత్ర

అమరావతి నుంచి 'సూర్య' ప్రత్యేక ప్రతినిధి : ఎన్నికల వేల చంద్రబాబు – పవన్ కీలక నిర్ణయాల దిశగా అడుగులు వేస్తున్నారు. రెండు పార్టీలు తమ అభ్యర్థుల పై తుది నిర్ణయానికి వచ్చారు. ఎంపీ అభ్యర్థుల విషయంలో బీజేపీ నుంచి స్పష్టత రాకపోవటంతో తమ అభ్యర్థులను ప్రకటించలేదు. బీజేపీ నుంచి కొన్ని మార్పులతో తాజా ప్రతిపాదనలు అందాయి. ఆ ప్రతిపాదనల్లో అమోదం, సీట్ల మార్పు, అభ్యర్థుల ఖరారు పైన కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. ఎన్నికల ప్రచార ప్రసంగాలపై వీరిమధ్య చర్చ జరిగినట్లు సమాచారం. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడుతో జనసేన అధ్యక్షుడు పవన్కల్యాణ్ భేటీ అయ్యారు. ఎంపీ, మిగిలిన ఎమ్మెల్యే అభ్యర్థుల ఎంపికపై ఇరువురూ మాట్లాడుకున్నారు. ఎన్నికల్లో అనుసరించాల్సిన ఉమ్మడి ప్రచార వ్యూహంపై నేతలిద్దరూ సుమారు గంటపాటు చర్చించుకున్నారు. టీడీపీ 128 శాసనసభ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. మరో 16 పెండింగులో ఉన్నాయి. 17 లోక్సభ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది.

**చంద్రబాబుతో పవన్ కల్యాణ్ భేటీ :** తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడుతో జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ గురువారం భేటీ అయ్యారు. హైదరాబాద్లోని చంద్రబాబు నివాసంలో ఇరువురు నేతలు సమావేశమయ్యారు. ఎంపీ అభ్యర్థుల ఎంపిక, ఎన్నికల వ్యూహాలపై చంద్రబాబు, పవన్ చర్చించారు. తెలుగుదేశం-జనసేన-బీజేపీ సీట్ల సర్దుబాటు తర్వాత రెండు పార్టీల నేతలు కొంతమంది అభ్యర్థుల పేర్లను ప్రకటించారు. మరికొందరి పేర్లు ప్రకటించాల్సి ఉన్న తరుణంలో ఇరు అగ్రనేతల భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది. సార్వత్రిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ఎన్డీఏ కూటమి దూసుకెళ్తోంది. ఈ నేపథ్యంలో అభ్యర్థుల ప్రకటనతో జోరుమీదున్న టీడీపీ ఇప్పటికే దాదావు అభ్యర్థులను ప్రకటించేసింది. ఎన్నికల షెడ్యూల్ ప్రకటన కంటే ముందే 128 మంది అసెంబ్లీ అభ్యర్థుల్ని ప్రకటించగా ఇక మిగిలిన అభ్యర్థుల ఎంపికపై టీడీపీ అధినేత చంద్రబాబు చేసిన కసరత్తు కొలిక్కి వచ్చింది. ఇప్పటికే అభ్యర్థుల ఎంపిక పూర్తికాగా అధికారిక ప్రకటనే తరువాయి అన్నట్లుగా పార్టీలో పరిస్థితులు కన్పిస్తున్నాయి. టీడీపీ ప్రకటించాల్సి ఉన్న 16 అసెంబ్లీ, 17 పార్లమెంట్ స్థానాల అభ్యర్థుల్ని ఇవాళ లేదా రేపట్లో ప్రకటించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఏపీలో మొత్తం 25 పార్లమెంట్ స్థానాలు ఉండగా టీడీపీ 17 ఎంపీ స్థానాల్లో పోటీ చేయడానికి సిద్ధమైంది. అన్నీ అనుకున్నట్లుగా జరిగితే మొన్ననే ఎంపీ అభ్యర్థుల జాబితా ప్రకటించాలని చంద్రబాబు భావించారు. అయితే బీజేపీతో సీట్ల సర్దుబాటు చర్చల కారణంగా వాయిదా పడినట్లు సమాచారం.

**విజయవాడలో 23న ప్రత్యేక కార్యశాల :** తెలుగుదేశం పార్టీ లోక్సభ, శాసనసభ అభ్యర్థులకు ఈ నెల 23న ప్రత్యేక కార్యశాల నిర్వహిస్తోంది. విజయవాడలో ఏ-వన్ కన్వెన్షన్ సెంటర్లో జరిగే ఈ కార్యక్రమానికి చంద్రబాబు హాజరు కానున్నారు. అభ్యర్థులతో పాటు ప్రతి నియోజకవర్గానికి ఇప్పటికే నియమించుకున్న అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్, పొలిటికల్ మేనేజర్, మీడియా మేనేజర్, సోషల్ మీడియా మేనేజర్లను వరావ్కు పిలిచినట్లు సమాచారం. రాబోయే 2 నెలల ఎన్నికల కార్యాచరణ, పోల్ మేనేజ్మెంట్లో అనుసరించాల్సి వ్యూహాలపై వారికి అవగాహం కల్పించనున్నారు. ఈ నెల 24, 25 తేదీల్లో కుప్పం నియోజకవర్గంలో చంద్రబాబు పర్యటించనున్నారు.

26నుంచి 'ప్రజాగళం' పేరుతో చిత్తూరు లోక్సభ స్థానం నుంచి ఎన్నికల ప్రచారయాత్ర ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. రోజుకు ఒక లోక్సభ నియోజకవర్గం పరిధిలో చంద్రబాబు పర్యటించనున్నారు. ప్రతి రోజు ఉదయం ఒక శాసనసభ నియోజకవర్గంలో 10 వేల మందితో 'ప్రజాగళం' సభ జరిపేలా ఏర్పాట్లు చేస్తున్నారు. మధ్యాహ్నం నాలుగున్నర గంటలకు మరో నియోజకవర్గంలో, రాత్ర ఏడున్నరకు ఇంకో నియోజకవర్గంలో రోడ్షో నిర్వహించనున్నారు. ఈ నెల 26 నుంచి సుమారు 20 రోజులపాటు ఎన్నికల ప్రచారం కొనసాగిస్తారని పార్టీ వర్గాలు తెలిపాయి.

**27 నుంచి పవన్ కళ్యాణ్ పర్యటన :** చంద్రబాబు మార్చి 25, 26 తేదీల్లో కుప్పం నుంచి తన ప్రచారం పారంభించనుండగా పవన్ కళ్యాణ్ ఈ నెల 27 నుంచి కీలక స్థానాల్లో పర్యటనకు సిద్ధమయ్యారు. తన వారాహి ద్వారా ప్రచారం చేయాలని డిసైడ్ అయ్యారు. హైదారాబాద్ నుంచి మంగళగిరికి వారాహిని తరలిస్తున్నారు. ముందుగా ఉత్తరాంధ్రలో ప్రచారం మొదలు పెట్టి గోదావరి జిల్లాల్లో కొనసాగించేలా ప్లాన్ చేస్తున్నారు. జగన్ కు దీటుగా మేనిఫెస్టో ప్లాన్ చేస్తున్నారు. ఎంపీ అభ్యర్థుల ఎంపిక, ఎన్నికల వ్యూహం, మేనిఫెస్టో రూపకల్పనపై వీరిద్దరు చర్చించినట్లు సమాచారం. కూటమి పార్టీలుగా ఎన్నికల ప్రచార ప్రసంగాలపై వీరిమధ్య చర్చ జరిగింది. ఎన్నికల ప్రచారంలో వీరిద్దరు కలిసి పాల్గొనే సమావేశాలతో పాటు ఎవరెక్కడ ఫోకస్ చేయాలనేది నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది.

**మేనిఫెస్టో కు తుది రూపు :** జనసేన – టీడీపీ పొత్తుల్లో ఖరారైన సీట్లలో రెండు చోట్ల మార్పులుంటాయని సమాచారం. తిరుపతి, మదనపల్లి సీట్లలో నిర్ణయం జరిగే ఛాన్స్ కనిపిస్తోంది. జగన్ 27వ తేదీ నుంచి ప్రచారం మొదలు పెట్టనుండటం తో వీరిద్దరూ సైతం పూర్తిగా ప్రజల్లోనే ఉండేలా కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు. రెండు పార్టీల నుంచి పార్లమెంట్ కు పోటీ చేసే అభ్యర్థుల జాబితా ప్రకటించనున్నారు. జగన్ టార్గెట్ గా మేనిపెస్టోను బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని నిర్ణయించారు. పవన్ కల్యాణ్ ఎక్కువగా ఉత్తరాంధ్ర, గోదావరి లో ప్రచారం పైన ఫోకస్ చేయనున్నారు. చంద్రబాబు రాయలసీమ జిల్లాల్లో కొనసాగేలా ప్లాన్ చేసారు. బీజేపీ తో కలిసి ఉమ్మడి ప్రచారం పైన మరోసారి కమలం పార్టీ నేతలతో భేటీ కావాలని నిర్ణయించారు.

## సరిహద్దు ప్రాంతాల్లో
# ప్రశాంత ఎన్నికకు ఉమ్మడి ప్రణాళిక

### మన్యం జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ముందడుగు




పార్వతీపురం మార్చి 21 మేజర్ న్యూస్.. ఆంధ్ర ఒడిస్సా సరిహద్దు ప్రాంతాల్లో ప్రశాంత ఎన్నికల నిర్వహణ కోసం ఉభయ రాష్ట్రాల జిల్లాలకు చెందిన కలెక్టర్లు ఎస్పీలతో ఉమ్మడి ప్రణాళిక నిర్వహించుకుని ముందుకు వెళ్లాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ప్రశాంత్ కుమార్ అడుగు ముందుకు వేసి ఒడిస్సా రాష్ట్రానికి చెందిన కోరావుట్, రాయగడ జిల్లాలకు చెందిన కలెక్టర్లు వీ. కీర్తి హసన్, మనోజ్ సత్యవాన్ మహజన్ , జిల్లా ఎస్పీ హరీష్ బీసీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమన్వయ ప్రణాళికకు ముందుకు వచ్చారు. ఈ సందర్భంగా కోరావుట్ జిల్లా పరిధిలోని సరిహద్దు ప్రాంతాలైన బంధుగాం, అలమండ, కోటియా గ్రామాలు (పాచిపెంట మండల పరిధిలోని) అలాగే రాయగడ జిల్లా పరిధిలోని రబ్బా వనధార లాడ లంజా కొండ కోనేరు తదితర పోలింగ్ కేంద్రాలలో ఎన్నికల నిర్వహణ సజావుగా సాగేందుకు ఇరు రాష్ట్రాల కలెక్టర్లు పోలీసు అధికారులు సమన్వయంతో ముందుకు పోవాలని సూచించారు. గత ఎన్నికల అనుభవాల దృష్ట్యా గ్రామాలకు చెందిన ఓటర్లు స్వేచ్ఛగా స్వచ్ఛందంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని ఆందోళనకు అడ్డుకోవడానికి అధికారులు ఉపక్రమించరాదని ఈ సందర్భంగా సూచించారు జిల్లా యంత్రాంగం ఆ మేరకు ముందస్తు చర్యలు తీసుకోవాలని సిబ్బందికి తగు సూచనలు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ పార్వతీపురం మన్యం జిల్లాకు సంబంధించి ఆమెకు ఒడిస్సా గ్రామాలకు ఎన్నికల నిర్వహణ నిమిత్తం వెళ్లే సిబ్బంది అధికారులకు తమ వంతు పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని అవసరమైతే ఒడిస్సా ప్రభుత్వ కలెక్టర్ల అభ్యర్థన మేరకు నియమవాలి అనుసరించి ఎందుకైనా సిద్ధంగా ఉంటామని హామీ ఇచ్చారు. సరిహద్దు ప్రాంతాల్లో ఏపీకి చెందిన 22 గ్రామాల్లో నాలుగు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని కొన్నిచోట్ల ఒడిస్సా గ్రామాలను దాటుకొని పోలింగ్ సిబ్బంది వెళ్లాల్సి ఉందని అందుకు ఇబ్బంది పెట్టకుండా ఒడిస్సా అధికారులు సహకరించాలని పిలువునిచ్చారు. మన్యం జిల్లా కలెక్టర్ స్పందించి ముందస్తు అవగాహన సమన్వయ సమావేశానికి ఏర్పాటు చేయడంతో ఒడిస్సా కి చెందిన కోరావుట్, రాయగడ జిల్లాలకు చెందిన కలెక్టర్లు ఎస్పీల సంతోషాన్ని వ్యక్తం చేసి తమ వంతు సహకారాన్ని అందిస్తామని హామీ ఇచ్చారు అలాగే తమ సిబ్బంది కూడా ఆంధ్ర ప్రాంతం గుండా వెళ్లాల్సిన అవసరం ఉంటుందని సహకారం ఇవ్వాలని కోరడంతో నిశాంత్ కుమార్ అంగీకరించారు. ఒడిస్సా కు చెందిన 8 పోలింగ్ కేంద్రాల్లో రెండు కేంద్రాలు సరస్సు ప్రాంతాల్లో సమస్య ఆత్మకంగా ఉంటాయని ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంత ఎన్నికకు సహకరించాలని కోరారు. అలాగే సరిహద్దు ప్రాంతాల్లో ఎన్నికల అక్రమ మద్యమం డబ్బు ఇతర నిషేధిత వస్తువులు రాకపోకలు జరగకుండా ఇరు రాష్ట్రాల అధికారులు సమన్వయతో పోయి చెక్ పెట్టేందుకు సంసిద్ధత వ్యక్తం చేయడం కనిపించింది. ఈ వీడియో కాన్ఫరెన్సో ఇంచార్జి డిఆర్ఓ జి కేశవ నాయుడు జిల్లా రవాణా అధికారి మల్లికార్జున రెడ్డి, ఎస్ ఈ బి ఏ ఈ ఎస్ జీవన్ కిషోర్లు పాల్గొన్నారు.

# కేజ్రీవాల్ అరెస్టు

- డిల్లీ అంతటా టెన్షన్ టెన్షన్
- మద్యం పాలసీ కేసులో కీలక పరిణామాలు
- పదోసారి సమన్లు ఇచ్చేందుకు వెళ్లిన 12 మంది అధికారులు
- అరెస్ట్ చేయాలని వారు ప్లాన్ చేసి వచ్చారన్న ఆప్ నేతలు



డిల్లీ: డిల్లీ మద్యం పాలసీ కేసులో కీలక పరిణామాలు చోటుచేసుకొంటున్నాయి. డిల్లీ ముఖ్యమంత్రి, ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ నివాసానికి వెళ్లిన ఈడీ అధికారులు.. ఆయన్ను అరెస్టు చేశారు. అంతకముందు ఆయన ఫోన్ను సీజ్ చేశారు. తొలుత దాదావు 12 మంది అధికారులతో కూడిన ఈడీ బృఎందం ఆయనకు పదోసారి సమన్లు ఇచ్చేందుకు వెళ్లినట్లు సమాచారం. సీఎం నివాసం వద్ద సిబ్బంది ఆరా తీయగా.. సెర్చ్ వారెంట్తోనే వచ్చామని చెప్పినట్లు తెలుస్తోంది. పోలీసులు లోపలికి వెళ్లడం, ఎవరినీ లోపలికి అనుమతించకపోవడాన్ని బట్టి చూస్తుంటే.. సోదాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. అరవింద్ కేజ్రీవాల్ను అరెస్ట్ చేయాలని వారు ప్లాన్ చేసినట్లు అర్థమవుతోంది అని డిల్లీ మంత్రి సౌరభ్ భరద్వాజ్ అన్నారు. అయితే, ప్రస్తుతం కేజ్రీవాల్ను విచారిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. తాజా పరిణామాలతో సీఎం ఇంటివద్ద భారీగా పోలీసులు మోహరించడంతో హైటెన్షన్ వాతావరణం నెలకొంది. సీఎం నివాసానికి ఆప్ నేతలు, పెద్ద సంఖ్యలో ఆప్ కార్యకర్తలు తరలివస్తున్నారు.

మద్యం పాలసీకి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో విచారణకు రావాలని ఇప్పటికే తొమ్మిది సార్లు సమన్లు ఇచ్చినా కేజ్రీవాల్ హాజరయ్యేందుకు నిరాకరించిన విషయం తెలిసిందే. మరోవైపు, ఈ కేసులో కేజ్రీవాల్కు డిల్లీ హైకోర్టులో ఈరోజు ఊరట లభించలేదు. అరెస్టు నుంచి మినహాయింపు కల్పించేందుకు ఇప్పటికిప్పుడు ఆదేశాలిచ్చేందుకు ఉన్నత న్యాయస్థానం నిరాకరించింది. ప్రస్తుతం ఈ కేసు పురోగతి దృష్ట్యా ఇందులో తాము జోక్యం చేసుకోలేమని హైకోర్టు తేల్చి చెప్పిన గంటల వ్యవధిలోనే ఈడీ అధికారులు ఆయన ఇంటికి చేరుకోవడం వంటి పరిణామాలు ఉత్కంఠ రేపుతున్నాయి.

**సుప్రీంకోర్టును ఆశ్రయించిన కేజ్రీవాల్**

ఇదిలా ఉండగా.. ఈ అంశంపై కేజ్రీవాల్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. మద్యం విధానం కేసులో మధ్యంతర ఉపశమనం కల్పిస్తూ ఆదేశాలిచ్చేందుకు డిల్లీ హైకోర్టు నిరాకరించడాన్ని ఆయన లాయర్లు సర్వోన్నత న్యాయస్థానంలో సవాల్ చేశారు. ఈ అంశాన్ని అత్యవసర జాబితాలో చేర్చి విచారణ జరిపించేందుకు లీగల్ టీమ్ ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. ఈ పిటిషన్పై శుక్రవారం ఉదయం వరకు విచారణ చేపట్టే అవకాశం లేదని తెలుస్తోంది.

**కేజ్రీవాల్ గొంతు అణచివేసేందుకే.. అసెంబ్లీ స్పీకర్**

కేజ్రీవాల్ ఇంటికి ఈడీ అధికారుల రాకపై డిల్లీ అసెంబ్లీ స్పీకర్ రాం నివాస్ గోయెల్ స్పందించారు. మనీశ్ సిసోదియాను అరెస్టు చేసినా ఇప్పటివరకు ఏమీ దొరకలేదన్న విషయం అందరికీ తెలిసిందేనన్నారు. ఇప్పటివరకు 600మందదికి పైగా అరెస్టు చేశారని తెలిపారు. ఎన్నికలకు ముందు కేజ్రీవాల్ గొంతు అణిచివేసేందుకే.. ఆయన్ను అరెస్టు చేయాలని చూస్తున్నారని గోయెల్ విమర్శించారు.

## మంత్రి అమర్నాథ్‌ను అభినందించిన
# ఏపీఐసిసి డైరెక్టర్ బసవా అశోక్



కాకినాడ రూరల్: ఆంధ్రప్రదేశ్ మంత్రివర్యులు గుడివాడ అమర్నాథ్ ను ఏపీఐసీసీ డైరెక్టర్ గా నియమితులైన బసవ అశోక్ మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. తనకు ఏపీఐసీసీ డైరెక్టర్ పదవి ఇచ్చినందుకుగాను కృతజ్ఞతగా మంత్రి గుడివాడ అమర్నాథ్‌ను బసవా అశోక్ శాలువా కప్పి బొకే అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా ఏపీఐసీసీ డైరెక్టర్‌గా నియమితులైన బసవా అశోక్ మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వైఎస్ఆర్సిపి మరోసారి అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో చిక్కల సుధాకర్, భవాని ప్రసాద్, ఎర్రా నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# టీడీపీ టికెట్ ఎవరికో?

### ముడిపడని మూడు నియోజకవర్గాలు

- ఉమ్మడి కృష్ణా జిల్లాలోని మైలవరం, పెనమలూరు, విజయవాడ పశ్చిమ నియోజకవర్గాల్లో అభ్యర్థుల ఎంపికపై మరిన్ని కసరత్తులు


విజయవాడ, సూర్య బ్యూరో ప్రతినిధి : ఉమ్మడి కృష్ణా జిల్లాలోని మైలవరం, పెనమలూరు, విజయవాడ పశ్చిమ నియోజకవర్గాల్లో అభ్యర్థుల ఎంపిక రాజకీయంగా కాక రేకెత్తిస్తోంది. మూడు నియోజకవర్గాల్లో టికెట్ ఎవరికి దక్కుతుందన్న విషయంపై తెలుగుదేశం సహా మిత్రపక్షాలు, అటు ప్రత్యర్థి పార్టీలోనూ జోరుగా చర్చ సాగుతోంది. రెండో జాబితాలో ఆ మూడు నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించకపోవడంతో ఉత్కంఠ కొనసాగుతోంది. ఉమ్మడి కృష్ణా జిల్లాలో మొత్తం 14 నియోజకవర్గాలకు టీడీపీ మొదటి జాబితాలోనే 10 నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించింది. మచిలీపట్నం, పామర్రు, పెడన, గుడివాడ, గన్నవరం నియోజకవర్గాలు, ఎన్టీఆర్ జిల్లాలోని తిరువూరు, జగ్గయ్యపేట, నందిగామ, విజయవాడ తూర్పు, సెంట్రల్ నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించారు. మిత్రపక్షాలకు అవనిగడ్డ, విజయవాడ వెస్ట్ నియోజకవర్గాలు కేటాయింపు జరిగినట్లు ప్రచారం జరుగుతోంది. పెనమలూరు, మైలవరం నియోజకవర్గాలకు ఇంకా అభ్యర్థులను ప్రకటించలేదు. మైలవరం నియోజకవర్గానికి మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు టీడీపీ ఇన్చార్జిగా ఉన్నారు. ఇటీవల జరిగిన పరిణామాలతో మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ టీడీపీలో చేరారు. ఆయన వైఎస్సార్సీపీ తరవున పోటీ చేసి 2019లో దేవినేని ఉమాపై విజయం సాధించారు. 2019 నుంచి దేవినేనికి, వసంత కృష్ణప్రసాద్ కు మధ్య ఉప్పు నిప్పులా సాగింది. పరస్పరం ఆరోపణలు చేసుకుంటూ వచ్చారు. ఆయన టీడీపీలో చేరడం దేవినేనికి ఇష్టం లేకున్నా పార్టీ నిర్ణయం శిరోధార్యం అంటూ దేవినేని సర్దుకున్నారు. మైలవరం నుంచి ఇద్దరిలో ఎవరిని పోటీలోకి దించాలనే దానిపై ఆ పార్టీ తర్జనభర్జన పడుతోంది. ఐవీఆర్ఎస్ ద్వారా కార్యకర్తల అభిప్రాయం సేకరించింది. వీరిలో ఒకరికి మైలవరం టిక్కెట్ కేటాయిస్తే మరొకరికి పెనమలూరు ఇస్తారనేది ఆ పార్టీ శ్రేణుల నుంచి వినిపిస్తున్న మాట. రేపో, మాపో టీడీపీ ప్రకటించే మూడో విడత జాబితాతో ఈ సందేహాలన్నీ తీరిపోతాయి. ప్రస్తుతం తెలుగుదేశం పార్టీ రాజకీయాలు పెనమలూరుతో ముడిపడి ఉన్నాయి.

మైలవరం నుంచి కృష్ణప్రసాద్, దేవినేనిలో ఒకరు పోటీ చేస్తే మరొకరిని పెనమలూరుకు పంవుతారనే ప్రచారం మొదటి నుంచి జరుగుతోంది. పెనమలూరులో 2014లో గెలుపొందిన బోడే ప్రసాద్ 2019లో కొలుసు పార్థసారధి చేతిలో ఓడిపోయారు. ప్రస్తుతం పార్థసారధి వైసీపీ నుంచి టీడీపీలో చేరి నూజివీడు నుంచి పోటీకి దిగుతున్నారు. బలంగా మారిన పెనమలూరు సమీకరణాలను ఎదుర్కొనేందుకు వైఎస్సార్సీపీ మంత్రి జోగి రమేశ్ ను రంగంలోకి దించింది. ఇలాంటి పరిస్థితిలో ఆర్థిక వనరులు ఉండే బలమైన అభ్యర్థి కావాలని టీడీపీ భావిస్తోంది. ఈసారి టికెట్ కేటాయించడం కొంత కష్టంగా ఉందని మాజీ ఎమ్మెల్యే బోడేకు టీడీపీ పార్టీ కార్యాలయం నుంచి సమాచారం రావడంతో అలజడి రేగింది. పెనమలూరులో దేవినేని ఉమా, వసంత కృష్ణప్రసాద్, ఎంఎస్ బేగ్ పేరుతో టీడీపీ ఇప్పటికే ఐవీఆర్ఎస్ నిర్వహించడంతో కార్యకర్తలకు కొంత అవగాహన వచ్చింది. ప్రస్తుతం దేవినేని పెనమలూరుకు వస్తున్నారని జోరుగా ప్రచారం జరుగుతోంది. తాను సైతం పోటీ చేస్తానంటూ బోడే ప్రకటించడంతో టీడీపీ సీనియర్ నాయకులు ఆయన్ను బుజ్జగించే పనిలో పడ్డారు. పొత్తులో భాగంగా ఎన్టీఆర్ జిల్లాలో ఒక స్థానం బీజేపీకి కేటాయించాలని నిర్ణయించారు. కృష్ణా జిల్లా అవనిగడ్డ స్థానాన్ని జనసేనకు కేటాయించారు. అక్కడి నుంచి బండ్రెడ్డి రామకృష్ణ, మరికొంత మంది ఆశావహుల పేర్లు వినిపిస్తున్నాయి. విజయవాడ పశ్చిమ నియోజకవర్గం కూడా జనసేనకు కేటాయించగా బీజేపీతో పొత్తు కుదిరిన తర్వాత సమీకరణాలు మారిపోయాయి. దీన్ని బీజేపీకి కేటాయించారని ప్రచారం జరుగుతోంది. అధికారికంగా ఖరారు కానప్పటికీ 2014లోనే ఇదే స్థానం బీజేపీకి కేటాయించగా వెలంపల్లి శ్రీనివాస్ పోటీ చేసి ఓడిపోయారు.

ప్రస్తుతం ఎమ్మెల్యే స్థానం బీజేపికి కేటాయించారని, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు పేరు కూడా విన్పిస్తోంది. మరోవైపు జనసేన నుంచి టికెట్ ఆశించిన పోతిన మహేశ్ ఇప్పుడు టికెట్ కోసం సర్వశక్తులు ఒడ్డుతున్నారు. ఆయన తరవున కార్యకర్తలు తమ గళాన్ని అధిష్ఠానానికి వినిపించేందుకు ప్రయత్నిస్తున్నారు. విజయవాడ పశ్చిమలో టీడీపీ తరవున జలీల్ ఖాన్, మిగతా ఆశావహుల్ని పార్టీ పెద్దలు సర్దిచెప్పి ఒప్పించారు. ఇప్పుడు విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో టికెట్ పోటీ ప్రధానంగా బీజేపీ, జనసేన అభ్యర్థుల మధ్యే కేంద్రీకృతమైంది. ఎవరి అంచనాలు, ఎవరి ఎత్తుగడల్లో వారుండగా ఆయా పార్టీలు ప్రకటించే అభ్యర్థుల ప్రకటనలపై అందరూ దృష్టి కేంద్రీకరించారు. మరి ఎవరికి టికెట్ దక్కుతుందో, ఎవరికి రిక్తహస్తం మిగులుతుందో త్వరలో తేలిపోనుంది.

# సార్వత్రిక ఎన్నికల వేళ..

- ఈసీ బదిలీల వేటు
- ఎన్నికల ప్రక్రియ పారదర్శకత, నిష్పాక్షికతగా జరిగే లా నిర్ణయం
- రాజకీయ నాయకులతో బంధుత్వం కారణమన్న కేంద్ర ఎన్నికల సంఘం




డిల్లీ: సార్వత్రిక ఎన్నికల వేళ కేంద్ర ఎన్నికల సంఘం బదిలీల వేటు కొనసాగిస్తోంది. తాజాగా అస్సాం, పంజాబ్లోని జిల్లా స్థాయి పోలీసు ఉన్నతాధికారుల్ని బదిలీ చేసింది. ప్రముఖ రాజకీయ నాయకులతో బంధుత్వం ఉన్న అధికారులను ఆ విధుల నుంచి పక్కనపెట్టామని తెలిపింది. ఆ పోస్టులు ఐఏఎస్, ఐపీఎస్ కేడర్ అధికారులకు కేటాయించినవి కావడంతో ఈ చర్యలు తీసుకుంది. అలాగే పంజాబ్, ఒడిశా, గుజరాత్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో నాన్ ఎన్కేడర్ జిల్లా మేజిస్ట్రేట్లు , ఎస్పీ లను ఇతర విభాగాలకు మార్చాలని ఆయా ప్రభుత్వాలకు సూచించింది. ఇటీవల పశ్చిమ్ బెంగాల్ డీజీపీతో పాటు 6 రాష్ట్రాల హోంశాఖ కార్యదర్శులను తప్పించిన సంగతి తెలిసిందే. వారితోపాటు రెండు రాష్ట్రాల్లో సాధారణ పరిపాలనశాఖ కార్యదర్శులను బదిలీ చేసింది. ఎన్నికలకు సంబంధంలేని విధులకు డీజీపీ రాజీవ్ కుమార్ను బదిలీ చేయాలని పశ్చిమ బెంగాల్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఈసీ ఆదేశించింది. ఆయనకు జూనియర్గా ఉన్న అధికారిని డీజీపీగా తాత్కాలికంగా నియమించాలని సూచించింది. ఉత్తర్పదేశ్, బిహార్, గుజరాత్, ఝార్ఖండ్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ హోంశాఖల కార్యదర్శులపైనా ఈసీ వేటు వేసింది. వీరంతా ముఖ్యమంత్రి కార్యాలయంతోపాటు మరో చోట విధులను నిర్వర్తిస్తున్నారని పేర్కొంది. దీనివల్ల ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, నిష్పాక్షికతకు భంగం కలుగుతుందని భావించినట్లు వెల్లడించింది. కాగా, ఏడు దశల్లో జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు ఇప్పటికే షెడ్యూల్ విడుదలైంది. ఏప్రిల్ 19న తొలివిడత పోలింగ్ జరగనుంది.

# కవిత కేసులో ట్విస్టులు ఎన్నో

### ఈడీ అరెస్టును సవాల్ చేసిన ఎమ్మెల్సీకి కోర్టు షాక్!




తెలంగాణ బ్యూరో ప్రతినిధి హైదరాబాద్: దేశవ్యాప్తంగా ప్రకంపనలు సృాష్టించిన ఢిల్లీ లిక్కర్ కుంభకోణంలో తాజాగా చోటు చేసుకుంటున్న పరిణామాలు బీఆర్ఎస్ పార్టీని టెన్షన్ పెడుతున్నాయి. ఇప్పటికే బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను అరెస్ట్ చేసిన ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్ అధికారులు కవితను అదుపులోకి తీసుకొని విచారణ జరువుతున్నారు. ప్రస్తుతం కవిత ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్ అధికారుల కస్టడీలో విచారణను ఎదుర్కొంటున్నారు. ఇదిలా ఉంటే తన అరెస్ట్ అక్రమమని, న్యాయపోరాటం చేస్తానని పదేపదే ఎమ్మెల్సీ కవిత చెప్పిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ఆమె ఈడి అధికారులు తనను అక్రమంగా అరెస్టు చేశారని, సరైన రూల్స్ పాటించలేదని కవిత హౌస్ అవెన్యూ కోర్టును ఆశ్రయించారు. దీంతో కవిత పిటిషన్ పై విచారణ జరిపిన కోర్టు, కవిత వాదనను కొట్టివేశారు. ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్ అధికారులు పి ఎం ఎల్ ఏ చట్టంలోని సెక్షన్ 19ను పాటించారని హౌస్ అవెన్యూ కోర్టు న్యాయమూర్తి నాగ్ పాల్ తీర్పు ఇచ్చినట్టు సమాచారం. అలాగే కవితను సూర్యాస్తమయానికి ముందే అరెస్టు చేయడంతో పాటు 24 గంటల్లోపు న్యాయస్థానం ముందు హాజరు పరిచారని న్యాయస్థానం వెల్లడించింది. ఇదిలా ఉంటే ఈడీ అరెస్ట్ ను సవాల్ చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించిన కవిత సోమవారం నాడు రిట్ పిటిషన్ దాఖలు చేశారు. ఇక ఈ పిటిషన్ పై శుక్రవారం విచారణ జరగనుంది. ట్రాన్సిట్ రిమాండ్ వారెంట్ లేకుండానే ఈడి అధికారులు తనను అరెస్ట్ చేశారని పిటిషన్ లో పేర్కొన్నారు. గతంలో తాను సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్ పై తుది తీర్పు రాకుండానే ఈడీ అరెస్టు చేసిందని కవిత తన పిటిషన్ లో పేర్కొన్నారు. ఈడి చర్యలు చట్ట విరుద్ధంగా ఉన్నాయని, ఈ కేసుకు సంబంధించి తన అరెస్టు, రిమాండ్ ఉత్తర్వులను రద్దు చేయాలని ఎమ్మెల్సీ కవిత కోరారు. శుక్రవారం నాడు ఈ కేసు సుప్రీం ధర్మాసనం ముందుకు రానున్న నేపథ్యంలో, సుప్రీంకోర్టు దీనిపై ఏం తీర్పు ఇస్తుంది అనేది అందరిలోనూ ఉత్కంఠగా మారింది.

# సత్తా చాటుదాం

### గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుదాం

● విభేదాలు వీడండి ● కేంద్రంలో అధికారంలోకి రావడమే లక్ష్యం ● జనంలోకి సర్కార్ పథకాలు ● ప్రతి కార్యకర్త బాధ్యత తీసుకోవాలి ● టిపిసిసి అధ్యక్షుడు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిశా నిర్దేశం ● తాను ప్రాతినిధ్యం వహించిన మల్కాజ్గిరి లోక్ సభ నియోజకవర్గ పరిధిలో కేడర్‌తో ముఖాముఖి మరియు సమీక్ష



తెలంగాణ బ్యూరో ప్రతినిధి హైదరాబాద్: తాను ప్రాతినిధ్యం వహించిన మల్కాజ్ పార్లమెంట్ స్థానాన్ని కాంగ్రెస్ పార్టీ కచ్చితంగా గెలవాల్సిందేనని ముఖ్యమంత్రి మరియు టిపిసిసి అధ్యక్షుడు రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా మెజార్టీ ఎంపీ సీట్లు గెలిచి అధిష్టాన వర్గానికి కానుకగా ఇవ్వాలని ఆయన పిలువునిచ్చారు. గురువారం హైదరాబాదులో జరిగిన మల్కాజ్గిరి పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశానికి రేవంత్ రెడ్డి ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ పట్ల రోజురోజుకు ప్రజలలో ఆదరణ పెరుగుతున్నదని, మల్కాజిగిరి పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో ని నియోజకవర్గాలలో, అసెంబ్లీ సెగ్మెంట్లలో అభివృాఎద్ధి చేసి చూపించామని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలను ప్రజలలో విస్తృతంగా ప్రచారం చేయాలని, ఒక అసెంబ్లీ ఎన్నికల్లో గెలిస్తే సరిపోలేదని, పార్లమెంట్ ఎన్నికల్లో అసలైన సత్తా చాటుదామని ఆయన పిలువు ఇచ్చారు. రాష్ట్రంలో, కేంద్రలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటే తెలంగాణ అన్ని విధాలుగా అభివృాఎద్ధి చెందుతుందని అన్నారు. తెలంగాణ పురోగతి సాధి ంచాలి అంటే తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ఎంపీ సీట్లను అత్యధికంగా గెలువు గెలవాల్సిందే నని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన మూడు నెలల కాలంలో లెక్కకు మిక్కిలి కార్యక్రమాలు చేపడుతున్నామని, సోనియా గాంధీ ఇచ్చిన గ్యారెంటీలను అమలు చేస్తున్నామని అన్నారు. నిధులు ఉన్నప్పటికీ ,లేనప్పటికీ అభివృాఎద్ధి సంక్షేమాల విషయంలో వెనకడుగు వేసే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మల్కాజ్గిరి లోక్సభ నియోజకవర్గ పరిధిలో ని మేడ్చల్ ,మల్కాజ్గిరి ,ఉప్పల్, ఎల్ బి నగర్, సికింద్రాబాద్ కంటోన్మెంట్, కుత్బుల్లాపూర్, కూకట్పల్లి అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిలోని కాంగ్రెస్ పార్టీ పరిస్థితినీ ఆరా తీశారు. పార్టీ శ్రేణుల అభిప్రాయాలను స్వీకరించారు. విభేదాలు ఉంటే పక్కకు పెట్టాలని ,గెలుపే లక్ష్యంగా పనిచే యాలని, పార్టీకి మరియు నాయకులకు మరియు క్యాడర్కు మంచి భవిష్యత్తు ఉన్నదని తెలియజేశారు. ఎల్. బి. నగర్ నియోజకవర్గం నుండి పోటీ చేసిన ఏఐసీసీ అధికార ప్రతినిధి, టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధు యాష్కి గౌడ్ పాల్గొన్నారు. అలాగే ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో పార్లమెంట్ పరిధిలోని వివిధ నియోజకవర్గాలనుండి పోటీచేసిన అభ్యర్థులు హాజరయ్యారు. వారితోపాటు ముఖ్యనాయకులు, కార్యకర్తలు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, డివిజన్ ల అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ వివిధ విభాగాల అధ్యక్షులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# నిబద్ధత కలిగిన కేడర్‌కు గుర్తింపు

● చేవెళ్ల సీటును గెలుచుకుందాం ● అందరికీ అవకాశాలు పక్కా
● ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ● సీఎంతో భేటీ అయిన
రాష్ట్ర కాంగ్రెస్ ప్రచార కమిటీ నేత ఏనుగు జంగారెడ్డి



తెలంగాణ బ్యూరో ప్రతినిధి హైదరాబాద్: పార్టీ కోసం అంకితభావం నిబద్ధతతో పనిచేసిన ప్రతి ఒక్కరినీ గుర్తించి అవకాశాలు కల్పిస్తామని, పదవులు ఇస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు.రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ ప్రచార కమిటీ నేత మరియు రంగారెడ్డి జిల్లా పరిషత్ మాజీ ఫ్లోర్ లీడర్ ,కాంగ్రెస్ పార్టీ సీనియర్ దిగ్గజం, కందుకూరు మాజీ జెడ్పిటిసి అయిన ఏనుగు జంగారెడ్డి గురువారం ముఖ్యమంత్రి మరియు రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు రేవంత్ రెడ్డితో భేటీ అయ్యారు .తాజా రాజకీయ పరిణామాలపై చర్చించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ త్వరలోనే ప్రకటించనున్న చైర్మన్ ల జాబితాలో జంగా రెడ్డికి కార్పొరేషన్ చైర్మన్ గా అవకాశం కల్పించనున్నట్లు ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి హామీ. ఇచ్చారు. గత మూడు దశాబ్దాలుగా పార్టీకి అంకిత భావం చిత్తశుద్ధితో పనిచేస్తున్న జంగారెడ్డి వంటి వారి సేవలు పార్టీకి ఎంతో అవసరం అని కూడా ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పేర్కొన్నారు. పార్టీలో కష్టించి పని చేసిన వారికి అందరికీ అవకాశం కల్పిస్తామని కూడా హామీ ఇచ్చారు . వచ్చే ఎన్నికల్లో చేవెళ్ల లోక్సభ సీటును కాంగ్రెస్ గెలవడానికి అందరూ కలిసికట్టుగా కృాఎషి చేయాలని రేవంత్ రెడ్డి చెప్పారు.ఈ కార్యక్రమంలో దెబ్బడగూడ సర్పంచ్ ఏనుగు శ్రావణి రెడ్డి, యువ నేత ఏనుగు అచ్యుత్ సింహారెడ్డి తదితరులు కూడా పాల్గొన్నారు.

# పకడ్బందీగా ఎన్నికల నియమావళి అమలు

● ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటు చేస్తాం ● అధికారులు సమన్వయంతో పనిచేయాలి ● సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి



తెలంగాణ బ్యూరోప్రతినిధి: లోక్‌సభ ఎన్నికల నేపథ్యం లో ఎన్నికల ప్రవర్తనా నియమావళి సమర్థవంతంగా అమలు చేయడానికి వివిధ శాఖలు సమన్వయంతో పని చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి పేర్కొన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియ మావళి అమలుపై గురువారం సచివాలయంలో ఉన్నత స్థాయి సమావేశం జరిగింది. రాష్ట్రంలో ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో పనిచేసిన విధంగానే.. అదే స్ఫూర్తితో రానున్న లోక్‌సభ ఎన్నికల నిర్వహణలోనూ మరింత సమర్థవంతంగా పని చేయాలని కోరారు. రాష్ట్రంలో సరిహద్దు రాష్ట్రాలైన మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ సరిహద్దులలో ప్రత్యేకంగా చెక్ పోస్టులను ఏర్పాటు చేయడంతో పాటు.. ఆయా రాష్ట్రాల చెక్ పోస్టులతో కలసి సమన్వయంతో పటిష్ట నిఘాను ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల నిర్వహణ, ప్రవర్తనా నియమావళి అమలుపై అన్ని ప్రధాన శాఖల్లో ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశామని చెప్పారు. రాష్ట్రంలో ఇప్పటికే వివిధ శాఖల ద్వారా చెక్ పోస్టులను ఏర్పాటు చేశామన్నారు. వీటిలో పోలీస్‌శాఖ ద్వారా 444 చెక్ పోస్టులుండగా, 9 అంతర్రాష్ట్ర చెక్–పోస్ట్ లున్నాయన్నారు. ఇప్పటి వరకు పోలీస్‌శాఖ ద్వారా పదికోట్ల రూపాయలను సీజ్ చేశామని.. అలాగే లైసెన్స్ లేని ఆయుధాలు, పేలుడు పదార్థాలు, జిలెటిన్ స్టిక్స్, బంగారాన్ని కూడా స్వాధీనం చేసుకున్నామన్నారు. రవాణా శాఖ ద్వారా 15 చెక్ పోస్టులు, 52 ఎన్ఫోర్స్ మెంట్ బృాఎందాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఈ చెక్ పోస్టులు 24 గంటలు పనిచేస్తాయన్నారు. రవాణా శాఖ బృాఎందాలు జరిపిన తనిఖీలలో రూ. 34 .31 లక్షలను స్వాధీనం చేసుకున్నామన్నారు. వాణిజ్య పన్నులశాఖ ద్వారా 16 అంతర్రాష్ట్ర చెక్ పోస్టులను ఏర్పాటు చేయడంతో పాటు 31 స్ట్రాటెజిక్ పాయింట్లపై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. వీటితో పాటు ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు వివిధ వస్తువులను పంచేందుకు అవకాశమున్న 25 గోదాములను గుర్తించి వాటిపై ప్రత్యేక నిఘా ఉంచామని వెల్లడించారు. 141 గోదాములు, 912 వివిధ వస్తువుల తయారీ గోదాములపై కూడా నిఘా పెట్టామన్నారు. ఎక్సైజ్ శాఖ ద్వారా 21 అంతర్రాష్ట్ర చెక్ పోస్టులు, ఆరు మొబైల్ చెక్ పోస్టులు ఏర్పాటు చేయడంతో పాటు, అక్రమ మద్యం తయారీకి అవకాశం ఉన్న ఎనిమిది జిల్లాలను గుర్తించి వాటిపై ప్రత్యేక దృాఎష్టి సాధించామని సీఎస్ తెలిపారు.

## కాంగ్రెస్ రెండో జాబితా విడుదల

### తెలంగాణలో ఐదు స్థానాలకు అభ్యర్థుల ప్రకటన







తెలంగాణ బ్యూరో ప్రతినిధి హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ తెలంగాణకు సంబంధించి రెండో జాబితాను విడుదల చేసింది. పెద్దపల్లి లోక్సభ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా గడ్డం వంశీకృాఎష్ణను ప్రకటించారు. మల్కాజ్గిరి నియోజకవర్గం నుంచి సునీత మహేందర్ రెడ్డి, సికింద్రాబాద్ నుంచి దానం నాగేందర్, చేవెళ్ల నుంచి రంజిత్ రెడ్డి, నాగర్ కర్నూల్ నుంచి మల్లు ర రవి పేర్లను కాంగ్రెస్ పార్టీ అధిష్టాన వర్గం ప్రకటించింది.

## కాంగ్రెస్ పాలనలో బీసీలకు పథకాలు అద్భుతం



తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: బీసీ, ఎస్సి , ఎస్టీ , మైనారిటీ, అగ్రవర్ణ పేదలకు ప్రభుత్వం 17 కార్పొరేషన్ లు ఏర్పాటు చేయటంలో కీలకంగా వ్యవహరించిన బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ను బీసీ రాజ్యాధికార సమితి ప్రతినిధులు అధ్యక్షులు దాసు సురేశ్ నేతృాఎత్వంలో ఘనంగా సన్మానించారు..ఇటీవల ప్రకటించిన 37 జనరల్ కార్పొరేషన్లలో సహితం 13 కార్పొరేషన్లకు చైర్మన్లుగా బీసీలను ప్రకటించడంపై ప్రభుత్వాన్ని అభినందించారు. స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీల రిజర్వేషన్లను గత ప్రభుత్వం గణనీయంగా తగ్గించడంతో బీసీల నాయకత్వం అణగదొక్కబడుతుందనీ బీసీల నాయకత్వ ఎదుగుదలకు కొత్త కార్పొరేషన్లను ఏర్పాటుచేసి పాలక మండలిలను ఏర్పాటుచేయాలని గతంల అనేక పోరాటాలు చేసి తాము అరెస్టులపాలైనా సాధ్యంకాని కార్పొరేషన్లు నేడు కాంగ్రెస్ హయాంలో శీఘ్రగతిన 100 రోజుల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో సాధ్యమవ్వడాన్ని తాము అభినందిస్తున్నామన్నారు. ఇటీవల అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ప్రభుత్వానికి తాము బీసీల సమస్యలను నివేదించిన వెంటనే బీసీల ఆర్థిక అభివృాఎద్ధి కోసం బడ్జెట్లో 8 వేల కోట్లు కేటాయించటం , బీసీ, ఎస్సి , ఎస్టీ , మైనారిటీ , రెసిడెన్సియల్ గురుకులాలకు సమీకృాఎత స్వంత భవనాలను ఏర్పాటు చేయటం, 100 రోజుల పాలనలో నిరుద్యోగులకు 30 వేల ఉద్యోగాలను భర్తీ చేయడం, ఉపాధ్యాయ నియామకాలకోసం టెట్ ను నిర్వహించడం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ,రూ. 500 లకే గ్యాస్ సిలెండర్ ,200 యూనిట్ల ఉచిత విద్యుత్ తదితర అంశాలపై ప్రభుత్వం పేద ప్రజల పక్షాన నిలబడి పనులను శీఘ్రగతిన పూర్తిచేయడం పట్ల బీసీల తరవున సమితి సభ్యులు మంత్రి పొన్నం ప్రభాకర్ కు కృాఎతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ రాజ్యాధికార సమితి గౌరవ అధ్యక్షులు దొంత ఆనందం, పొలిటికల్ అఫైర్స్ కమిటీ చైర్మన్ తులసీ శ్రీమన్ ,మహిళా కన్వీనర్ బోనం ఊర్మిళ , రాష్ట్ర ఉపాధ్యక్షులు కొండ స్వామి, రాష్ట్ర కార్యదర్శి వీరాస్వామి యాదవ్ , మీడియా సెక్రటరీ మారేపల్లి లక్ష్మణ్ , బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక సభ్యురాలు దోనేటి కృాఎష్ణలత, బీసీ రాజ్యాధికార సమితి గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షురాలు పద్మావతి, ప్రధాన కార్యదర్శి గోషిక స్వప్న, సెక్రటరీ లక్ష్మి ,ఆంధ్రప్రదేశ్ కన్వీనర్ కాలసముద్రం సుధాకర్ , రాష్ట్ర కార్యదర్శి పెండెం నాగభూషణం,వెంకట్ యాదవ్ ,సుధాకర్ , రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పొదిల రాజు ,యూత్ కమిటీ జనరల్ సెక్రటరీ మడత కిషోర్ , దామెరకొండ కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

## బండి సంజయ్‌పై విమర్శలు ఖండించిన రాణి రుద్రమ్మ

తెలంగాణ బ్యూరో ప్రతినిధి: బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ పై కాంగ్రెస్ మంత్రి పొన్నం ప్రభాకర్ చేసిన ఆరోపణలు ఖండిస్తున్నట్లు బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమ తెలిపారు. గురువారం పార్టీ కార్యాలయం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బండి సంజయ్ కుమార్ ని బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి నుండి ఎందుకు తొలగించారనేది మా పార్టీకి సంబంధించిన అంశం, మా పార్టీ అంతర్గత వ్యవహారం. ఈ విషయంపై రాష్ట్ర నాయకులు, జాతీయ నాయకులు అనేక సార్లు చెప్పారు..అసెంబ్లీ సాక్షిగా పొన్నం ప్రభాకర్ చాలా సార్లు చెప్పారు.

# పార్లమెంట్ ఎన్నికల బరిలో కేసీఆర్

● పోటీపై కొనసాగుతున్న కసరత్తు ● రేవంత్ రెడ్డికి కేసీఆర్ కొత్త సవాల్
● మెదక్ లోక్సభ స్థా నంపై మూడు పార్టీల ఎత్తుకు పై ఎత్తులు



తెలంగాణ బ్యూరో ప్రతినిధి హైదరాబాద్: తెలంగాణలో లోక్ సభ ఎన్నికల పర్వం ఉత్కంఠ పెంచుతున్నది. సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. బిజెపి సత్తా చాటాలని ప్రయత్నాలు చేస్తున్నది. మాజీ సీఎం కేసీఆర్ కు ఎన్నికలు సవాల్ గా మారుతున్నాయి. కెసిఆర్ ఇప్పుడు కీలక నిర్ణయం దిశగా అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. మూడు పార్టీల పోరు పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఇప్పటికే ప్రధాన పార్టీలు తమ అభ్యర్థులను ఖరారు చేస్తున్నాయి. బిజెపి, కాంగ్రెస్ తమ జాబితాలను విడుదల చేశాయి. కెసిఆర్ తమ అభ్యర్థుల ఎంపికలో ఆచితూచి వ్యవహరిస్తున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలోని జహీరాబాద్ టిక్కెట్ ను ప్రకటించినా, మెదక్ విషయంలో మాత్రం నిర్ణయం తీసుకోలేదు. తొలుత మెదక్ నుంచి ఒంటేరు ప్రతాపరెడ్డిని బరిలోకి దింపాలని నిర్ణయించినట్లు ప్రచారం జరిగింది. కాంగ్రెస్ అభ్యర్థి ఎవరనేది స్పష్టత వచ్చిన తర్వాతనే తమ అభ్యర్థిని అధికారికంగా ప్రకటించాలని కెసిఆర్ భావిస్తున్నట్లు సమాచారం. దీంతో మరి కొంతమంది నేతలు గులాబీ పార్టీ నుంచి సీటు ఆశిస్తూ రేసులోకి వచ్చారు. మెదక్ బరిలో అసెంబ్లీ ఎన్నికల్లో నరసాపూర్ టికెట్‌ను సునీత రెడ్డి కు ఇవ్వటంతో మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డికి మెదక్ ఎంపీ సీటు ఇస్తామని అప్పట్లో హామీ ఇచ్చారు. అదేవిధంగా అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నుంచి టిఆర్ఎస్ లో చేరిన గాలి అనిల్ కుమార్‌కు ఇదే రకమైన హామీ దక్కింది. వీరితో పాటుగా బీరయ్య యాదవ్, శశిధర్ రెడ్డి తమ అభ్యర్థిత్వలను పరిశీలించాలని కోరుతున్నారు. మెదక్ నుంచి బిజెపి అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే రఘునందన్ రావు పేరు ప్రకటించారు. ఆయన ప్రచారం ప్రారంభించారు. కేసీఆర్ బరిలో నిలుస్తారా , ఇదే సమయంలో మెదక్ పార్లమెంటుకు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ స్వయంగా బరిలోకి దిగే అవకాశాలు ఉన్నాయని పార్టీలో ప్రచారం జరుగుతుంది. ప్రస్తుత పరిస్థితుల్లో తానే బరిలోకి దిగితే పార్టీలో ఎన్నికలవేళ జోష్ పెరుగుతుందని కేసీఆర్ భావిస్తున్నారు. దీంతో కాంగ్రెస్ నుంచి అభ్యర్థి ఎవరనేది ఖరారు అయిన తర్వాత తుది నిర్ణయం వెలువడే అవకాశం కనిపిస్తుంది. మూడు పార్టీలకు హోరాహోరీగా మారిన ఈ పార్లమెంట్ ఎన్నికల సమరంలో కేసీఆర్ బరిలో నిలుస్తారా లేక మెదక్ సీటు మరొకరికి కేటాయిస్తారా అనేది ఒకటి రెండు రోజుల్లో స్పష్టత వచ్చే అవకాశం కనిపిస్తుంది.

# టిపిసిసి ఫిషర్మెన్ రాష్ట్ర కార్యదర్శిగా రాజేష్



● నియామక పత్రం అందజేసిన చైర్మన్ మెట్టు సాయికుమార్
● పార్టీ పటిష్టతకు కృషి చేయాలని మెట్టు పిలుపు

తెలంగాణ బ్యూరో ప్రతినిధి: హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ఫిషర్ మెన్ కమిటీ కార్యదర్శి గా హనుమకొండకు చెందిన సొప్పరి రాజేష్ నియమితులయ్యారు. ఈ మేరకు తెలంగాణ ఫిషర్మెన్ రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ చైర్మన్ మెట్టు సాయికుమార్ ఆదేశాలు జారీ చేశారు. సోనియాగా ంధీ ,ప్రియాంక గాంధీ, మల్లికార్జున ఖర్గే,రాహుల్ గాంధీ కాంగ్రెస్ ప్రెసిడెంట్ మల్లికార్జున ఖర్గే ,అఖిలభారత ఫిషర్మెన్ కాంగ్రెస్ కమిటీ ఫిషర్మెన్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఆర్మ్ స్ట్రాంగ్, ముఖ్యమంత్రి రేవం త్ రెడ్డి ల స్ఫూర్తితో పార్టీని బలోపేతం చేయాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు. తనకు కీలకమైన కార్యదర్శి పదవి ఇవ్వడం పట్ల రాజేష్ జాతీయ పెద్దలకు మరియు రాష్ట్ర ప్రజలకు నే, శ్రేణులకు కృాఎతజ్ఞతలు ధన్యవాదాలు తెలియజేశారు .తనపై ఉంచిన విశ్వాసాన్ని వమ్ము చేయనని, పార్టీ బలోపేతమే తన లక్ష్యమని రాజేశ్ ప్రకటించారు.

**నేతలకు కృతజ్ఞతలు:** ఈ సందర్భంగా టిపిసిసి ఫిషర్మెన్ విభాగం రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన రాజేష్ మాట్లాడుతూ తన ఎంపికకు సహకరించిన పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డి మంత్రులు సురేఖ సీతక్క హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాజేందర్ రెడ్డి కుడా చైర్మన్ ఎనుగాల వెంకట్ రాం రెడ్డి తదితరులకు, నేతలకు, శ్రేణులకు ,అందరికీ కృాఎతజ్ఞతలు తెలియజేశారు.

# మాడిశెట్టికి తెలుగు విశ్వవిద్యాలయం వారి అరుదైన కీర్తి పురస్కారం



తెలంగాణ,బ్యూరో ప్రతినిధి : కవి, రచయిత, వ్యాఖ్యాత, సాహిత్య సాంస్కృాఎతిక సంస్థల నిర్వాహకుడు మాడిశెట్టి గోపాల్ సాంస్కృాఎతిక సంస్థల నిర్వహణ అంశంలో తెలుగు విశ్వవిద్యాలయం వారి కీర్తి పురస్కారాన్ని గురువారం అందుకున్నారు. విశ్వ విద్యాలయం ఆడిటోరియంలో జరిగిన పురస్కారాల ప్రధానోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ రాష్ట్ర జుడిషియల్ అకాడమీ డైరెక్టర్ మంగారి రాజేందర్, విశ్వవిద్యాలయ వైస్ ఛాన్స్ లర్ ఆచార్య తంగడ కిషన్ రావులు మాడిశెట్టికి పురస్కారాన్ని ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ అసిస్టెంట్ డైరెక్టర్ రింగు రామమూర్తి, రిజిస్ట్రార్ ఆచార్య బట్టు రమేష్, సాహితీ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు. గోపాల్ డిగ్రీ చదువుతున్న రోజుల్లోనే జవహర్ సాహితీ కళా సమితిని ఇతరులతో కలిసి స్థాపించి దానిద్వారా వివిధ సాంస్కృాఎతిక కార్యక్రమాలు నిర్వహించారు. చైతన్య కళాభారతి నాటక సంస్థలో బాధ్యునిగా తెలంగాణ స్థాయి నాటక పోటీలు నిర్వహించారు. పలు నాటకాలలో నటునిగా కూడా నటించి మెప్పు పొందారు. సమైక్య సాహితి సాహితీ గౌతమి సంస్థల అధ్యక్షునిగా అసంఖ్యాకమైన కార్యక్రమాలు నిర్వహించారు. సమైక్య సాహితీ సంస్థ పక్షాన సాహిత్య కార్యక్రమాలతో పాటు పలు సాంస్కృాఎతిక కార్యక్రమాలు నిర్వహించారు. నాటక రచయితకు తుమ్మల రంగస్థలం పురస్కారాన్ని అందజేస్తూ ఆ సందర్భంగా అనేక ఉత్తమ నాటకాలు ప్రదర్శింప జేశారు.రాగమంజరి సాంస్కృాఎతిక సంస్థకు సహాధ్యక్షునిగా తెలంగాణ సాంస్కృాఎతిక కళారూపాల ప్రదర్శన ఏర్పాటు చేశారు. కరీంనగర్ ఫిలిం సొసైటీ అధ్యక్షునిగా ఉత్తమ సినిమా అభిరుచిని ప్రేక్షకుల్లో పెంపొందించడానికి వివిధ కార్యక్రమాలను నిర్వహించారు. ఉమ్మడి గతంలో నంది టీవీ పురస్కారాల కమిటీ జూరీ మెంబర్ గా పని చేశారు. కరీంనగర్ ఎన్నారై ఫోరం కరీంనగర్ వికాస వేదిక కోఆర్డినేటర్ గా, అమెరికన్ తెలుగు అసోసియేషన్ (ఎ టి ఎ) తరవున పలు సాంస్కృాఎతిక కార్యక్రమాలు నిర్వహించారు. తెలంగాణ రచయితల వేదిక జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శిగా తెలంగాణ కళారూపాల ప్రదర్శన ఏర్పాటు చేశారు. చెలిమి చెలిమెలు కవితా సంపుటి వెలువరించారు. వివిధ పుస్తకాలకు సంపాదకత్వం వహించారు. వేలాది సాంస్కృాఎతిక, ప్రభుత్వ, ప్రభుత్వేతర కార్యక్రమాలకు వ్యాఖ్యాతగా వ్యవహరించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వారి ఉత్తమ వ్యాఖ్యాత పురస్కారాన్ని గెలుచుకున్నారు. పలు షార్ట్ ఫిలింలలో నటించారు. సాంస్కృాఎతిక బృాఎందంతో సింగపూర్ మలేషియా ఉగాది ఉత్సవాలలో పాల్గొన్నారు. ఇటీవల అమెరికా డల్లాస్ లో జరిగిన నాటా ఉత్సవాలలో అతిథిగా పాల్గొన్నారు. చేసిన సేవలకు గుర్తింపుగా కళాకారుల సంక్షేమ సమాఖ్య వారి ఉగాది పురస్కారం, దేవులపల్లి రామానుజ రావు స్మారక పురస్కారం, తడకమడ్ల పురస్కారం, అన్నమయ్య విశిష్ట సాహిత్య పురస్కారం, సరస్వత జ్యోతి పురస్కారం, కాలిఫోర్నియాలో సిలికానాంధ్ర వారి సన్మానం, కరీంనగర్ ఫోకార్ట్స అకాడమీ వారి వేదిక వాచస్పతి పురస్కారం, తెలంగాణ కళావేదిక వారి సినారె వాగ్భూషణ పురస్కారం, సినీవాలి పురస్కారం, గురజాడ అంతర్జాతీయ పురస్కారం, అలిశెట్టి స్మారక పురస్కారం, లంబోదర కల్చరల్ అకాడమీ వారి కొండా లక్ష్మణ్ బాపూజీ పురస్కారం, సాయి అలేఖ్య సాంస్కృాఎతిక సంస్థ వారి పురస్కారం, వ్యాఖ్యాన సామ్రాట్ బిరుదు, సాహితీరంగ సామ్రాట్టు బిరుదు, కూచిపూడి మేదిని నృాఎత్య సంస్థ వారి కళాబంధు బిరుదు, మై గిఫ్ట్ సంస్థ వారి పురస్కారం, తేజ రాష్ట్రస్థాయి పురస్కారం, తదితర ప్రశంసలు పొందారు.


**Repco Home Finance**

## REPCO హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్

**హైదరాబాద్ బ్రాంచ్ : నెం. 102, యం హెచ్ ఆర్ హౌస్, నెం. 7-1-621/274, సంజీవ రెడ్డి నగర్, తెలంగాణ - 500 038**

**ఇ-వేలం విక్రయ ప్రకటన**

రెప్కో హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్‌కు తనఖా పెట్టిన స్థిరాస్తుల విక్రయం.
సెక్యూరిటైజేషన్ మరియు ఫైనాన్షియల్ అసెట్స్ రీకన్‌స్ట్రక్షన్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ యాక్ట్ 2002 కింద

హైదరాబాద్ బ్రాంచ్‌లోని రెప్కో హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ నుండి రుణాలు తీసుకున్న రుణగ్రహీతలు & సహ-రుణగ్రహీతలు మరియు బాధ్యత వివరాలు ఇక్కడ అందించబడ్డాయి, అయితే కంపెనీ SARFAESI చట్టం కింద నోటీసు జారీ చేసింది మరియు అధీకృత అధికారి తనఖా పెట్టిన ఆస్తులను స్వాధీనం చేసుకుని జారీ చేశారు. క్రింద పేర్కొన్న తేదీలలో అమ్మకానికి నోటీసు మరియు కంపెనీ ఇప్పుడు సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (అమలు) రూల్స్ 2002లోని సెక్షన్ 8 & 9 కింద "షరతు ఉన్నట్లే" మరియు "షరతు ప్రకారంగా" ఆస్తులను విక్రయించాలని నిర్ణయించింది.

**ఇ-వేలం తేది/సమయం : 19-04-2024, సమయం : 11.00 a.m సా॥ 12.00 p.m**
(5 నిమిషాల అపరిమిత ఆటో పొడిగింపుతో)

**ఇ-టెండర్లు సమర్పించుటకు ఆఖరి తేది మరియు సమయం: 18-04-2024 సా॥ 4.00 గం॥లు**

**క్రమ సంఖ్య .1: రుణగ్రహీత: శ్రీమతి ఎడెల్లి అంజమ్మ,** W/o. శ్రీ నరసింహ మరియు **సహ-రుణగ్రహీత: శ్రీ ఈదెల్లి నరసింహ్మ,** S/o శ్రీ వీరయ్య, **డిమాండ్ నోటీసు తేదీ:** 17-06-2022, డిమాండ్ నోటీసు **లోన్ ఖాతా** నెం.1381870003319 ప్రకారం క్లెయిమ్ చేయబడిన మొత్తం 16.06.2022 నాటికి **రూ.29,34,408/-** తదుపరి వడ్డీ, ఖర్చులు మరియు ఖర్చులతో కలిపి. **స్వాధీనం తీసుకున్న తేదీ : 21.04.2023., 05.03.2024 నాటికి ప్రస్తుత బకాయి మొత్తం: రూ.29,26,518/-.**

**ఆస్తి వివరణ:** సర్వే నెం. 76, 78 (పాస్ బుక్ Sy.No.78/A ప్రకారం), 79, 81/A, ప్లాట్ నెం.106లో ఉత్తర భాగంలో ఉన్న సెమీ-ఫినిష్డ్ ఇంటి మొత్తం ముక్క మరియు పార్సిల్ 83/EE, 83/U మరియు 83/UU, 113 చ.గ.లు. లేదా 94.46 చ.మీటర్లు (918 చదరపు అడుగుల నిర్మాణ విస్తీర్ణంతో) శ్రీదా హోమ్స్, ముత్వెల్లిగూడ గ్రామం, కాచివానిసింగారం గ్రామ పంచాయతీ, ఘట్‌కేసర్ మండలం, మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా సరిహద్దు: ఉత్తరం:30' వెడల్పు రోడ్డు, దక్షిణం: ప్లాట్ నెం. 106 దక్షిణ భాగం, తూర్పు : 30' వెడల్పు గల రోడ్డు, పశ్చిమం: ప్లాట్ నెం.105.

**రిజర్వ్ ధర : రూ. రూ. 50,67,000/- EMD (రిజర్వ్ ధరలో 10%) రూ. 5,06,700/-** కనీస బిడ్ ఇంక్రిమెంట్ మొత్తం రూ. 25,000/-

**Sl.No.2: Borrower:**

**ఇ-వేలం తేది/సమయం : 27-04-2024, సమయం : 11.00 a.m సా॥ 12.00 p.m**
(5 నిమిషాల అపరిమిత ఆటో పొడిగింపుతో)

**ఇ-టెండర్లు సమర్పించుటకు ఆఖరి తేది మరియు సమయం: 26-04-2024 సా॥ 4.00 గం॥లు**

**క్రమ సంఖ్య .2: రుణగ్రహీత: శ్రీ తాటి శ్రీకాంత్,** S/o. శ్రీ గోపాల కృష్ణ తాటి మరియు **సహ-రుణగ్రహీత: శ్రీమతి.కటకం పద్మిని,** W/o. శ్రీ తాటి శ్రీకాంత్, **డిమాండ్ నోటీసు తేదీ:** 09.08.2021 డిమాండ్ నోటీసు **(లోన్ ఖాతా నం.1381871003069)** ప్రకారం క్లెయిమ్ చేయబడిన మొత్తం **03.08.2021 నాటికి రూ.31,60,218/-**తో పాటు తదుపరి వడ్డీ, ఖర్చులు. **స్వాధీనం తీసుకున్న తేదీ: 22.11.2021, 07.03.2024 నాటికి ప్రస్తుత బకాయి మొత్తం: రూ.43,31,661/-.**

**ఆస్తి వివరణ:** 800 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న ఫ్లాట్ నెం. S4, GHMC నం. 2-2-1100/1/A/S4, (P టిన్ నం. 1090221532) కలిగిన ఫ్లాట్ నం. 45 చదరపు గజాల భూమిలో అవిభక్త వాటాతో పాటు సాధారణ ప్రాంతాలతో సహా. లేదా 37.62 చ.మీ. 531 చదరపు గజాలలో. లేదా 444 చ.మీ. మునిసిపల్ నెం. 2-2-1100/1/A ప్రాంగణంలోని "జయ రెసిడెన్సీ" అని పిలువబడే భవనంలో, న్యూ నల్లకుంట, హైదరాబాద్ T.S. మరియు సరిహద్దులు: భూమి ఉత్తరం: పొరుగువారి ఇల్లు, దక్షిణం: ఎన్.జానకి రెడ్డికి చెందిన ఆస్తి, తూర్పు: హ్యాపీ హోమ్ అపార్ట్‌మెంట్లు, పశ్చిమం: రోడ్డు 30'-0 వెడల్పు , ఫ్లాట్ సరిహద్దులు, ఉత్తరం: ఓపెన్ సెట్‌బ్యాక్, దక్షిణం: ఓపెన్ సెట్‌బ్యాక్, తూర్పు: ఓపెన్ బ్యాక్‌బ్యాక్, పశ్చిమం: ఫ్లాట్ నం. S3.

**రిజర్వ్ ధర : రూ. రూ. 36,00,000/- EMD (రిజర్వ్ ధరలో 10%) రూ. 3,36,000/-** కనీస బిడ్ ఇంక్రిమెంట్ మొత్తం రూ. 25,000/-

ఇ-వేలం ప్రక్రియ కోసం, దయచేసి M/s కేన్‌బ్యాంక్ కంప్యూటర్ సర్వీసెస్ లిమిటెడ్ (CCSL) శ్రీ ప్రతాప్ కంజిలాల్ - 9832952602, శ్రీ DD పఖారే - 8898418010 ని కలవండి

ఆస్తిని తనిఖీ చేయడానికి ఉద్దేశించిన బిడ్డర్లు బ్రాంచ్ హెడ్, రెప్కో హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్, హైదరాబాద్ బ్రాంచ్‌ని అన్ని పని దినాలలో ఉదయం 10 నుండి సాయంత్రం 5 గంటల మధ్య సంప్రదించవచ్చు. సంప్రదింపు నంబర్లు 040-23811146, 8374351146.

తేది : 06-03-2024, 11.03.2024

అధీకృత అధికారి
రెప్కో హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్.,

# సంపాదకీయం

editpage@suryaa.com

ఎన్నికల భేరి మోగింది. ప్రధాన పార్టీలు తలమునకలుగా వున్నాయి. పోటీ వై. యస్.ఆర్.సీ.పి, తెలుగు దేశం, జనసేన, బి.జె.పి మధ్య. వీటిలో వై. యస్. ఆర్. సీపీ ఒంటరిగా 175 స్థానాలకు పోటీ చేస్తుంటే, తెలుగుదేశం, జనసేన, బి.జె.పి పార్టీలు ఒక కూటమిగా పోటీ చేస్తున్నాయి. మెజారిటీ స్థానా లు తెలుగు దేశం పోటీ చేస్తోంది. జనసేన, బి.జే.పి నామ మాత్రపు సీట్స్ లోనే పోటీ చేస్తున్నాయి. అంటే వాటికి కూడ తెలుసు తెలుగుదేశం అండ లేనిదే గెలుపు కష్టమని. అందుకే కొన్ని స్థానాలకే అవి మొగ్గు చూపాయి. ఆంధ్రాలో ఉనికి చాటుకోవాలని బి.జేపి ఉంది. జనసేన ఇప్పుడు పొత్తు పెట్టుకున్నా రాబోయే రోజులలో దాని ప్రభావం ఎంత అన్నది తెలుస్తుంది. ఇప్పుడు కనీసం పదికి పైగా స్థానాలు అది గెలుచుకోవాలి. బి.జె.పి కూడ అంతే. తెలుగు దేశం ఖరాఖండిగా మెజారిటీ స్థానాలు గెలవడం ఖాయంగా కనిపిస్తోంది. అయితే వై. యస్.ఆర్.సీ.పి 175 మావే అని చెప్పటం చూస్తుంటే ఈ సారి ఎన్నికలు హోరా హోరిగా సాగుతాయి అనిపిస్తోంది. పాలక పక్షం గెలుపు మాదే అనే ధీమాతో ఉంది. కూటమి కూడ మాదే అధికారం అనే ధోరణిలో ఉంది. మరి ఓటరన్న ఏ వైపుకు మళ్ళు తాడో. ఏది ఏమైనా ఈ ఎన్నికలలో డబ్బు మంచి నీళ్ళ మాదిరి గా ఖర్చు అవటం ఖాయం. ప్రధాన పార్టీల వంది మాగాదులకు అడిగినంత ఇవ్వాల్సిందే. ఇదే తరుణంలో ఓటర్లకు కూడ డబ్బు ఎర చూపుతారు. డబ్బు ఎవరు ఎక్కువ ఇస్తే వారికే మా ఓటు అన్న చందంగా కనిపిస్తోంది. వ్యక్తి గుణగణాలకు ప్రాముఖ్యత లేనే లేదు. డబ్బు ఎవరు ఎక్కువ వెదజల్లితే వారికే పట్టం. ముఖ్యంగా డబ్బు ను అరికట్టే బాధ్యత ఎన్నికల సంఘం

## ఆంధ్రాలో అందలం ఎవరిదో...

దే.కొంత మంది పౌరులు డబ్బు వద్దన్న, వారి ఓటు మాకు పడదు అనే దిశలో పార్టీలు ఉన్నాయి. ఇంకా కొంతమంది మాకు డబ్బు ఇవ్వలేదు, మేము ఎందుకు ఓటు వేయాలి అని బాహటంగానే అంటున్నారు. ఇంకా కొంత మంది మాకు డబ్బు ఇస్తే ఓటు వేస్తాం అని అనడం చూస్తున్నదే. అందుకే పార్టీలు డబ్బు పంచాల్సిందే. ఇది నేరం అయినా రహస్యంగా, గుట్టుగా సాగుతోంది. ఇక్కడ డబ్బు అందని వాళు ్ళ కచ్చితంగా ఓటు వేయరు ఇది నగ్న సత్యం. ఏ కొద్ది మందో డబ్బు ఇవ్వకపోయిన ఓటు వేస్తారు ఇలాంటి వాళ్ళు చాలా స్వల్పం.ఇది తెలిసేమో జగన్ పార్టీ బటన్ నొక్కుడు విధానం చేపట్టింది అనే అనుమానం రాక మానదు. ఈనాడు అందరి ఖాతాలలో డబ్బు పడుతోంది. దీనికి దీటుగా కూటమి కూడ ఉచిత తాయి లాలు ప్రకటించింది. బస్సు లలో స్త్రీలకు ఉచిత ప్రయాణం అటువంటిదే. ఇది బాగా పనిచేయవచ్చు. గంపగుత్తుగా స్త్రీల ఓట్లు పడవచ్చేమోననిపిస్తోంది. వృద్దులకు ఎంత పింఛన్ ఇస్తారో తెలియటం లేదు. కాంగ్రెస్ మాత్రం ఐదు వేలు చెప్పింది. వాళ్ళు అధికారం లోకి వస్తారో, రారో తెలియదు. కూటమి ఎంత పింఛన్ అని చెప్పలేదు. వై.యస్.ఆర్.పార్టీ కూడ ఆ ఊసు ఎత్తలేదు. ఒకటవ తేదీన ఇస్తామని చెబుతున్నా, ఈ పద్ధతి బాగాలేదు. వారు ఊరిలో ఉన్నా, లేకపోయినా అకౌంట్లో వేసేస్తే మేలు అనే మాట వినపిస్తోంది. ఎలాగు వృద్ధులకే పింఛన్ కాబట్టి వారు ఉన్నా, ఊర్లో లేకపోయినా అకౌంట్ లో వేయాలి. ఎలాగు ఇంటికి వస్తారు కాబట్టి వ్యక్తిని చూచి అమౌంట్ అకౌంట్ లో వేయాలి. పింఛన్ తీసుకునే వ్యక్తి ఒక వేళ మరణించి ఉంటే ఎలాగు తెలుస్తుంది కాబట్టి అది రద్దు చేయవచ్చు. అందుకనే కూటమి అధికారం లోకి వస్తే వాలంటీర్లను తొలగించం అంటున్నారు.ఇక రేషన్ విధానం సవ్యంగా సాగటం లేదు. రేషన్ బియ్యం తీసుకుంటూ ఉన్నా అది ప్రక్క దారిలోకి వెళుతోంది. చాలామంది కార్డు ఉంది కాబట్టి తీసుకుంటున్నాం అం టున్నారు. దీని స్థానంలో డబ్బులు ఇస్తే ప్రయోజనకరం. ఎందుకంటే అంద రూ బియ్యం మేలు రకం వే వాడుతున్నారు. కంది పప్పు, కొన్ని రకాల వస్తు వులు ఉండటం లేదు. వచ్చిన ప్రతి వారికి ప్రభుత్వం చెప్పిన వస్తువులు ఇవ్వా ల్సిందే. ఇవ్వకపోతే అక్కడ ఓ ట్రోల్ ఫ్రీ నెంబర్ ఉండాలి. ఎవరికైనా ఏ వస్తు వు అందక పోతే ఆ నెంబర్ కు ఫోన్ చేస్తే అధికారులు వచ్చి తగిన చర్యలు తీసుకోవాలి. అప్పుడు యజమానులకు భయం ఉంటుంది. నిబద్ధతతో వ్యవ హరిస్తారు. ప్రజా ప్రయోజనాలు సక్రమంగా చేస్తే ఏ ప్రభుత్వమైన మనుగడ సాగిస్తుంది.

బస్సులలో స్త్రీలకు ఉచిత సౌకర్యం కల్పిస్తే, పురుషులకు టికెట్స్ ధర తగ్గించాలి. సీనియర్ సిటిజన్స్ కు ఉచితంగా రాష్టమంతా పర్యటించే సౌలభ్యం ఉండాలి. ఇవన్నీ చేయాలి అంటే ప్రభుత్వం మీద భారం పడటం ఖాయం. అందుకనే ప్రతి పార్టీ ఆచి తూచి అడుగు వేయాలి. అనవసర వాగ్దానాలు ఇచ్చి అమలు లోకి రాకపోతే వ్యతిరేకత వస్తుంది. ఆంధ్రాలో ఎవరు తాయులాలు భారీగా ప్రకటిస్తారో వారిదే గెలుపు ఉండొచ్చు. ఈ విషయం లో వై. యస్. ఆర్. సి. పి చాలా ఆశలు పెట్టుకుంది. అధికారం లోకి వచ్చిన వెంటనే అమలు చేస్తే ప్రజలు హర్షిస్తారు. ఎన్నికల ముందు అమలు చేయటం మంచిది కాదు. పాలక పక్షం డి. ఎస్. సీ ఆ విధంగా చేసే అప ప్రద మూటగట్టుకుంది. ఇలాంటివి చేయకూడదు. కూటమి ఏటా ఏటా అని ఉదుతోంది. ఇది ఎంత మాత్రమో తెలియదు. ఇందులో ఎవరి అస్త్రాలు వారికి ఉన్నాయి. ఏవి అమలు అవుతాయో, ఏవి కావొ చెప్పటం కష్టం. ఎవరు అధికారం లోకి వచ్చినా విమర్శలు ఉంటాయి. కూర్చి కాపాడుకోవటం తోనే సమయం వృధా అవుతుంది. ఇక నాయకుల అలకలు, బుజ్జగింపులు మాములే. అందరికీ పదవులు కావాలి. లేకపోతే తిరుగుబాటు, ఈ విధానము పోవాలి. పాలక పక్షం అయినా, కూటమి అయినా లోలోపల వారి వారి అభ్యర్థులకు వ్యతిరేకంగా పని చేసే వారు ఉన్నారు. ఇది వారి విచక్షణ కు వదలాలి.

మనమంతా ఒకటే అనే నమ్మకం ప్రతి పార్టీకి ఉండాలి. లేకపోతే పార్టీలకు భవిష్యత్ ఉండదు. జూన్ 4 న జరిగే ఎన్నికల కౌంటింగ్ లో ఓటరు ఏ పార్టీని అందలం ఎక్కిస్తాడో తేలనున్నది. ఓటరు డబ్బు కు ఆశ పడక మంచి పార్టీకి, మంచి వ్యక్తికి ఓటు వేయి. అధికారంలో ప్రజలకు మేలు చేసే ప్రభుత్వాన్నే కూర్చోబెడదాం.

పాఠకులు, విశ్లేషకులు, రచయితలు తమ రచనలు క్రింది చిరునామాకు గానీ సూర్య దినపత్రిక ఎడిటోరియల్ మెయిల్ ఐడికి గాని పంపవలసినదిగా మనవి మెయిల్ :
suryaeditpage@gmail.com

SPR publications, Surya Soudha, Plot.No: 185, M.C.H. NO.258/1/185, siddi vinayaka nagar, Ayyappa Society Opp: Hi-Tech City, Hyderabad - 500 072.

# "సీఎం సార్ మమ్ములను ఆదుకోండి"

■ కాళేశ్వరం చుట్టూ తిరుగుతున్న తెలంగాణ రాజకీయాలు ■ 1850 కోట్లతో నిర్మించిన మేడిగడ్డ బరాజ్ కు పగుళ్లు ■ ప్రమాదం ఏదైనా జరిగితే ఊహకందని నష్టం ■ నాణ్యతకు ఆమడ దూరంలో నిర్వాసితుల ఇళ్లు ■ ఓపెన్ ప్లాట్ల పంపిణీ పైనా సిబిఐ దర్యాప్తు కు డిమాండ్



పులి రాజు
9908383567

రాష్ట్ర రాజకీయం గత నాలుగు నెలలుగా కాళేశ్వరం ప్రాజెక్టు లో భాగమైన మేడిగడ్డ బరాజ్ (లక్ష్మీ బరాజ్) చుట్టూ తిరుగుతుంది. రాహుల్ గాంధీ ,సీఎం రేవంత్ రెడ్డి, ప్రధాన ప్రతిపక్షం బిఆర్ఎస్ పార్టీ మొదలైన అన్ని రాజకీయ పార్టీలు కాళేశ్వరం చుట్టే తిరుగుతున్నాయి. కేంద్ర జల సంఘం మాజీ చైర్మన్ చంద్రశేఖర్ అయ్యర్ చైర్మన్ గా అయిదుగురు సభ్యులతో కూడిన కమిటీని నేషనల్ డామ్ సేఫ్టీ అథారిటీ వేసి దర్యాప్తుకు ఆదేశించింది ప్రభుత్వం. మేడిగడ్డ డ్యామ్ మరియు రోడ్డు 19, 20, 21 పిల్లర్లు పగుళ్లు రావడంతో ప్రమాదాన్ని ముందే గమనించిన ప్రభుత్వం అందులో ఉన్న నీళ్లను కిందికి వదిలిపెట్టిన సంగతి అందరికీ తెలిసిందే! సుమారు 1850 కోట్లతో నిర్మించిన మేడిగడ్డ బరాజ్ పగుళ్లు రావడం చాలా బాధాకరం, చాలా పెద్ద ఆర్థికపరమైన నష్టం కూడా! నది పైన నిర్మించిన ఏ ప్రాజెక్ట్ అయిన ప్రమాదం ఏర్పడితే అందులో నీటిని నదిలోకి వదిలిపెట్టి, కొంత ప్రమాదం నుంచి బయటపడవచ్చు, కొంత సమయం తర్వాత దానిని పునర్నిర్మించుకోవచ్చు ఆ నిర్మాణంతో కొంత ఆర్థికపరమైన నష్టం ఏర్పడుతుంది. కానీ గత ప్రభుత్వం లిఫ్ట్ ఇరిగేషన్ పేరుతో నదులతో సంబంధం లేకుండా మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్, రంగనాయక సాగర్, గౌరవెల్లి ప్రాజెక్ట్, అంతగిరి ప్రాజెక్టు మొదలైన నిర్మించడం జరిగింది. మేడిగడ్డ ప్రాజెక్టు లాగా భూమి మీద నిర్మించిన రిజర్వాయర్లకు జరగరాని ప్రమాదం ఏదైనా జరిగితే ఎంత నష్టం వాటిల్లుతుందో ఊహకందదు...

గజ్వేల్ సమీపంలో నిర్మించిన మల్లన్న సాగర్ మరియు కొండపోచమ్మ నిర్వాసితులకు %=%ఆర్-ఆర్ కాలనీలో ఇండ్లు నాణ్యతకు ఆమడ దూరంలో నిర్మించి నిర్వాసితులకు ఇస్తే వర్షం పడినప్పుడల్లా ఎప్పుడు కూలిపోయి చనిపోతామో అని బిక్కుబిక్కుమంటూ నిర్వాసిత ప్రజలు కాలం వెళ్లదీస్తున్నారు. సర్వస్వం కోల్పోయిన నిర్వాసితులకు నాణ్యత ప్రమాణాలు పాటించకుండా ఇండ్లు నిర్మించి చేతులు దులుపుకున్నారు. ఆ ఇండ్లు ఎప్పుడు కూలిపోతాయా అని భయపడుతున్నారు. అన్ని రిజర్వాయర్ ముంపు గ్రామాల్లో ప్యాకేజీలో, స్ట్రక్చర్ వ్యాల్యూ, ఇండ్ల కేటాయింపు, మరియు ఓపెన్ ప్లాట్ల పంపిణీలో ప్రభుత్వ అధికారులకు మరియు రాజకీయ నాయకులకు కోట్ల రూపాయలు చేతులు మారినట్లు నిర్వాసిత గ్రామ ప్రజలు అంటున్నారు. కాబట్టి కాళేశ్వరం ప్రాజెక్టుతో పాటుఆర్/ఆర్ కాలనీ ఇండ్ల నిర్మాణం, ఇండ్ల పంపిణీ, స్ట్రక్చర్ వ్యాల్యూ పంపిణీ, ఓపెన్ ప్లాట్ల పంపిణీ పైన కూడా సిబిఐ చేత దర్యాప్తు చేయించి నిజమైన లబ్ధిదారులకు న్యాయం చేయాలని తెలంగాణ ప్రజలు కోరుతున్నారు.

రాష్ట్రంలో వివిధ రిజర్వాయర్ల నిర్మాణంలో గ్రామాలను, ఆ ప్రజల అస్తిత్వాన్ని, అడ్రస్సును కోల్పోయిన నిర్వాసితులు చెట్టుకు ఒకరు పుట్టకొకరుగా చెదిరిపోయి ఊరు కాని ఊర్లలో బిక్కుబిక్కుమంటూ కూలీలుగా మారి జీవిస్తున్నారు. గత ప్రభుత్వం చాలా సందర్భాల్లో "నిర్వాసితులు చేసిన త్యాగం వెలకట్టలేనిది వారిని గుండెల్లో పెట్టుకొని చూసుకుంటామని" సర్పంచ్ నుండి ముఖ్యమంత్రి వరకు , అటెండర్ నుంచి ఐఏఎస్ ఆఫీసర్ వరకు అన్నారు. నిర్వాసితులకు న్యాయంగా రావాల్సిన పరిహారాలను అడిగితే ప్రభుత్వాధికారులు మరియు రాజకీయ నాయకులు వారి ఆస్తిని నుండి వాటా అడిగినట్లుగా నిర్వాసితులను ఇప్పటికీ అవమానిస్తున్నారు. ఇప్పటికీ నిర్వాసిత ప్రజలు ఆఫీసుల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు.

మల్లన్న సాగర్ భూములను 2016 లో సేకరించిన ప్రభుత్వం ఇప్పటికి కూడా న్యాయంగా రావాల్సిన నష్టపరిహారం రాక ఆఫీసుల చుట్టూ ఇప్పటికీ తిరుగుతున్నామని ముంపు గ్రామాల ప్రజలు ఏడు-స్తున్నారు. ముఖ్యంగా సిద్దిపేట జిల్లాలో సుమారు 30000 ఎకరాల భూమిని సేకరించి నాలుగు రిజర్వాయర్లను కట్టించారు. అందులో మల్లన్న సాగర్ 14 గ్రామాలు, కొండపోచమ్మ నాలుగు గ్రామాలు, గౌరవెల్లి ప్రాజెక్టు 4 గ్రామాలు, రంగనాయక సాగర్ ఒక గ్రామం పూర్తిగా సుమారు 10 వేల కుటుంబాలకు న్యాయంగా రావలసిన నష్టపరిహారం ఇవ్వకుండా గత ప్రభుత్వం నమ్మించి బలవంతంగా పోలీసులను పెట్టించి వారి ఊర్లను ఖాళీ చేపించినారు. ఇప్పటి కూడా ఆయా ముంపు గ్రామాల ప్రజల పైన కేసులు కొనసాగుతూనే ఉన్నాయి. మల్లన్న సాగర్ లాంటి రిజర్వాయర్లో బాధితులు వారికి న్యాయంగా రావలసిన నష్టపరిహారం కోసం కోర్టులో కేసులు పెడితే వారిని గత ప్రభుత్వం ద్రోహులుగా పరిగణించారు. అంతేకాకుండా రంగనాయక సాగర్, కొండపోచమ్మ సాగర్ లో ఎకరాకు 12 లక్షల రూపాయల చొప్పున చెల్లించి, మల్లన్న సాగర్ లో మాత్రం ఎకరాకు 6 లక్షల రూపాయలు ప్రభుత్వం ఇచ్చింది. భూమి విలువ కూడా సగానికి సగం తక్కువ చేసి ఇచ్చి మల్లన్న సాగర్ నిర్వాసితులకు అన్యాయం చేసింది. అన్ని రిజర్వాయర్ల నిర్వాసిత కుటుంబాలకు %=/=% ప్యాకేజీలు, ఇండ్లు, ఇంటి వెనకాల ఉన్న భూములకు, ఇంకా పరిహారం రావాల్సి ఉంది. 65 సంవత్సరాల నిండిన ఒంటరి మహిళలు ఒంటరి పురుషులకు ప్యాకేజీలు, అడుగుతున్న ఇప్పటికీ ఇవ్వడం లేదు. నష్టపరిహారం రాక కొంతమంది మతిస్థిమితం కోల్పోయి వివిధ ప్రదేశాల్లో చనిపోయారు. కొంతమంది యువకులు మద్యానికి బానిస అయ్యా రు. గజ్వేల్ అసెంబ్లీ నియోజకవర్గంలో పరిధిలో ఆర్/ఆర్ కాలనీ నిర్మించిన అందులో గుడి, బడి, స్మశాన వాటిక కూడా ఇప్పటికీ నిర్మించ లేదంటే అతిశయోక్తి కాదు.

2016 జూలైలో ఇప్పటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మల్లన్న సాగర్ ముంపు గ్రామమైన ఏటిగడ్డ కిష్టాపూర్ లో రెండు రోజులు ముంపు గ్రామాలకు సంఘీభావంగా ఆనాటి టిఆర్ఎస్ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ, రెండు పంటలు పండే భూములను తీసుకోవద్దని, ఒకవేళ ప్రభుత్వం గనుక భూములను తీసుకుంటే బహిరంగ మార్కెట్ ధరలు ప్రతి ఎకరానికి ఇవ్వాలని నిరాహారదీక్ష చేశాడు. కాబట్టి అన్ని ముంపు గ్రామాల బాధితులు మా బాధలన్నీ ముఖ్యమంత్రి గారికి తెలుసు కాబట్టి ఇప్పటికైనా న్యాయంగా రావలసిన పూర్తి నష్టపరిహారం, కొండపోచమ్మ ,రంగనాయక సాగర్ లో భూములకు 12 లక్షలు చెల్లించిన విధంగా మల్లన్న సాగర్ భూములకు కూడా 12 లక్షలు పరిహారం సీఎం ఏ.రేవంత్ రెడ్డి ఇస్తారని, అట్లనే ముంపు గ్రామాల ప్రజల పైన పెట్టిన కేసులు బేషరతుగా ఎత్తివేస్తారని, అన్ని ముంపు గ్రామాల యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తారని ఆశతో ముంపు గ్రామాల ప్రజలందరూ ఎదురు చూస్తున్నారు.

# ఎమ్మెల్యేల ఫిరాయింపులపై బీఆర్ఎస్‌కు సానుభూతి రాదా?

■ గతంలో టిఆర్ఎస్ ఇతర పార్టీ ఎమ్మెల్యేలను చేర్చుకుంది ■ కాంగ్రెస్ టిడిపి సిపిఐ ఎమ్మెల్యేలు టిఆర్ఎస్ లో చేరారు ■ అధికారం కోల్పోయిన బి ఆర్ఎస్ కు సానుభూతి దొరకడం లేదు ■ ఒకవైపు కాంగ్రెస్ ఆపరేషన్ ఆకర్ష్ మరో వైపు కల్వకుంట్ల కవిత జైలు పాలు ■ పార్లమెంట్ ఎన్నికలవేళ పోటీకి సాహసం చేయని బి ఆర్ ఎస్ అభ్యర్థులు



విద్య వెంకట్
తెలంగాణ బ్యూరో - 9391618181

తెలంగాణ రాష్ట్రంలో పార్టీ ఫిరాయింపుల పై సానుభూతి పనిచేస్తుందా అన్న చర్చ సర్వత్రా జరుగుతుంది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం ఆవిర్భవించిన ఉద్యమ పార్టీ తెలంగాణ రాష్ట్ర సమితి తెలంగాణ రాష్ట్రం ఏర్పడి అధికారంలోకి రాగానే ఫక్తూ రాజకీయ పార్టీ అంటూ ఇతర పార్టీ నేతలను టిఆర్ఎస్ లో విలీనం చేసుకొని రాజకీయ పార్టీ ఫిరాయింపుల రాజకీయాలకు తెర లేపారు కేసీఆర్. రెండు పర్యాలు అధికారాన్ని కైవసం చేసుకున్న టిఆర్ఎస్ టిడిపి, కాంగ్రెస్, సిపిఐ పార్టీ లలో గెలుపొందిన శాసనసభ్యులను టిఆర్ఎస్ లో చేర్చుకొని వారి రాజకీయ అస్తిత్వాన్ని నిర్వీర్యం చేశారు. అయితే ప్రధానంగా కాంగ్రెస్ పార్టీ నుండి గెలుపొందిన ఎమ్మెల్యేలు టిఆర్ ఎస్‌లో చేరిన వారు ఎక్కువమంది గత అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు తిరస్కరించడంతో పరాజయం పాలయ్యారు. అయితే మూడోసారి అధికారంలోకి వస్తామని ఓవర్ కాన్ఫిడెన్స్ లో ఉన్న టిఆర్ఎస్ కు గట్టి ఎదురుదెబ్బ తగిలి అధికారం కోల్పోయింది. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోతుందని టిఆర్ఎస్ ఎమ్మెల్యేలు తరచూ ప్రకటనలు చేయడంతో కాంగ్రెస్ పార్టీ ఆపరేషన్ ఆకర్ష ప్రారంభించింది.

తెలంగాణ కాంగ్రెస్ పార్టీ గేట్లు తెరిచింది. ఇప్పటివరకు కేవలం మాజీలకు మాత్రమే పరిమితమైన వలసలు సిట్టింగ్ ల వరకు వచ్చేశాయి. రేవంత్ సర్కార్ కూలిపోతుందంటూ చేసిన వ్యాఖ్యలు సీఎం రేవంత్‌రెడ్డిని అలర్ట్ చేసినట్టు కనిపిస్తున్నాయి. మా ప్రభుత్వాన్ని కూల్చాలని ప్రయత్నం చేస్తే ఏం చేయాలో మాకు కూడా వ్యూహం ఉందంటూ రేవంత్ రెడ్డి బహిరంగ సవాల్ చేశారు. మేము మొదలు¯ ఎడితే మీ పార్టీలో ముగ్గురు లేదా నలుగురు మాత్రమే మిగులుతారని హెచ్చరించారు. చెప్పినట్టే వలసలకు గేట్లు ఎత్తారు. ఆ విషయం స్వయంగా రేవంత్ రెడ్డే చెప్పారు. సిట్టింగ్ ఎంపీలు వెంకటేష్ నేత, పసునూరి దయాకర్, రంజిత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో జాయిన్ అయ్యారు. లోక్ సభ ఎన్నికల ముందు వారు పార్టీ మారడం అంత కలవరపెట్టే విషయం కాదు. కానీ ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన బీఆర్ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యే దానం నాగేందర్ కూడా పార్టీ మారడం పార్టీ పెద్దలను ఆందోళనకి గురి చేస్తోంది. ఆయనపై యాక్షన్ తీసుకోవాలంటూ స్పీకర్ కి ఫిర్యాదు చేశారు. మరోవైపు దానం బాటలోనే ఇంకెంతమంది ఎమ్మెల్యేలు పార్టీని వీడతారో అనే భయంలో మొదలైంది. దానం నాగేందర్ ను సికింద్రాబాద్ నుంచి ఎంపీ అభ్యర్థిగా నిలబెట్టాలన్న ఆలోచన కారణంగా ముందుగా పార్టీలో చేర్చుకున్నారు. కానీ బీఆర్ఎస్ఎల్పీని విలీనం చేసుకునే ఉద్దేశంతో చాలా మందితో సంప్రదింపులు జరిపినట్లుగా ప్రచారం జరుగుతోంది. ఎమ్మెల్యేలకు ఉన్న వివిధ రకాల వ్యాపార సమస్యలు, ఇతర అంశాల ఆధారంగా కాంగ్రెస్ నుంచి వస్తున్న ఒత్తిడితో ఎక్కువ మంది పార్టీ మారేందుకు సిద్ధమవుతున్నారని తెలుస్తోంది. దీంతో ఎమ్మెల్యేల కదలికలపై బీఆర్ఎస్ హైకమాండ్ పరిశీలన చేస్తోంది. ఫిరాయిస్తారు అని అనుమానం ఉన్న ఎమ్మెల్యేలను కేటీఆర్, హరీష్ రావులు బుజ్జగించే ప్రయత్నాలు చేస్తున్నారు. కానీ అధికారంలో లేకపోతే ఎలాంటి బుజ్జగింపులు అయినా పని చేయడం కష్టమన్న వాదన ఉంది. కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీల్ని రెండు సార్లు బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్ తమ పార్టీలో విలీనం చేసుకున్నారు. తెలంగాణ ఏర్పడిన కొత్తలో బీఆర్ఎస్‌కు అరకొర మెజార్టీ లభించింది. ఆ సమయంలో ఓటుకు నోటు కేసు బయటపడటంతో .. ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించి.. ఇతర పార్టీల ఎమ్మెల్యేలను బీఆర్ఎస్ లో చేర్చుకున్నారు కేసీఆర్. ఆ సమయంలో ప్రజల మద్దతు లభించింది. దీనికి సాక్ష్యంగా 2018లో జరిగిన ముందస్తు ఎన్నికల ద్వారా తేలిపోయింది. పార్టీ ఫిరాయించిన వారిలో ఒకరిద్దరు తప్ప అందరూ గెలిచారు. కానీ రెండో సారి భారీ మెజార్టీతో గెలిచినప్పటికీ కేసీఆర్ మరోసారి కాంగ్రెస్ ఎమ్మెల్యేల్ని విలీనం చేసుకున్నారు. ఆ సమయంలో ప్రజల మద్దతు లభించలేదు. ఈ ఫిరాయింపుదారులంతా ఇటీవల ఎన్నికల్లో ఓడిపోయారు. రెండు సార్లు కాంగ్రెస్ ఎల్పీల్ని విలీనం చేసుకున్నా తమ పార్టీ గెలిచిందని ఫిరాయింపుల ద్వారా ఏమీ జరగదని .. రేవంత్ రెడ్డి సీఎంగా ఎన్నికయిన తర్వాత ప్రకటించారు. అయితే తమ ప్రభుత్వాన్ని జోలికి వస్తే మాత్రం ఊరుకునేది లేదన్నారు. అయితే రేవంత్ రెడ్డి ఆ మాటలన్న తర్వాత కూడా ప్రభుత్వ మనుగడపై అదే పనిగా బీఆర్ఎస్ నేతలు వ్యాఖ్యలు చేస్తూ వచ్చారు. కేసీఆర్, హరీష్ రావు, కేటీఆర్, కడియం శ్రీహరి లాంటి కీలక నేతలు తరచూ లోక్ సభ ఎన్నికల తర్వాత ప్రభుత్వం ఉండదని చెబుతున్నారు. హస్తం నేతల్ని డిఫెన్స్ లో పడేయడానికి త్వరలో కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోతుంది అంటూ వారు చేసిన కామెంట్స్ చేస్తున్నారు. దీనిపై రేవంత్ రెడ్డి ఇటీవలి కాలంలో తీవ్రంగా స్పందిస్తున్నారు. మానవ బాంబులు అవుతామని కూడా ప్రకటించారు. ఇప్పుడు అదే కారణం చూపించి పార్టీ నేతల్ని.. బీఆర్ఎస్ఎల్పీని విలీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని రాజకీయవర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇక పాడి కౌశిక్ రెడ్డి నాలుగు అడుగులు ముందుకు వేసి మరింత రెచ్చగొట్టినట్టు వ్యాఖ్యలు చేయడం గమనార్హం. "నువ్వు కొట్టినవ్ మేము తీసుకున్నాం.. మేము కొట్టినప్పుడు నువ్వు లేవకుండా అయితవ్.. మేము గేట్లు తెరిచిన రోజు మీరు మొత్తం భుస్థాపితం అయితారు.. సింహం ఒకడుగు వెనక్కి వేసిందంటే నాలుగడుగులు ముందల్కి దుంకడానికే" అంటూ డైలాగ్స్ చెప్పారు. ఇలాంటి వ్యాఖ్యలన్నీ పార్టీకి ఇబ్బందికరంగా మారుతున్నాయి. మరోవైపు కాంగ్రెస్ లోకి, బిజెపిలోకి నేతలు క్యూ కడుతున్నా సానుభూతి మాత్రం లభించట్లేదు. ఎందుకంటే గతంలో కేసీఆర్ చేసింది కూడా ఇదే కాబట్టి. నీవు నేర్పిన విద్యయే నీరజాక్ష అన్నట్లుగా కామెంట్స్ చేస్తున్నారు. దానం వ్యవహారంపై మీడియా సమావేశంలో మాట్లా డిన మాజీ ఎంపీ వినోద్ జంపింగ్ ల విషయంలో బీ ఆర్ ఎస్ చేసిన తప్పే మీరూ చేస్తారా అంటూ ప్రశ్నించారు. మేము తప్పు చేశాము అని స్వయంగా ఒప్పుకున్నట్లు అయింది. కానీ ప్రభుత్వాన్ని పడగొడతాము అని నేరుగా హెచ్చరికలు జారీ చేసిన తర్వాత.. అదే బాటలో వెళ్లకుండా ఎలా ఉంటారన్నది సహజంగా వచ్చే ప్రశ్న. ప్రభుత్వాన్ని కాపాడుకోలేకపోవడం. రేవంత్ రెడ్డి చేతకాని తనం అవుతుంది. ఇదే అవకాశాన్ని ఉపయోగించుకుని రేవంత్ రెడ్డి తన ప్రతాపం చూపిస్తున్నారు. ఈ విషయంలో బీఆర్ఎస్ కు గతంలో తాము చేసిన పనులే ఇబ్బందికరంగా మారుతున్నాయి. పార్లమెంట్ ఎన్నికలు ముంచుకొస్తున్న వేళ అధికారాన్ని చేజిక్కించుకొని కాంగ్రెస్ పార్టీ ఉత్సాహంతో ఉండగా భారత రాష్ట్ర సమితి మరింత డీలపడింది. ఒకవైపు ఆపరేషన్ ఆకర్ష్ లో భాగంగా ఉన్న ఎమ్మెల్యేలు చేజారి పోతుండగా కాళేశ్వరంపై విచారణ కెసిఆర్ కుమార్తె కల్వకుంట్ల కవిత లిక్కర్ కేసులో జైలు పాలు కావడం మరింత ఇబ్బంది పడుతున్నారు. ఈ పరిస్థితుల్లో ఆపరేషన్ ఆకర్ష్ భారత రాష్ట్ర సమితికి సానుభూతి వస్తుందా అన్న చర్చ సాగుతోంది.

# కరువు కోరల్లో గాజా గిలగిల

■ పిల్లలలో పోషకాహార లోపం 16.5% పెరిగిన వైనం ■ ఆహార ట్రక్కులను గాజా లోనికి రాకుండా అడ్డుకుంటున్న ఇజ్రాయిల్ దళాలు ■ ఆహారం అందక అంటువ్యాధులు సోకి మరణిస్తున్న చిన్నారులు ■ సరిపడినంత త్రాగునీరు లభ్యంకాక పోవటంతో మరిన్ని వ్యాధులు ■ కరువు నుంచి కాపాడేందుకు దృష్టి సారించాలి ప్రపంచ దేశాలు



జనక మోహన రావు దుంగ
8247045230

18 మార్చ్ 2024న ఇంటిగ్రేటెడ్ ఫుడ్ సెక్యూరిటీ ఫేజ్ క్లాసిఫికేషన్ (ఐ.పి.సి) విడుదల చేసిన నివేదిక ప్రకారం గాజాలో మారణహోమం ఆగకపోతే మే నెల 2024 నాటికి పాలస్తీనా లోని గాజా ఉత్తర ప్రాంతం కరువు కోరల్లో చిక్కు కుంటుందని అలాగే మిగిలిన ప్రాంతం కూడా ప్రమాదకరంగా మారబోతిందని హెచ్చరించింది. కరువు పరిస్థితులను గుర్తించడంలో మిలియన్ల మంది ప్రాణాలను కాపాడేందుకు అవసరమైన ప్రతిస్పందనను తెలియజేయడంలో ఐపిసి కీలక పాత్ర పోషిస్తుంది. ఐపిసి ప్రకటన గాజా ప్రజలు ఎదుర్కొంటున్న భయంకరమైన పరిస్థితిని ఎత్తిచూపింది. సంక్షోభానికి ముందు గాజాలో జనాభాకు సరిపోయినంత ఆహారం ఉండేది. 5 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలలో 0.8% మంది మాత్రమే తీవ్రమైన పోషకాహార లోపంతో ఉండేవారు. ఉత్తర ప్రాంతాలలో ఈ ఫిబ్రవరి నాటికి ఆ సంఖ్య 12.4%మరియు 16.5% మధ్య ఉంది. ఇప్పుడు ప్రజలు చనిపోతున్నారు. ఇంకా చాలా మంది అనారోగ్యంతో ఉన్నారు. బయట నుండి ఎక్కువ ఆహారాన్ని అనుమతించకపోతే మిలియన్ మందికి పైగా ప్రజలు ఆకలిని విపత్తు ఎదుర్కొంటారు. గాజాలో సగం మంది సుమారు 10 లక్షల ప్రజలు ఆహార భద్రతను కలిగిలేరు. ఉత్తర భాగం జనాభాలో 70 శాతం అంటే సుమారు 2,10,000 మంది కరువు విపత్తులో భాగం అవుతారు. మానవతా సంస్థలు పంపించే ఆహారంతో కూడిన ట్రక్కులను గాజా లోనికి పంపించకుండా మోకాలడ్డుతున్న ఇజ్రాయిల్ దళాలు ఈ విపత్తుకు కారకులవుతారు. ఇప్పటికీ ఈ ప్రాంతాలలో సరిపడినంత త్రాగునీరు లభ్యంకావడం లేదు. పిల్లలు తినడానికి పెద్దలు తమ భోజనాన్ని తగ్గిస్తున్నారు. ప్రస్తుత పరిస్థితి వేలాది మంది జీవితాలు మరియు ఆరోగ్యంపై దీర్ఘకాలిక ప్రభావాలను చూపుతుంది. తీవ్రమైన పోషకాహార లోపం వలన ఇతరేతర అంటువ్యాధులు సోకి పిల్లలు మరణిస్తున్నారు. పరిశుభ్రత, పారిశుద్ధ్య సేవల లోపం దీర్ఘకాలిక ప్రభావాలు చూపి పిల్లల మొత్తం ఎదుగుదలను నిరోధిస్తుంది. కరువు పరిస్థితులలో గాజా ప్రాంతంలో ప్రాణాలను రక్షించే శస్త్రచికిత్సలు లేకపోవడం, అవయవాలను కోల్పోయే జనాలు, క్యాన్సర్, డయాబెటిస్‌తో బాధపడుతున్న రోగులు, జన్మనిచ్చిన తల్లులు, నవజాత శిశువులు, అందరూ ఆకలితో బాధపడటం, దానిని వెంటాడే వ్యాధుల నుండి కోలుకోవడానికి ప్రయత్నించడం కరువు పరిస్థితులలో కలగొచ్చు.

కరువు రాకుండా ఉండాలంటే ప్రపంచ దేశాలు దృష్టి పెట్టాలి. గాజాలోని అన్ని కీలకమైన ఆసుపత్రులలో మరింత పోషకాహారం, స్థిరీకరణ కేంద్రాలను జోడించాల్సిన అవసరం ఉంది. స్థానికంగా పోషకాహార లోపాన్ని నివారించడానికి స్వచ్ఛంద కమ్యూనిటీలకు మద్దతు అవసరం. గాజా స్ట్రిప్‌కు మానవతావాద అందుబాటు పునరుద్ధరించేందుకు కృషి చేయాలి. ఆహారం, నీరు, మందులు, పౌరులకు రక్షణ, అలాగే ఆరోగ్యం, నీరు మరియు పారిశుద్ధ్య సేవలు, విద్యుత్, డీజిల్ ఇతర ఇంధనాలు పునరుద్ధరించడానికి అందించడానికి అన్ని ప్రయత్నాలు చేయాలి. ఆహారం, మందులు, స్పెషలిస్ట్ న్యూట్రిషన్ ఉత్పత్తులు, ఇంధనం ఇతర అవసరాలకు మాత్రమే పరిమితం కాకుండా తగినన్ని సహాయ వస్తువుల నిరంతర సరఫరాని మొత్తం గాజా స్ట్రిప్‌లో రోడ్డు మార్గంలో ప్రవేశించడానికి తరలించడానికి అనుమతించబడాలి. అవసరమైన వస్తువుల పరిమాణానికి అనుగుణంగా వాణిజ్య వస్తువుల ట్రాఫిక్‌ను కూడా పూర్తిగా పునరుద్ధరించాలి. చిన్న పిల్లలకు,గర్భిణీ, పాలిచ్చే స్త్రీలకు, దీర్ఘకాలికంగా అనారోగ్యంతో ఉన్నవారికి, వృద్ధులకు కాంప్లిమెంటరీ ఫుడ్స్ మైక్రోన్యూట్రియెంట్ సప్లిమెంట్లను అందించాలి. సాధ్యమయ్యే చోట మార్కెట్ సదుపాయాలు కల్పించాలి. హార్టికల్చర్, పశువులు చేపలు పట్టడం వంటి ఆహార ఉత్పత్తి వ్యవస్థలను వీలైనంత త్వరగా పునరుద్ధించాలి. అన్నింటికీ మించి యుద్ధం ఆగడానికి ఐక్యరాజ్యసమితితో పాటు ప్రాపంచిక దేశాలు ప్రయత్నించాలి.

## మేము ఇంకా గేట్లు తెరవలేదు

- తెరిస్తే బీఆర్ఎస్, బీజేపీ పార్టీల్లో నేతలు ఎవరూ ఉండరు
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



తెలంగాణ బ్యూరోప్రతినిధిః తాము ఇంకా గేట్లు తెరవలేదని.. తెరిస్తే బీఆర్ఎస్, బీజేపీ పార్టీల్లో నేతలు ఎవరూ ఉండరని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్ లోకి రమ్మని తాము ఎవరిని అడగటం లేదని.. స్వచ్ఛందంగా నేతలే తమ పార్టీలో చేరుతామని వస్తున్నారని వివరించారు. గురువారం నాడు ఖమ్మం జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ... ప్రస్తుత పరిస్థితుల్లో పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ డబుల్ డిజిట్ ఎంపీ సీట్లు గెలవబోతుందని ధీమా వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కొంతమంది నేతల ఫోన్లను ట్యాపింగ్ చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అలాంటి చర్యలకు పాల్పడదని.. అధికారం ఎక్కడ కోల్పోతామని కేసీఆర్ భయపడి ఇష్టరీతిగా ఫోన్లను ట్యాప్ చేశారని మండిపడ్డారు. తమకు అలాంటి భయం లేదని అన్నారు. బీఆర్ఎస్ మీద తాము కక్ష పూరితంగా కేసులు పెట్టలేదన్నారు. ఆ కేసులన్నీ గులాబీ నేతలు అధికార దుర్వినియోగంతో చేసిన తప్పులేనని అన్నారు. జలాశయాల్లో నీరు లేకపోవడం, పంటలు ఎండిపోయిన ఫొటోలు, వీడియోలను చూపిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వంపై కొన్ని మీడియా సంస్థలు దుష్ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. తమ ప్రభుత్వం ఏర్పడింది డిసెంబర్‌లోనని.. రాబోయే ఎండాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని నీటి నిల్వలు ఉంచాల్సిన బాధ్యత గత బీఆర్ఎస్ ప్రభుత్వంపైనే ఉందన్నారు.

## ఫ్లైట్ టికెట్ కొనలేం..
# ట్రైన్‌లో వెళ్లలేం



### మా అకౌంట్స్ అన్నీ సీజ్ చేశారు

- ఇప్పుడు నడిరోడ్డు మీద నిలబడ్డాం
- దేశంలో ప్రజాస్వామ్యమే లేకుండా పోయింది
- మమ్మల్ని అన్ని రకాలుగా బంధించేశారు
- కాంగ్రెస్ ముఖ్య నేత రాహుల్ గాంధీ ఆవేదన

న్యూఢిల్లీ.. కాంగ్రెస్ అకౌంట్లను ఫ్రీజ్ చేయడం దారుణమని రాహుల్ మండిపడ్డారు. పెద్ద పెద్ద విషయాలను వదిలేయండి..కనీసం తాము తమ అకౌంట్ నుంచి రెండు రూపాలయను కూడా ఖర్చు పెట్టలేకుండా చేశారని రాహుల్ ఆవేదన వ్యక్తం చేశారు. అక్రమంగా కాంగ్రెస్ అకౌంట్స్ను ఫ్రీజ్ చేశారు. రాజ్యాంగ సంస్థల్ని కూడా దుర్వినియోగం చేస్తున్నారు. నిజానికి ఇది మా ఖాతాలను సీజ్ చేయడం కాదుప్రజాస్వామ్యాన్ని సీజ్ చేయడం అని రాహుల్ ఆరోపించారు. తమపై క్రిమినల్ యాక్షన్ తీసుకుంటున్నారుకాంగ్రెస్ను ఆర్థికంగా దెబ్బకొట్టాలని ప్రయత్నిస్తున్నారని రాహుల్ గాంధీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంత జరిగినా ఈడీ దీని మీద స్పందించడంలేదని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన బ్యాంకు ఖాతాలను నెల రోజుల క్రితమే సీజ్ చేసేశారు. ఎన్నికలు దగ్గర పడుతున్నాయి.. దేశంలోని 20% ప్రజలు కాంగ్రెస్కు ఓటు వేస్తారుకానీ ఈ రోజు మేము రైల్వే టిక్కెట్లు కొనలేని.. ప్రకటనలు కూడా ఇవ్వలేని పరిస్థితుల్లో ఉన్నామని చెప్పుకొచ్చారు. ఇది కచ్చితంగా కాంగ్రెస్ప్రధాని కావాలని కుట్ర చేస్తున్నారని రాహుల్ మండిపడ్డారు. ఈరోజు దేశంలో ప్రజాస్వామ్యమే లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎలక్షన్ ప్రచారంలో కాంగ్రెస్ తరువు నుంచి ఒక్క యాడ్ కూడా ఇవ్వలేని పరిస్థితుల్లో ఉన్నాము. ఎలక్షన్ కమీషన్ కనీసం దీని గురించి పట్టించుకోవడం లేదు. మీడియా కూడా మా సమస్య అర్థం చేసుకోవడం లేదు. వ్యవస్థలన్నీ మూకుమ్మడిగా ఫెయిల్ అయ్యాయని రాహుల్ గాంధీ ఆరోపించారు. ఈ అకౌంట్ల సీజింగ్ సమస్య ఒక కుటంబానికి వస్తేఆ కుటుంబం మొత్తం ఆత్మహత్య చేసుకోవాలి. అదే ఒక వ్యాపారసంస్థకు వస్తేవాళ్ళు వ్యాపారాన్ని మూసేసుకోవాలి.

ఇప్పుడు మేము అలాంటి పరిస్థితుల్లోనే ఉన్నామని వివరించారు రాహుల్ గాంధీ. తాము కనీసం ఎన్నికల ప్రచారానికి రైల్లో కూడా వెళ్ళలేని పరిస్థితుల్లో ఉన్నామని చెప్పారు. 14 లక్షలకు సంబంధించిన ఎప్పటిదో 90ల్లో కేసుకు ఇప్పుడు మా బ్యాంకు అకౌంట్లను సీజ్ చేశారు. ఇది ఎంత వరకు న్యాయమని రాహుల్ వాపోయారు. ఎలక్టోరల్ బాండ్స్ మీద కాంగ్రెస్ పెద్దలు ఈరోజు ఢిల్లీలో మీడియా సమావేశం పెట్టారు. ఇందులో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, అజయ్ మాకెన్ మరికొందరు నేతలు పాల్గొన్నారు. ఇందులో మొదటగా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జు ఖర్గే మాట్లాడుతూ..ఎన్నికలు నిష్పక్షపాతంగా జరగాలి అన్నారు. మోదీ సర్కార్ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ బ్యాంక్ అకౌంట్లను సీజ్ చేశారునిష్పక్షపాత ఎన్నికలు ఎక్కడా జరగడం లేదని ఆరోపించారు ఖర్గే. బీజేపీకి ఏ ఏ కంపెనీలు విరాళాలిచ్చాయో త్వరలోనే తెలుస్తుంది..బీజేపీకి 56 శాతం ఎన్నికలు బాండ్ల రూపంలో వచ్చాయి.

ఈ విషయాలన్నీ త్వరలోనే బయటకు వస్తాయని అన్నారు. కాంగ్రెస్కు 11శాతం మాత్రమే ఎలక్టోరల్ బాండ్స్ వచ్చాయి. అయినా కేంద్రం దాన్ని పెద్ద ఇష్యూ చేస్తోందని ఖర్గే ఆరోపించారు. రాజకీయపార్టీలు ఐటీ పరిధిలోకి రావని.. ఎలక్టోరల్ బాండ్ల ద్వారా బయటపడిన సమాచారంపై విచారణ జరగాల్సిందేనని ఖర్గే డిమాండ్ చేశారు. మా అకౌంట్లను ప్రభుత్వం సీజ్ చేసిందనికేంద్ర తీరు ఏ మాత్రం బాగాలేదని మండిపడ్డారు కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు సోనియా గాంధీ. ప్రజాస్వామ్యాన్ని కేంద్రం ఖూనీ చేస్తోందని ఆరోపించారు. ఈ రకమైన కేంద్ర వైఖరిని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు సోనియా గాంధీ. కాంగ్రెస్ను ఆర్థికంగా ఇబ్బంది పెట్టేందుకు బీజేపీ ప్రభుత్వం కుట్ర చేస్తోంది ఆరోపించారు. తక్షణమే కాంగ్రెస్ అకౌంట్లపై ఫ్రీజ్ తొలగించాలని సోనియా డిమాండ్ చేశారు.

## కాంగ్రెస్‌కు ఖమ్మం టెన్షన్




- టికెట్ కోసం ముగ్గురు మంత్రుల మధ్య పోటీ
- తన భార్య నందినికి టికెట్ కోసం డిప్యూటీ సీఎం గట్టి ప్రయత్నం
- తమ్ముడు ప్రసాద్ రెడ్డికి టికెట్ ఇప్పించేందుకు పొంగులేటి
- కొడుకు యుగేందర్‌కు టికెట్ ఇప్పించేందుకు తుమ్మల
- ఎవరికి కేటాయించాలో తేల్చుకోలేక పోతున్న ఏఐసీసీ

తెలంగాణ బ్యూరోప్రతినిధిః తెలంగాణలో అధికార కాంగ్రెస్ పార్టీకి ఖమ్మం లోక్ సభ స్థానంపై టెన్షన్ నెలకొంది. ఖమ్మం పార్లమెంట్ టిక్కెట్ కోసం ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు పోటీ పడుతున్నారు. తన భార్య నందినికి ఖమ్మం టికెట్ కోసం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. మరోవైపు తన తమ్ముడు ప్రసాద్ రెడ్డికి టికెట్ ఇప్పించేందుకు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. అలాగే తన కొడుకు యుగెందర్‌కు ఖమ్మం టికెట్ ఇప్పించేందుకు తుమ్మల నాగేశ్వరరావు ప్రయత్నిస్తున్నారు. ఇలా ఖమ్మం లోక్ సభ స్థానం టికెట్ కోసం ముగ్గురు నేతల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. దీంతో ముగ్గురిలో టికెట్ ఎవరికి ఇవ్వాలో ఏఐసీసీ తేల్చుకోలేకపోతుంది. ఈ క్రమంలోనే మంత్రుల మధ్య సయోధ్య కుదిర్చే బాధ్యతను ఏఐసీసీ ఇంచార్జ్ మున్షీకి అప్పగించింది. సాయంత్రం మున్షీ ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లా ముఖ్య నేతల సమావేశం జరగనుంది. ఈ సమావేశానికి భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు హాజరుకానున్నారు కాగా..ఈ మధ్య జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు జరిగే సార్వత్రిక ఎన్నికల్లో తన సత్తా చాటాలని కాంగ్రెస్ తహతహలాడుతోంది. జరుగబోయే లోక్‌సభ ఎన్నికల్లో పది సీట్లకు పైగా గెలిచి రాష్ట్రంలో మరోసారి ఆధిపత్యం కొనసాగించాలని ఆ పార్టీ నేతలు వ్యూహాత్మకంగా ముందుకు సాగుతున్నారు.

ఇందులో భాగంగా మొత్తం 17 ఎంపీ స్థానాలున్న తెలంగాణలో 13 స్థానాల్లో అభ్యర్థుల్ని ఖరారు చేయాల్సి ఉంది. తాజాగా వీటిలోని ఏడు స్థానాలపై ఏకాభిప్రాయం కుదిరినట్లుగా తెలుస్తోంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే.. పార్టీ అగ్రనేత సోనియాగాంధీతో పాటు పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ లు కలిసి నిర్వహించిన సమావేశంలో తెలంగాణ అభ్యర్థులపై పెద్ద ఎత్తున చర్చ జరిగింది. దీనికి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కం పీసీసీ ప్రెసిడెంట్ రేవంత్ రెడ్డి.. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క.. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి.. రాష్ట్ర వ్యవహారాల ఇన్ ఛార్జి దీపా దాస్ మున్షీలు హాజరయ్యారు. ఇంకా ప్రకటించాల్సి ఉన్న 13 స్థానాల్లో ఏడింటిపైన నిర్ణయం తీసుకున్నారు. మిగిలిన స్థానాలపై మరోసారి చర్చ జరపాలని భావించారు. ఖరారు చేసిన ఏడు స్థానాలపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. ని చెబుతున్నారు. ఇంతకూ అభ్యర్థులు ఎవరంటే? 1. పెద్దపల్లి గడ్డం వంశీ 2. చేవెళ్ల రంజిత్ రెడ్డి 3. మల్కాజిగిరి సునీతా రెడ్డి 4. నాగర్ కర్నూల్ మల్లు రవి 5. అదిలాబాద్ ఆత్రం సుగుణ 6. సికింద్రాబాద్ దానం నాగేందర్ 7. మెదక్ నీలం మధు ఇక.. భువనగిరి టికెట్ పై చర్చ జరిగినా ఏకాభిప్రాయం రాలేదు. చామల కిరణ్ కుమార్ రెడ్డి పేరును రాష్ట్ర కమిటీ ప్రతిపాదిస్తే.. దానికి బదులుగా కోమటిరెడ్డి లక్ష్మీకి టికెట్ కేటాయించాలన్న ప్రతిపాదన వచ్చింది. దీంతో ఈ అంశాన్ని తర్వాత సమావేశానికి వాయిదా వేశారు. ఇక.. ఖమ్మం.. వరంగల్.. హైదరాబాద్.. నిజామాబాద్.. కరీంనగర్ నియోజకవర్గాలకు ధీటైన అభ్యర్థుల్ని బరిలోకి దింపాలన్న యోచనలో కాంగ్రెస్ ఉంది. ఎంపీ ఎన్నికల్లో 12 – 13 స్థానాల్లో గెలవాలన్న పట్టుదలతో కాంగ్రెస్ ఉంది. ఈ నేపథ్యంలో పెద్ద ఎత్తున కసరత్తు చేస్తున్నట్లుగా చెబుతున్నారు. ఏకాభిప్రాయంతో అభ్యర్థుల్ని ప్రకటిస్తే గెలువు అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్న మాట వినిపిస్తోంది.



## బీసీల్లారా కలిసి రండి

- వాటా కోసం పోరాటం చేద్దాం
- పార్టీలకతీతంగా ఏకం కావాలి
- రాజ్యాంగబద్ధమైన హక్కులు సాధించుకోవాలి
- బీసీలకు అన్ని రాజకీయ పార్టీలు 10 ఎంపీ సీట్లు ఇవ్వాలి
- బీసీ వ్యతిరేక పార్టీలకు గుణపాఠం తప్పదు
- రేపు బీసీల జోడో సామాజిక న్యాయ యాత్ర
- జాతీయ బీసీ యువజన సంఘం సమావేశంలో ఎంపీ ఆర్.కృష్ణయ్య

తెలంగాణ బ్యూరోప్రతినిధిః ప్రపంచదేశాల్లో అణిచివేత, దోపిడీ, పీడన, వివక్షతపై తిరుగుబాటు జరిగి విప్లవాలు పుట్టుకొచ్చాయని, దీంతో బానిస సంకెళ్ల నుంచి ప్రజలు విముక్తులైన ఘటనలను ప్రజాస్వామ్య వాదులు మరిచిపోకూడదని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య హెచ్చరించారు. రష్యా, చైనా, జపాన్ వంటి దేశాలు తిరుగుబాటు తరువాతనే అభివృద్ధి చెందాయన్నారు. అందుకోసం రాజ్యాంగ బద్ధమైన హక్కులు సాధించుకోవడానికి రాజకీయ పార్టీలకతీతంగా బీసీలంతా ఏకం కావాలని పిలుపునిచ్చారు. దేశానికి స్వాతంత్రం వచ్చి ఏడు దశాబ్దాలు గడిచిపోయినా.. బీసీలను ఇంకా అణిచివేస్తున్నారని, అన్ని రంగాలలో తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. గురువారం కాచిగూడలోని హోటల్ అభినందన్‌లో జాతీయ బీసీ యువజన సంఘం అధ్యక్షుడు గవ్వల భరత్ కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ సమన్వయం చేశారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ రాబోయే పార్లమెంటు ఎన్నికలలో బీసీలకు 10 పార్లమెంటు సిట్లు ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీకి, బిజెపి పార్టీకి, బిఆర్ఎస్. పార్టీ అధ్యక్షులను కోరారు. బి.సి ఉద్యమం ఉధృతం చేయడానికి తెలంగాణ జిల్లాల వారిగా బి.సి బోడో యాత్ర నిర్వహించాలని ఈ సమావేశంలో తీర్మానం చేశారు. బి.సి డిమాండ్లపై విదాన ప్రకటన చేసి తమ తమ మేనిఫెస్టో లో ప్రకటించాలి. 15 లక్షల ఉద్యోగాలను ప్రకటించాలి. లేనిచో పార్టీలను చిత్తుగా ఓడిస్తాం. పోయిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలు బీపీలకు చాలా తక్కువ సీట్లు ఇచ్చారు. అధికార పార్టీ ప్రతిపక్ష పార్టీల మధ్య హోరాహోరీ పోరు యున్నందున గెలువు గుర్రాలు, ఆర్థిక బలం అంటూ బీసీ అభ్యర్ధులకు అన్యాయం చేశారు. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ అధికారంలో యుంది. బిఆర్ఎస్ పార్టీలలో బలంగా యున్నవి. బిజెపి కేంద్రంలో అధికారంలో యుంది. బి.సి.లకు ఇవ్వడానికి ఎవరు సాకులు చెప్పనవసరం లేదు. ఈ మూడు పార్టీలు బి.సి.లకు ఇస్తే గెలిపించుకుంటామన్నారు. గతంలో అన్ని రాజకీయ పార్టీలు సామాజిక న్యాయం నినాదం ఇస్తూ పరుగులు తీస్తుంటే మన రాష్ట్రంలో అన్ని స్థాయిలలో టికట్ల కటాయింపులలో, నామినేటెడ్ పోస్టుల కేటాయింపులలో బీసీలకు అన్యాయం చేస్తున్నారు.

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పోటీపడి బీసీలకు అన్యాయం చేస్తున్నాయి.మొత్తం కేంద్ర బడ్జెట్ 47 కోట్ల 65లక్షల 768 కోట్లు బడ్జెటులో బీసీల సంక్షేమానికి బిక్షం ఇచ్చినట్లుగా కేవలం 2150. కోట్లు బడ్జెటు మాత్రమే కటాయించి బీసీలకు అన్యాయం చేశారని విమర్శించారు.కేంద్ర బడ్జెట్ లో బీసీలకు కేటాయించిన మొత్తం చూస్తే, దేశంలో 75 కోట్ల మంది బీసీలకు పంచిత దాక్లెట్లు- బిస్కెట్లు కూడా రావని అన్నారు. కేంద్ర స్థాయిలో స్కాలర్ షిప్, ఫీజుల రియంబర్స్మెంట్ స్కీములు, హాస్టళ్ళు లేవు. గురుకుల పాఠశాలలు లేవు. వీటిని నిర్వహిస్తున్న రాష్ట్రాలకు మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వడం లేదు. కులవృత్తులకు స్వయంగా ఉపాధి పథకాలకు, జాతీయ బిసి కార్పొరేషన్ ద్వారా ఎలాంటి సబ్సిడీ రుణాలు ఇవ్వడం లేదు. ఆర్థికంగా ఈ కులాల అభివృద్ధికి ఎలాంటి స్కీములు లేవు. జాతీయ బిసి కార్పొరేషన్ కు బడ్జెట్ కేటాయించకుండా నిర్వీర్యం చేశారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం బి.సి జనాభా లెక్కలు తీయకుండా బికించి అన్యాయం చేస్తుందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం బీసీ వ్యతిరేక వైఖరి మార్చుకోవాలని హెచ్చరించారు. ఈ సమావేశంలో తెలంగాణ నిరుద్యోగ జేఏసీ ఛైర్మన్ నీలం వెంకటేశ్, రాజేందర్, అంజి, సుధాకర్, రామకృష్ణ, అనంతయ్య, కోట్ల శ్రీనివాస్, పగిళ్ల సతీష్, తదితరులు పాల్గొన్నారు.

## అరుణాచల్ భారత్‌దే



- చైనాకు తేల్చిచెప్పిన అగ్రరాజ్యం
- చైనా చేస్తున్న వాదనలన్నీ అసంబద్ధమైనవే
- చైనా ప్రయత్నాలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్న అమెరికా అధికార ప్రతినిధి

వాషింగ్టన్: భారత భూభాగమైన అరుణాచల్ప్రదేశ్పై చైనా అసంబద్ధ వైఖరిని అగ్రరాజ్యం అమెరికా తీవ్రంగా తప్పుబట్టింది. ఆ భూభాగం ఎప్పటికీ.. భారత్దేనని తేల్చి చెప్పింది. దాన్ని మార్చడానికి చేసే ప్రయత్నాలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని అమెరికా విదేశాంగ శాఖ ప్రిన్సిపల్ డిప్యూటీ అధికార ప్రతినిధి వేదాంత్ పటేల్ బుధవారం వెల్లడించారు. వాస్తవాధీన రేఖ వెంట చేసే ఆక్రమణ యత్నాలను తిప్పికొడుతున్నట్లు స్పష్టం చేశారు. అరుణాచల్ప్రదేశ్పై గతకొన్నేళ్లుగా చైనా మొండి వాదనలు వినిపిస్తున్న విషయం తెలిసిందే. ఆ ప్రాంతం తమ భూభాగంలోనిదేనని ఇటీవల ఆ దేశ రక్షణ శాఖ అధికార ప్రతినిధి సీనియర్ కర్నల్ ఝాంగ్ షియాంగాంగ్ అసంబద్ధ వాదనలకు దిగారు. దీన్ని భారత్ దీటుగా తిప్పికొట్టింది. అరుణాచల్ తమ దేశంలో విడదీయరాని భాగమని, నిరాధార వాదనలను వల్లె వేయడం ద్వారా వాస్తవాలు మారిపోవని డ్రాగన్కు మరోసారి స్పష్టం చేసింది. అభివృద్ధి కార్యక్రమాలు, మౌలిక సదుపాయాల ప్రాజెక్టులతో అక్కడి పౌరులు ప్రయోజనం పొందుతూనే ఉంటారని విదేశాంగశాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైశ్వాల్ మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. అరుణాచల్లో ఇటీవల ప్రధాని మోదీ పర్యటన చేపట్టిన విషయం తెలిసిందే. చైనా- భారత్ సరిహద్దులోని తవాంగ్కు సైనిక బలగాలను, సాయుధ సంపత్తిని తరలించేందుకు ఉపయోగపడే సేలా సొరంగ మార్గాన్ని ఆయన ప్రారంభించారు. అయితే, ఈ రాష్ట్రాన్ని చైనా జాంగ్నన్ (దక్షిణ టిబెట్)గా పేర్కొంటోంది. ఈ క్రమంలోనే మోదీ పర్యటనపై అక్కసు వెళ్లగక్కింది. అది తమ భూభాగమంటూ మళ్లీ పాత పాటే పాడడం మొదలుపెట్టింది.

## వికసిత భారత్ సందేశాలు ఆపండి
### కేంద్రానికి ఈసీ ఆదేశం




డిల్లీ: వాట్సప్లో వికసిత భారత్ సందేశాలను పంపడం వెంటనే ఆపివేయాలంటూ కేంద్రాన్ని ఎన్నికల సంఘం ఆదేశించింది. ఈ మేరకు గురువారం ఐటీ మంత్రిత్వ శాఖకు ఆదేశాలు ఇచ్చింది. ఈ అంశంపై ఫిర్యాదులు అందిన నేపథ్యంలో ఈ చర్యలు తీసుకుంది. పారదర్శకతను నిర్ధరించేందుకు మేం తీసుకుంటున్న చర్యలో ఇదొక భాగం అని ఎన్నికల సంఘం వెల్లడించింది. కొద్దిగంటల్లో ఎన్నికల షెడ్యూల్ వస్తుందనగా ప్రధాని మోదీ లేఖతో ఉన్న వాట్సప్ సందేశాలను కేంద్రం పంపింది. వికసిత భారత్ సంపర్క్ పేరిట అవి వస్తున్నాయి. నెట్వర్క్ పరిమితుల కారణంగా మార్చి 16న పంపిన సందేశాలు కొందరికి ఆలస్యంగా డెలివరీ అవుతున్నాయని ఈసీకి ఐటీ శాఖ వెల్లడించింది. సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ ప్రకటన, కోడ్ అమల్లోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ కార్యక్రమాలను ప్రచారం చేసే మెసేజ్లు వస్తున్నాయని ఈసీకి ఫిర్యాదులు అందాయి. కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్ అభ్యంతరాలను వ్యక్తం చేశాయి. కోడ్ ఉల్లంఘనలపై చర్యలు తీసుకోవాలని కోరాయి. ఈ క్రమంలోనే ఈసీ నుంచి తాజా స్పందన వచ్చింది.

## ప్రణీత్ కస్టడీ సరైందే
### తేల్చేసిన తెలంగాణ హైకోర్టు



తెలంగాణ బ్యూరోప్రతినిధి: ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎస్ఐబీ మాజీ డీఎస్పీ ప్రణీత్ రావుకు తెలంగాణ హైకోర్టులో చుక్కెదురైంది. పోలీస్ కస్టడీని సవాల్ చేస్తూ దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. నాంపల్లి కోర్టు కస్టడీని సవాలు చేస్తూ హైకోర్టులో ప్రణీత్ పిటిషన్ దాఖలు చేయగా.. (బుధవారం) విచారణ జరిగింది. ఇరువురి వాదనలు విన్న హైకోర్టు తీర్పును రిజర్వ్ చేసింది. తాజాగా గురువారం ప్రణీత్ రావు పిటిషన్‌ను కొట్టివేస్తున్నట్లు హైకోర్టు తీర్పును వెల్లడించింది. ప్రణీత్ రావ్ కస్టడీపై కింది కోర్టు ఇచ్చిన కస్టడీ అనుమతి సరైందే అని హైకోర్టు ధర్మాసనం పేర్కొంది. కాగా.. వాస్తవాంశాలను పరిగణలోకి తీసుకోకుండా కింది కోర్టు కస్టడీకి ఇచ్చిందంటూ ప్రణీత్ రావు హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌లో పేర్కొన్నారు. కస్టడీ సమయంలో సుప్రీంకోర్టు మార్గదర్శకాలను పాటించలేదని పేర్కొన్నారు. పోలీస్ స్టేషన్‌లో నిద్రపోవడానికి సరైన సౌకర్యాలు కూడా లేవని వెల్లడించారు. విచారణ పూర్తన తర్వాత తిరిగి జైలుకు తరలించేలా ఆదేశాలివ్వాలన్నారు. దర్యాప్తులోని అంశాలను మీడియాకు లీక్ చేస్తున్నారనా పిటిషన్‌లో పేర్కొన్నారు. ఎందుకు లీక్ చేస్తున్నారో అందరికీ తెలిసిన విషయమేనని ప్రణీత్ రావు అన్నారు. రహస్యం పేరుతో బంజారాహిల్స్ పీఎస్‌లో విచారిస్తున్నారని.. బంధువులు, న్యాయవాదిని కూడా అనుమతించడం లేదని తెలిపారు. ఇంటరాగేషన్‌లో ఏఎస్పీ డి.రమేశ్ పాల్గొనకుండా నియంత్రించాలని కోరారు. ఇప్పటికే సమాచారం అందించినందున కస్టడీ రద్దు చేయాలని ప్రణీత్ రావు పిటిషన్‌లో పేర్కొన్నారు.

## ఎన్నికల బాండ్ల పూర్తి వివరాలు ఇచ్చేశాం
### సుప్రీంలో ఎస్బీఐ అఫిడవిట్




డిల్లీ: ఎన్నికల బాండ్ల వ్యవహారంలో సుప్రీం కోర్టు ఆగ్రహం వ్యక్తంచేయడంతో భారతీయ స్టేట్ బ్యాంక్() దిద్దుబాటు చర్యలు చేపట్టింది. సీరియల్ నంబర్లతో సహా బాండ్ల వివరాలను కేంద్ర ఎన్నికల సంఘానికి అందజేసింది. ఈమేరకు కోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది. సుప్రీం ఆదేశాలకు అనుగుణంగా ఎన్నికల బాండ్లకు సంబంధించిన అన్ని వివరాలను ఎలక్షన్ కమిషన్కు అందజేశాం. భద్రతా కారణాల దృష్ట్యా బ్యాంకు ఖాతాల నంబర్లు, కేవైసీ వివరాలను బహిర్గతం చేయలేదు అని పేర్కొంది. ఎన్నికల బాండ్లను రద్దు చేస్తూ ఫిబ్రవరిలో సుప్రీంకోర్టు సంచలన తీర్పు వెలువరించిన విషయం తెలిసిందే. గత ఐదేళ్లలో జారీ చేసిన బాండ్ల వివరాలను ఈసీకి అందించాలని ఎస్బీఐని ఆదేశించింది. ఆ సమాచారాన్ని కేంద్ర ఎన్నికల సంఘానికి సమర్పించిన బ్యాంకు.. బాండ్ల ఆల్ఫా న్యూమరిక్ నంబర్లను మాత్రం బయటపెట్టలేదు.

ఏ వ్యక్తి/సంస్థ బాండ్లను ఏ పార్టీకి విరాళంగా ఇచ్చారని తెలిపే ఈ నంబర్లు లేకపోవడంపై సుప్రీంకోర్టులో మరో పిటిషన్ దాఖలైంది. దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం బ్యాంకు తీరుపై అసహనం వ్యక్తంచేసింది. ఎన్నికల బాండ్లకు సంబంధించిన పూర్తి వివరాలను (నంబర్లతో సహా) ఈసీకి ఇచ్చేశామని చెబుతూ మార్చి 21 (గురువారం) సాయంత్రం 5 గంటల్లోగా సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేయాలని ఎస్బీఐ ఛైర్మన్ను ధర్మాసనం ఆదేశించింది. ఈ క్రమంలోనే బ్యాంకు వివరాలు సమర్పించింది. వాటిని ఎన్నికల సంఘం తన వెబ్సైట్లో అప్లోడ్ చేయనుంది.

### మహారాష్ట్ర, అరుణాచల్‌లో
## వరుస భూకంపాలు..
### భయంతో జనం పరుగులు

న్యూఢిల్లీ: మహారాష్ట్ర, అరుణాచల్ ప్రదేశ్ లోని గురువారం తెల్లవారుజామున వరుస భూకంపాలు వణికించాయి. మహారాష్ట్రలోని నాందేడ్ లో కేవలం నిమిషాల వ్యవధిలోనే ప్రకంపనలు జరిగినట్లు నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ వెల్లడించారు. మీడియాకు అందిన సమాచారం ప్రకారం మహారాష్ట్ర లోని హింగోలి నగరంలో గుగువారం ఉదయం పది నిముషాల వ్యవధిలో ఉదయం 6గంటల 8నిముషాలకు భూకంపం సంభవించింది. ఈ భూకంపం తీవ్రత రిక్టర్ స్కేల్ పై 4.2 గా నమోదైంది. ఆ తర్వాత మళ్లీ 6:19 గంటలకు రెండో సారి భూమి కంపించింది. అప్పుడు రిక్టర్ స్కేలుపై భూకంపం తీవ్రత 3.6 గా నమోదైనట్లు సెంటర్ ఫర్ సిస్మోలజీ వెల్లడించారు. భూమికి 10 కిలోమీటర్ల లోతులో భూకంపం కేంద్రీకృఎతమైనట్లు తెలిపింది.

ఈ భూప్రకంపనల వల్లన ఎలాంటి ఆస్తి నష్టం కాని, ప్రాణ నష్టం కానీ జరిగినట్లు ఎటువంటి సమాచారం లేదు. మహారాష్ట్ర కంటే ముందే అరుణాచల్ ప్రదేశ్ లో గురువారం ఉదయం రెండుసార్లు భూకంపం సంభవించింది. సెంటర్ ఫర్ సిస్మోలజీ వివరించిన వివరాల ప్రకారం తెల్లవారుజామున 01:49 గంటల సమయంలో 3.7 తీవ్రతతో భూమి కంపించింది. రెండవ భూకంపం 03:40 సమయంలో రిక్టర్ స్కేలుపై 3.4గా భూ ప్రకంపనలు చోటుచేసుకున్నాయి. ఇది అరుణాచల్ ప్రదేశ్ లోని తూర్పు కమెంగ్ లో జరిగింది.

## అగ్ర రాజ్యంలో ఘనంగా ఉమెన్ డే సెలబ్రేషన్స్



తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: అమెరికా అగ్ర రాజ్యంలో నార్త్ కరోలినా రాష్ట్రంలో గ్లోబల్ తెలంగాణ అసోసియేషన్ షార్లెట్ చాప్టర్ వారు ఉమెన్స్ డే సెలబ్రేషన్స్ చాలా ఘనంగా నిర్వహించారు. ఇందులో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు మహిళలందరూ ఫ్యాషన్ షో మరియు ఆటపాటలతో కనువిందు చేశారు. దాదావు 500 మంది మహిళలు వచ్చేసి చాలా సంతోషంగా ఈ ఉమెన్స్ డే సెలబ్రేట్ చేసుకుంటున్నారు. ఆగస్టు 26 2023 రోజు గోరేటి వెంకన్న గారు జిటిఏ షార్లెట్ చాప్టర్ ని ప్రారంభించారు. చాప్టర్ ప్రెసిడెంట్ మన్మోహన్ రెడ్డి పోతుల మాట్లాడుతూ మహిలల గొప్పతనం గురించి అన్ని రంగాల్లో వాళ్లు చూపుతున్న ప్రతిభ గురించి కొనియాడారు. అలాగే గ్లోబల్ తెలంగాణ అసోసియేషన్ యొక్క ముఖ్య ఉద్యేశం ఏంటి, ఏందుకు స్థాపించారు, ఇప్పటి వరకు ఏన్ని సేవా కార్యక్రమాలు చేశారో వివరించారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్ తో పాటు ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ చందు రెడ్డి, ప్రెసిడెంట్ ఎలెక్ కృఎష్ణ కదారి, వైస్ ప్రెసిడెంట్ రాజు పందిరి, జనరల్ సెక్రెటరీ శ్రీకర్ నాగుల, కలచరలల్ వైస్ ప్రెసిడెంట్ ప్రదీప్ రావు వెన్నమనేని పాల్గొన్నారు.



# ఏపీలో రాజకీయ హత్యలపై ఈసీ సీరియస్

ఏపీలో రాజకీయ హత్యలపై ఈసీ సీరియస్ : వివరణ ఇచ్చిన ఎస్పీలు అమరావతి, సూర్య బ్యూరో ప్రతినిధి : గిద్దలూరు, ఆళ్లగడ్డ నియోజకవర్గాల్లో జరిగిన రాజకీయ హత్యలు, మాచర్లలో వాహనం తగలబెట్టిన ఘటనలను ఈసీ సీరియస్గా తీసుకుంది. ఈ మూడు హింసాత్మక ఘటనలపై ప్రకాశం, పల్నాడు, నంద్యాల జిల్లాల ఎస్పీలు పరమేశ్వర్రెడ్డి, రవిశంకర్ రెడ్డి, కె.రఘువీరారెడ్డిల నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేశ్ కుమార్ మీనా వివరణ తీసుకున్నారు. ముగ్గురు ఎస్పీలు గురువాం సీఈవో మీనా ఎదుట హాజరుకాగా ఒక్కొక్కరితో విడివిడిగా మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. శాంతిభద్రతలు కాపాడే విషయంలో ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరించారు? రాజకీయ హత్యల దాకా పరిస్థితులు దిగజారే వరకు ఎందుకు వేచి చూడాల్సి వచ్చిందని ఎస్పీలను ప్రశ్నించారు. మాచర్ల నియోజకవర్గం చాలా కాలంగా సున్నిత ప్రాంతాల జాబితాలో ఉన్నా ఎందుకు నిర్లక్ష్యం చేశారని పల్నాడు ఎస్పీ రవిశంకర్రెడ్డిని నిలదీశారు. ఎన్నికల కోడ్ వచ్చిన తర్వాత హెచ్చరికలు జారీ చేసినా ఎందుకు నిర్లక్ష్యం చేశారని ప్రశ్నించారు. రాష్ట్రంలో శాంతిభద్రతల విషయంలో నేరుగా ఈసీ నిఘా పెట్టిందన్నారు. ముగ్గురు ఎస్పీలు ఇచ్చిన వివరణల నివేదికలను సీఈవో కేంద్ర ఎన్నికల సంఘానికి పంపనున్నారు.

# దేశ సంపదను దోచిపెడుతున్నారు

- ఏపీకి జరుగుతున్న అన్యాయంపై ఐక్య పోరాటాలు
- పధాని వ్యాఖ్యలు ఖండించిన వైయస్ షర్మిల
- వైసీపీతో తెరచాటు స్నేహం నడిపింది ఎవరు
- ఏపీసీసీ అధ్యక్షురాలు వై.యస్ షర్మిలా రెడ్డి



విజయవాడ నుంచి 'సూర్య' ప్రత్యేక ప్రతినిధి : దేశ సంపదను బీజేపీ అదానీ, అంబానీలకు దోచిపెడుతోందని ఏపీసీసీ అధ్యక్షురాలు వై.యస్ షర్మిలారెడ్డి ఆరోపించారు. ఏపీలో గంగవరం పోర్టు భూములు ధారాదత్తం చేసి తక్కువ ధరకే అదానికి కట్టబెట్టారన్నారు. విశాఖ స్టీల్ ను కూడా వారికే ఇచ్చేలా ప్రయత్నాలు జరుగుతున్నాయని ప్రత్యేక హోదా ఏపీకి ఊపిరి లాంటిదని అభివర్ణించారు. 10 ఏళ్లుగా రాష్ట్రానికి రాజధాని లేకుండా పోయిందని విమర్శించారు. బీజేపీ చేసిన మోసానికి జగన్ మౌనం వహించారని మండిపడ్డారు. గురువారం విజయవాడ బాలోత్సవ భవన్లో ఇండియా కూటమి భాగస్వామ్య పార్టీలు, రాజకీయ, కార్మిక, రైతు ప్రజా సంఘాల ఐక్య వేదిక సమావేశం నిర్వహించాయి. ఈ సమావేశానికి ఏపీసీసీ చీఫ్ షర్మిలా రెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసులు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వై.యస్ షర్మిలా రెడ్డి మాట్లాడుతూ అందరినీ కలుపుకుని ఎన్నికలకు వెళ్లాలని కాంగ్రెస్ అధిష్ఠానం నిర్ణయించిందని తెలిపారు. ప్రజా సంఘాల ఉద్యమాలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని షర్మిలారెడ్డి స్పష్టం చేశారు. బీజేపీ చేస్తున్న మోసాలను ప్రజలంతా గుర్తించాలన్నారు. ఎన్నికల సమయంలో హిజాబ్, రామమందిరం తదితర అంశాలను తెరపైకి తీసుకొస్తోందని, ఎన్నికల సమయంలో ప్రజలంతా ఆలోచించి బీజేపీని గద్దె దించాలన్నారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరిస్తున్న చంద్రబాబు, జగన్ పార్టీలను ఓడించాలని, ప్రజా పోరాటాలకు కాంగ్రెస్ పార్టీ సహకరిస్తుందని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలా రెడ్డి పిలుపునిచ్చారు.

**జగనన్న ప్రజలను మోసం చేసింది వాస్తవం కాదా? :** ఏపీకి ప్రత్యేక హోదా అనేది లేకుండా చేశారని, బీజేపీకి ఊడిగం చేస్తూ రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టారని కాంగ్రెస్ పార్టీ ఏపీ చీఫ్ వైయస్ షర్మిల అన్నారు. మెడలు వంచి ప్రత్యేక హోదా తెస్తామన్న వారు మోకరిల్లారన్నారు. అధికార, ప్రతిపక్ష పార్టీలు హోదా కోసం నిజమైన ఉద్యమం చేశాయన్నారు. విభజన జరిగి పదేళ్లు అయినా ఏపీకి రాజధాని లేదంటే సిగ్గుచేటు కాదా? అని ప్రశ్నించారు. ప్రత్యేక హోదా విషయంలో జగనన్న ప్రజలను మోసం చేసింది వాస్తవం కాదా? అని షర్మిల ప్రశ్నించారు. బీజేపీ చేసిన మోసాలను ప్రజలు కూడా గమనించాలన్నారు. వాళ్లకు కొమ్ము కాస్తున్న పార్టీలకు బుద్ధి చెప్పాలన్నారు. బొట్టు బొట్టు కలిస్తేనే మహా సముద్రమని, అడుగు అడుగు కలిస్తేనే ఉద్యమం. ఇండియా కూటమి ద్వారా కార్యాచరణ లో కాంగ్రెస్ అడుగులు వేస్తోంది.

బీజేపీతో కలిసి పని చేస్తున్న అన్ని పార్టీలను ఈ వేదిక ద్వారా వ్యతిరేకిస్తున్నాం. బీజేపీ పదేళ్ళ పాలనలో అరాచకాలు చేసింది. భరోసా లేకుండా పోయింది. అదానీ, అంబానీలకు మాత్రం భారతదేశ సంపదను బీజేపీ దోచి పెట్టింది.

మన రాష్ట్రంలోనే గంగవరం పోర్టును వాళ్లకు కట్టబెట్టారు. వైఎస్ గంగవరం పోర్టు ప్రభుత్వానికి వచ్చేలా అగ్రిమెంట్ చేశారు. కానీ జగనన్న మాత్రం రూ.6500 కోట్లకు వ్యాల్యూ వేసి చీప్గా అదానీకి ఇచ్చేశారు. మోడీకి భయపడి జగనన్న ఇలా చాలా కౌరు చౌకగా కట్టపెట్టేశారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని కూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రైవేటు పరం చేయడం సిగ్గు చేటు. ఇది కూడా అదానీ, అంబానీలకు కట్టబెడతారనేది బహిరంగ రహస్యం. బీజేపీ ఏది అడిగితే అది , ఏ పదవి కావాలంటే ఆ పదవి జగనన్న ఇచ్చేస్తున్నారు. రాజ్యసభ, టీటీడీ సభ్యులు, సభల్లో మద్దతు ఇలా జగనన్న ముందుంటున్నారు. రాష్ట్రానికి బీజేపీ ఏం చేసిందని మద్దతు ఇస్తున్నారో అధికార, ప్రతిపక్ష పార్టీలు చెప్పగలవా? అని షర్మిల ప్రశ్నించారు.

**ఆంధ్రప్రదేశ్ ఆత్మగౌరవంలో ఆఖరు స్థానం : సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు**

అక్షర క్రమంలో అగ్రస్థానంలో ఉన్న ఆంధ్రప్రదేశ్ ఆత్మగౌరవంలో ఆఖరు స్థానంలో నిలుస్తోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు అన్నారు. తెలుగు ప్రజల ఆత్మగౌరవానికి భంగం కలిగించేలా చంద్రబాబు, జగన్ వ్యవహరించారని ఆయన విమర్శించారు. ప్రజాగళం సభలో పాల్గొన్న ప్రధాని నరేంద్ర మోడీ చంద్రబాబుకు ఓటు వేయాలని చెప్పలేదని, జగన్ను ఓడించాలనీ చెప్పలేదన్నారు. ప్రత్యేక హోదా గురించి, విశాఖ గురించి అమరావతి గురించి ఎక్కడా ప్రధాని చెప్పలేదని అన్నారు. కేవలం ఎలక్టోరల్ బాండ్స్లో మాత్రమే రాజకీయ పార్టీలు ముందున్నాయని శ్రీనివాసరావు అన్నారు.

**మోడీకి భయపడే చంద్రబాబు రాజకీయాలు : సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ**

దేశ వ్యాప్తంగా ఎక్కడకు ప్రచారానికి వెళ్లినా 400 సీట్లు అని ప్రధాని మోడీ వ్యాఖ్యానిస్తున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ తెలిపారు. మైండ్ గేమ్ తో సార్వత్రిక ఎన్నికల్లో గెలవాలని ఈ తరహా వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. ఏపీలో జగన్, చంద్రబాబు మోడీకి భయపడే రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. కేంద్రంలో సీబీఐ, ఈడీ, ఐటీ దాడులు చేయిస్తుంటే, ఏపీలో సీఐడీ ద్వారా భయాందోళనలు సృష్టిస్తున్నారన్నారు. ఏపీలో మీడియాకు రాష్ట్ర అంశాలు మినహా జాతీయ అంశాలు పట్టటం లేదని రామకృష్ణ అన్నారు.

## పెత్తందారులెవరో

# అర్థమవుతోందా రాజా!



అమరావతి, సూర్య బ్యూరో ప్రతినిధి : దెందులూరు నియోజకవర్గంలో బీసీ యువకులపై వైసీపీ ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి, ఆయన అనుచరులు చేసిన దాడిని తెలుగుదేశం పార్టీ (టీడీపీ) యువనేత నారా లోకేష్ తీవ్రంగా ఖండించారు. ఇటీవల పేదలకు, పెత్తందారులకు మధ్య యుద్ధ మంటూ ప్రతిపక్షాలపై జగన్ అండ్ కో విమర్శలు గుప్పిస్తున్నారని, దెందులూరులో జరిగిన ఘటనతో పెత్తందారులెవరో అర్థమవుతోందా రాజా? అంటూ ఎద్దేవా చేశారు. తనలో ఉన్న ఫ్యూడలిస్ట్ అవలక్షణాలన్నింటినీ ఎదుటివారికి అంటగట్టి బురదజల్లడం జగన్మోహన్ రెడ్డికి వెన్నతోపెట్టిన విద్య అంటూ వ్యాఖ్యలు చేశారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు కనీసం తమ ఎదుట నిలబడినా సహించలేని జగన్ అండ్ కో ఈ మధ్య పేదలకు, పెత్తందారులకు యుద్ధం అంటూ ప్రతిపక్ష నేతలపై ఎదురుదాడి చేస్తున్నారని విరుచుకుపడ్డారు. దెందులూరు నియోజకవర్గం తిమ్మనగూడెంలో జగన్ సామంతరాజు, వైసీపీ ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి నిన్న ప్రచారానికి వెళ్లిన సమయంలో బీసీ యువకులు పిప్పర దుర్గాప్రసాద్, ఆయన స్నేహితులు పంచాయతీ బెంచ్పై కూర్చుని కష్టసుఖాలు మాట్లాడుకుంటున్నారు. మేం ప్రచారానికి వస్తే లేచి నిలబడి గౌరవించకుండా దర్జాగా కూర్చుని చేతులు ఊపుతారా అంటూ ఎమ్మెల్యే, ఆయన అనుచరులు కోపంతో ఊగిపోతూ విచక్షణా రహితంగా దాడిచేసి గాయపరిచారు. నాకు తెలిసి శతాబ్దాల క్రితం రాచరికంలో కూడా ఇంత దారుణమైన పరిస్థితులు లేవు. ఎవరు అసలుసిసలైన పెత్తందారులో ఇప్పుడైనా అర్థమవుతోందా రాజా?! అంటూ లోకేష్ విమర్శలు గుప్పించారు.

## ప్రవేటు బ్యాంకులు రైతుల

# ఆర్థిక స్వావలంబనకు సహకరించాలి

**సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ చదలవాడ నాగరాణి**



విజయవాడ, సూర్య బ్యూరో ప్రతినిధి : బ్యాంకర్లు ఖాతాదారులకు శ్రద్ధతో సేవలందించాలని సాంకేతిక విద్యాశాఖ కమీషనర్ చదలవాడ నాగరాణి అన్నారు. విజయవాడలోని విశాలాంధ్ర రోడ్డులో కరూర్ వైశ్యా బ్యాంక్ 836వ శాఖను నాగరాణి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా చదలవాడ మాట్లాడుతూ వినియోగదారులకు సకాలంలో బ్యాంకింగ్ సేవలు అందినప్పుడే మంచి ఫలితాలు ఆశించవచ్చన్నారు. ప్రవేటు రంగ బ్యాంకులు గ్రామీణ ప్రాంతాలలోని రైతుల అవసరాలకు అనుగుణంగా మంచి పథకాలను ప్రవేశ పెట్టాలన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆంజనేయ జ్యువెలరీ నుండి వడ్లమూడి వెంకటరావు, మోడల్ డైరీ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ పిన్నమనేని ధన ప్రకాష్, బ్యాంక్ జనరల్ మేనేజర్ నితిన్ ఆర్కాట్ రంగస్వామి, క్లస్టర్ హెడ్ సూర్య శ్రీ రామ్మేకె చేశారు. మరియు బ్రాంచ్ మేనేజర్ కెఎల్ వి ప్రసన్న కుమార్ తదితరులు పాల్గొన్నారు. కరూర్ వైశ్యా బ్యాంక్ 1916లో స్థాపించబడి, ఫైనాన్స్ రంగంలో ప్రముఖ బ్యాంకుగా అవతరించింది.

# వేసవి కార్యాచరణ ప్రణాళిక సిద్ధం



- తాగునీటి సమస్య రాకుండా తగిన చర్యలు తీసుకోండి
- 115 కోట్ల రూ. అంచనాతో వేసవి కార్యాచరణ ప్రణాళిక అమలు
- బోర్ వెల్స్, ఇతర మంచినీటి పథకాలకు మరమ్మతులు వెంటనే నిర్వహించండి
- నీటి ఎద్దడి గల ఆవాసాలకు ట్యాంకర్ల ద్వారా ప్రతిరోజు మంచినీటి సరఫరా చేయాలి
- 1904 కాల్ సెంటర్ ద్వారా తాగునీటి సమస్యపై ఫిర్యాదులు స్వీకరించి పరిష్కరించండి
- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కెఎస్ జవహర్ రెడ్డి

వెలగపూడి, సూర్య ప్రధాన ప్రతినిధి : రాష్ట్రంలో వచ్చే జూన్ నెలాఖరు వరకూ ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కెఎస్.జవహర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో తాగునీటి పరిస్థితులపై గురువారం వెలగపూడి సచివాలయంలో ఆయన పంచాయితీరాజ్, గ్రామీణ రక్షిత మంచినీటి సరఫరా, మున్సిపల్ నీటి సరఫరా విభాగాల అధికారులతో సమీక్షించారు. ఈసందర్భంగా ప్రస్తుతం రాష్ట్రంలో మంచినీటి సరఫరా పరిస్థితులపై సమీక్షిస్తూ వచ్చే జూన్ నెలాఖరు వరకూ ఎక్కడా మంచినీటికి ఇబ్బంది రాకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. దాదావు నిర్మాణం పూర్తి కావచ్చిన మంచి నీటి పథకాలన్నిటినీ యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని అధికారులకు స్పష్టం చేశారు. వివిధ సమ్మర్ స్టోరేజి ట్యాంకులు అన్నిటినీ పూర్తిగా నీటితో నింపాలని ఆదేశించారు. తాగునీటి పథకాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని జల వనరులు, ఆర్డబ్ల్యుఎస్,మున్సిపల్ నీటి సరఫరా విభాగాల అధికారులను సిఎస్ జవహర్ రెడ్డి ఆదేశించారు.

**తాగునీటి సమస్య రాకుండా తగిన చర్యలు :** వేసవి నీటి ఎద్దడిని అధికమించేందుకు 115 కోట్ల రూ.ల అంచనాతో వేసవి కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయడం జరిగిందని సిఎస్ జవహర్ రెడ్డి పేర్కొన్నారు.వివిధ బోర్ వెల్స్ సహా ఇతర మంచినీటి సోర్సులకు అవసరమైన మరమ్మత్తులు నిర్వహించి అవన్నీ సమక్రమంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రానున్నమూడు మాసాలు వివిధ మంచినీటి సరఫరా పథకాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. మంచినీటి ఎద్దడి గల ఆవాసాలు,శివారు కాలనీలకు ట్యాంకరులు ద్వారా ప్రతి రోజు మంచినీటి సరఫరా చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని చెప్పారు.మంచినీటి కుళాయిల ద్వారా రోజకు ఒకసారైనా మంచినీటి సరఫరా జరిగేలా చూడాలని చెప్పారు. రాష్ట్రంలో ఎక్కడైనా మంచినీటికి ఇబ్బంది కలిగితే 1904 కాల్ సెంటర్ ద్వారా ఫిర్యాదులు స్వీకరించి తక్షణం పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సిఎస్ జవహర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. పశువులకు కూడా తాగునీటి ఇబ్బంది కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను సిఎస్ ఆదేశించారు.

**115 కోట్ల అంచనాతో సమ్మర్ కంటిన్జెన్సీ ప్రణాళిక :** రాష్ట్ర పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్ మాట్లాడుతూ 115 కోట్ల రూ.ల అంచనాతో సమ్మర్ కంటిన్జెన్సీ ప్రణాళికను రూపొందించి అమలు చేస్తున్నట్టు తెలిపారు. వివిధ ప్రవేట్ బోరుల ను అద్దెకు తీసుకోవడం, వివిధ బోరులను ఫ్లషింగ్ చేయడం, ఉన్న బోర్ల ను మరింత లోతు చేయడం, సమ్మర్ స్టోరేజి ట్యాంకులను పూర్తిగా నీటితో నింపడం వంటి పనులు ఈసమ్మర్ కంటిన్జెన్సీ ప్రణాళికలో భాగంగా చేయడం జరుగుతుందని చెప్పారు. నీటి ఎద్దడి అధికంగా గల 1354 ఆవాసాలకు జూన్ వరకూ ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని ముందస్తు ప్రణాళికను సిద్ధం చేయగా ఈనెలలో 109 ఆవాసాలకు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాకు అనుమతి మంజూరు చేశామని వివరించారు. కరువు మండలాల్లో తాగునీటికి ఇబ్బంది రాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వర్చువల్ గా సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర మున్సిపల్ పరిపాలనా శాఖ కమీషనర్ కేశ్ బాలాజీ రావు మాట్లాడుతూ ప్రస్తుతం 47 పట్టణ స్థానిక సంస్థల్లో రోజుకు ఒకసారి,29 యుఎల్బిల్లో రోజుకు రెండు సార్లు.43 యుఎల్బిల్లో రెండు రోజులకు ఒకసారి మంచినీటిని సరఫరా చేయడం జరుగుతోందని వివరించారు.కడప,పెనుగొండ,ఒంగోలు,హిందూపురంల్లో ప్రస్తుతం మూడు రోజులకు ఒకసారి మంచినీటి సరఫరా చేస్తున్నామని తెలిపారు. ఈ నాలుగు యుఎల్బిల్లో మంచినీటి సరఫరాను మెరుగు పర్చేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నట్టు వివరించారు. ఈ సమావేశంలో ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్.రావత్, ఆశాఖ కార్యదర్శి కెవివి.సత్యనారాయణ,ఆర్ డబ్ల్యుఎస్ ఇఎన్సి ఆర్ వి.కృష్ణారెడ్డి, ప్రజారోగ్యశాఖ ఇఎన్సి ఆనంద రావు పాల్గొన్నారు.

## కొడాలి నాని, వల్లభనేని వంశీతో

# నాకు ఎలాంటి సంబంధాలూ లేవు

విజయవాడ, సూర్య బ్యూరో ప్రతినిధి : టీడీపీ తనకు టికెట్ కేటాయించక పోవడం పట్ల మాజీ ఎమ్మెల్యే బోడే ప్రసాద్ తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఈ క్రమంలో తనపై వస్తున్న ఆరోపణలపై ఆయన స్పందించారు. మీడియాతో బోడె ప్రసాద్ మాట్లాడుతూ కొడాలి నాని, వల్లభనేని వంశీ తో తనకు ఎటువంటి సంబంధాలు లేవని, పట్టాభిపై, పార్టీ కార్యాలయంపై దాడి ప్రయత్నాలు చేస్తున్నారని ముందే చెప్పానన్నారు. తనకు వంశీ, కొడాలితో సత్సంబంధాలు ఉంటే తాను ఎందుకు చెబుతానని ప్రశ్నించారు. వంశీ, నానితో సంబంధం లేదని తన పిల్లల మీద ప్రమాణం చేసి మరీ చెబుతున్నానని బోడె ప్రసాద్ వెల్లడించారు. భువనేశ్వరి మీద వంశీ ఆరోపణలు చేసినవుడే సర్వస్వం కోల్పోయావని వంశీకి మెసేజ్ చేశానని తెలిపారు. పార్టీ కోసం పని చేయటమే తనకు తెలుసని.. పని చేయటం రాని వాళ్ళు తనపై అసత్య ప్రచారం చేస్తున్నారన్నారు. పోటీ చేయటం కోసం ఇలాంటి ప్రచారాలు చేయాలా ? అని బోడె ప్రసాద్ ప్రశ్నించారు. పెనమలూరు నియోజకవర్గంపై కసరత్తు మొదలుపెట్టిన టీడీపీ ఆ పార్టీ మాజీ ఎమ్మెల్యే, ప్రస్తుత నియోజకవర్గ ఇన్చార్జ్ బొడే ప్రసాద్కు ఈ సారి టికెట్ ఇవ్వడం లేదని కొద్ది రోజుల క్రితం తెలిపింది. ఈ మేరకు ఆయనకు పార్టీ హైకమాండ్ నుంచి ఫోన్ వచ్చింది. ఈ సారి మీకు టికెట్ ఇవ్వలేకపోతున్నామని టీడీపీ హైకమాండ్ దూతలు ఆయనకు ఫోన్లో చెప్పారు. అప్పటి నుంచి రచ్చ మొదలైంది. తాను ఓటమి చెందిన సమయంలో కూడా ఇంత ఆవేదన చెందలేదని బోడె ప్రసాద్ నాలుగు రోజుల క్రితం తెలిపారు. ఈ ఐదేళ్లు కుటుంబాన్ని వదిలి పార్టీ కోసమే తన జీవితం అంకితం చేశానని అన్నారు. చంద్రబాబు తీసుకున్న నిర్ణయానికి తాను చాలా బాధ పడుతున్నానని వాపోయారు. తాను చంద్రబాబుకి భక్తుడినేనని ఆయన ఆదేశిస్తే శిరసావహిస్తానని అన్నారు.

# వైసీపీ ట్రాప్లో పడకండి

- కూటమి విజయమే లక్ష్యంగా అడుగువేయండి
- చిత్తూరు జిల్లా కార్యవర్గం సమావేశంలో జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి కె. నాగబాబు



గుంటూరు, సూర్య బ్యూరో ప్రతినిధి : వైసీపీ నాయకులు తాము ఓడిపో తున్నామనే నిర్ధారణకు వచ్చేశారు. అందుకే రకరకాల కుయుక్తులతో జన సైనికులను, వీర మహిళలను, జనసేన శ్రేణులను గందరగోళపరచే కుట్రలు చేస్తున్నారని జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి కె.నాగబాబు స్పష్టం చేశారు. జనసేన పార్టీ నాయకులు, వీర మహిళలు, జన సైనికులు ఎవరూ వైసీపీ ట్రాప్లో పడవద్దని సూచించారు. జనసేన, టిడిపి, బీజేపీ కూటమి విజయమే లక్ష్యంగా ముందుకు వెళ్లాలని చెప్పారు. మంగళగిరిలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో గురువారం జరిగిన చిత్తూరు జిల్లా కార్యవర్గం సమావేశంలో శ్రీ నాగబాబు గారు మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా తిరుపతి నియోజకవర్గంలో జనసేన పార్టీని గెలిపించుకునేందుకు శ్రమించాలని పిలుపునిచ్చారు. పార్టీ ఆవిర్భావం నుంచి వివిధ హోదాల్లో పని చేస్తూ, ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు చేసిన, పార్టీ కోసం నిలబడిన ప్రతీ ఒక్కరికీ ఉమ్మడి ప్రభుత్వంలో సముచిత గౌరవం దక్కే విధంగా జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ అవకాశం కల్పిస్తారని అన్నారు. వైసీపీ నాయకులు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా అసత్యపు ఫోటో మార్ఫింగ్, వీడియోలు తయారుచేసి సామాజిక మాధ్యమాల్లో వదులుతున్నారని, అవి చూసిన కొందరు నిజమేనని భ్రమలో తొందరపాటుగా స్పందిస్తున్నారని తెలిపారు. మీ దృష్టికి వచ్చిన ఏ విషయం గురించి అయినా పూర్తిగా తెలుసుకుని అవసరం అయితే బాగా తెలిసిన వారితో చర్చించి నిర్ధారించుకున్న తరువాతనే ఒక నిర్ణయానికి రావాలని చెప్పారు. జనసేన పార్టీ వైసీపీ లాంటిది కాదని, జనసేన పూర్తి ప్రజాస్వామ్య విధానాలతో పని చేస్తోన్న పార్టీ అని పునరుద్ఘాటించారు. ప్రస్తుత రాజకీయ రణరంగంలో ధన ప్రవాహం విచ్చలవిడిగా పెట్రేగి పోతోందని, జనసేన అభ్యర్థులు పోటీ చేస్తున్న ప్రతీ నియోజక వర్గంలో కుట్రలు చేసి నెగ్గాలనే దుర్బుద్ధితో వైసీపీ నాయకులు ఉన్నారని అన్నారు. జనసేన అభ్యర్థులకు జన సైనికులు, వీర మహిళలు మనో ధైర్యాన్ని పెంచాలని, మన సహచర పార్టీలు భారతీయ జనతా పార్టీ, తెలుగు దేశం సహకారాన్ని పూర్తిగా వినియోగించుకోవాలని సూచించారు.

## టీడీపీ జాతీయ కార్యాలయంలో


# ఘనంగా నారా దేవాన్ష్ పుట్టినరోజు వేడుకలు



మంగళగిరి, సూర్య బ్యూరో ప్రతినిధి : టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు మనువడు నారా దేవాన్ష్ పుట్టినరోజు వేడుకలు పార్టీ నేతలు ఘనంగా నిర్వహించారు. మంగళగిరిలోని టీడీపీ జాతీయ కార్యాలయంలో కేక్ కట్ చేశారు. అనంతరం నేతలు మాట్లాడుతూ దేవాన్ష్ భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాక్షించారు. దేవాన్ష్ అంటే చంద్రబాబు నాయుడుకి, బాలకృష్ణకి ఎంతో ఇష్టమన్నారు. ప్రతి ఏటా దేవాన్ష్ పుట్టిన రోజు సందర్భంగా నారా లోకేశ్ దంపతులు తిరుమలలో అన్నదానం చేయటం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి గురజాల మాల్యాద్రి, మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ,రాష్ట్ర అధికార ప్రతినిధులు నాగూల్ మీరా, పిల్లి మాణిక్యరావు, పాతర్ల రమేష్, టీటీడీ బోర్డు మాజీ మెంబర్ ఏవీ రమణ, పార్టీ కేంద్ర కార్యాలయ రిసెప్షన్ ఇంచార్జ్ హాజీ హసన్ భాషా, ఏఏ రావు, మునిరత్నం నాయుడు, ఉయ్యూరు వెంకటేశ్వరరావు, బొల్లా పిచ్చయ్య, షేక్ సిద్దా, నాని, తదితరులు పాల్గొన్నారు.

## 2018 గ్రూప్-1 మెయిన్స్

# సింగిల్ జడ్జి తీర్పుపై హైకోర్టు పాక్షిక స్టే




వెలగపూడి, సూర్య బ్యూరో ప్రతినిధి : ఏపీపీఎస్సీ 2018 గ్రూప్-1 అంశంలో మెయిన్స్కు ఎంపికైన అభ్యర్థుల జాబితాను రద్దు చేస్తూ సింగిల్ జడ్జి ఇచ్చి ఉత్తర్వులపై రాష్ట్ర హైకోర్టు పాక్షిక స్టే విధించింది. తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు ఉద్యోగంలో ఉన్నవారికి యథాతథ స్థితిని కల్పించింది. గ్రూప్ -1 మెయిన్స్ను రద్దు చేస్తూ ఇటీవల సింగిల్ జడ్జి తీర్పు ఇచ్చారు. మెయిన్స్ రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని అందులో పేర్కొన్నారు. దీనిపై ఏపీపీఎస్సీ, రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టులో అప్పీల్ చేశాయి. విచారణ చేపట్టిన ఉన్నత న్యాయస్థానం తాజాగా పాక్షిక స్టే విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అనంతరం తదుపరి విచారణను ఈనెల 27కి వాయిదా వేసింది.

**లోకేశ్ అరెస్ట్కు అనుమతివ్వాలంటూ దాఖలైన పిటిషన్పై విచారణ వాయిదా**

విజయవాడ, సూర్య బ్యూరో ప్రతినిధి : టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఉన్న నారా లోకేశ్ రెడ్బుక్ పేరిట అధికారులను బెదిరిస్తున్నారని, ఆయనను అరెస్ట్ చేసేందుకు అనుమతి ఇవ్వాలంటూ విజయవాడ ఏసీబీ కోర్టులో సీఐడీ దాఖలు చేసిన పిటిషన్పై విచారణ వాయిదా పడింది. వచ్చే నెల 15కు వాయిదా వేస్తూ కోర్ట్ నిర్ణయించింది.


కాగా రెడ్ బుక్ పేరిట లోకేశ్ అధికారులను బెదిరిస్తున్నారంటూ విజయవాడ ఏసీబీ కోర్టులో సీఐడీ పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్పై లోకేశ్ తరవు న్యాయవాదులు గురువారం కౌంటర్ దాఖలు చేశారు. కౌంటర్ దాఖలు కావడంతో ఏప్రిల్ నెల 15న ఇరు పక్షాల వాదనలు వింటామని న్యాయమూర్తి చెప్పారు.

# వైసీపీ పాలనలో పెరిగిన దోపిడీ



గుంటూరు, సూర్య బ్యూరో ప్రతినిధి : ఐదేళ్లుగా ఏపీ వెనుకబడిపోయిందని టీడీపీ నేత, మాజీ ఎంపీ మురళీమోహన్ అన్నారు. రాజధాని లేక రాష్ట్రం దిక్కులేనిదిగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్టీఆర్ భవన్లో హోరెత్తిన ప్రజాగళం గీతాన్ని పార్టీ నేతలు టీడీ జనార్ధన్, జ్యోత్స్న తిరునగరి, శ్రీనివాసరావు పొట్లూరి తదితరులతో కలిసి ఆయన ఆవిష్కరించారు.

అనంతరం మురళీమోహన్ మీడియాతో మాట్లాడారు. వైసీపీ పాలనతో ఈ ఐదేళ్లలో రాష్ట్రానికి ఒక్క పరిశ్రమ కూడా రాలేదు. దోపిడీ పెరిగిపోయింది. ప్రజల గురించి ఆలోచించాల్సిన ప్రభుత్వం అన్ని రంగాల్లో వెనుకబడేందుకు కారణమైంది. ఉచితాల వల్ల ప్రయోజనం ఉండదు. దాని బదులు ఉపాధి మార్గం చూపితే ప్రజల జీవితం మెరుగుపడుతుంది. చంద్రబాబు సీఎం అయితేనే ఏపీ మళ్లీ గాడిలో పడుతుందని మురళీమోహన్ అన్నారు.




# దేశ వ్యాప్తంగా ఎన్నికల కోలాహలం

## 7 విడతలుగా ఎన్నికలు జరపనున్న ఈసీ

## ఈ సారి ఎన్నికలు మాత్రం చాలా కాస్ట్లీ



**మండుటెండల్లో లోక్‌సభ ఎన్నికలతోపాటు నాలుగు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. నామినేషన్లు, ప్రచారాలు, పార్టీల సమావేశాలు, బహిరంగ సభలు, ఎన్నికల ప్రచారాలతో ఈ వేసవిలో ఎన్నికల సెగ గట్టిగా తగలనుంది. గత నాలుగు పర్యాయాలుగా వేసవి వేడిని పెంచిన ఎన్నికలు మరోసారి వేసవిలోనే సిద్ధమయ్యాయి. 2004లో దేశంలో ఎన్నికలు మొదటిసారిగా వేసవి కాలంలో జరిగాయి. అంతకుముందు వరకూ సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో జరిగేవి. 1999 సార్వత్రిక ఎన్నికల్లో గెలిచిన వాజ్‌పేయీ ప్రభుత్వం 2004లో ముందస్తు ఎన్నికలకు వెళ్లడంతో దేశంలో తొలిసారి వేసవి కాలంలో ఎన్నికలు జరిగాయి. అప్పుడు వాజ్‌పేయీ ప్రభుత్వం 6 నెలల ముందుగానే అంటే ఏప్రిల్, మే నెలల్లోనే ఎన్నికలకు వెళ్లింది. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం గెలిచింది. అప్పటి నుంచి ఎన్నికలు వరుసగా వేసవిలో జరుగుతున్నాయి.**

దేశంలో ఏ ఎన్నికల షెడ్యూల్ విషయంలోనూ ఇంత హడావిడి జరగలేదు. ఈసారి సార్వత్రిక ఎన్నికల సందర్భంగా రెండు నెలల ముందు నుంచీ ప్రతిరోజూ వాట్సప్ లో షెడ్యూల్ ప్రకటిస్తూనే ఉన్నారు ఔత్సాహికులు. అదిగో వచ్చేసింది, ఇదిగో వచ్చేసింది అంటూ ఆఖరికి ఎలక్షన్ కమిషన్ లెటర్ హెడ్ పైనే ఫేక్ న్యూస్ ప్రచారం చేశారు. కానీ ఇక ఫేక్ న్యూస్ కు అవకాశం లేకుండా.. ఈసీ ఉత్కంఠకు తెర దించింది కొత్తగా బాధ్యతలు స్వీకరించిన ఇద్దరు ఎన్నికల కమిషనర్లు ఇప్పటికే ఎన్నికల నిర్వహణ కసరత్తు ప్రారంభించారు. గత కొన్ని నెలలుగా రాష్ట్రాల్లో ఉన్న చీఫ్ ఎలక్ట్రోరల్ ఆఫీసర్లతో కేంద్ర ఎన్నికల సంఘం అధికారులు సమీక్ష నిర్వహిస్తున్నారు. సమస్యాత్మక ప్రాంతాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈవీఎంల తరలింపు, భద్రతా దళాల మోహరింపు, సరిహద్దుల్లో భద్రత కట్టుదిట్టం చేయాలని కేంద్ర అధికారులు స్పష్టం చేశారు.

### లోక్ సభ పదవీకాలం జూన్ 16తో ముగుస్తోంది.

లోక్ సభ పదవీకాలం జూన్ 16తో ముగుస్తోంది. ఈలోగానే కొత్త ప్రభుత్వం ఏర్పడాల్సి ఉంటుంది. అలా జరిగేలా ఈసీ షెడ్యూల్ ఇస్తుందని చెబుతున్నారు. లోక్ సభ ఎన్నికలతో పాటు నాలుగు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ కొత్తేం కాదు. కానీ కశ్మీర్ విభజన తర్వాత.. ఆర్టికల్ 370 ఎత్తేసిన తర్వాత జమ్ముకశ్మీర్లో జరగనున్న ఎన్నికలు ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. కేంద్రం చెబుతున్నట్టుగా అక్కడ ఏం మారిందనేది పోలింగ్ లో తేలిపోతుందనే అంచనాలున్నాయి. విపక్షాలు ఆరోపిస్తున్నట్టుగా ఏమీ మారలేదనే మాట కూడా నిజమా.. కాదా అనేది అప్పుడే తేలుతుంది.

### భారత్, మహిళా ఓటర్లు అధికం

అమెరికా సహా ఈ ప్రపంచం మొత్తంలో సగం జనాభా గల 50 కంటే ఎక్కువ దేశాలలో 2024లో ఎన్నికలు జరుగబోతుండడం విశేషం. భారత ఎన్నికల కమిషన్ సమాచారం ప్రకారం 2019 సార్వత్రిక ఎన్నికల నాటికి అర్హులైన నమోదిత ఓటర్ల సంఖ్య 89.6 కోట్లు కాగా, జనవరి 1, 2024 నాటికి ఆ సంఖ్య 96.88 కోట్లకు చేరుకుంది. మార్చ్ 10, 2024 నాటికి మొత్తం నమోదిత ఓటర్లలో 81,87,999 మంది 85 సంవత్సరాలు పైబడిన వయోజనులు కాగా 2,18,442 మంది 100 సంవత్సరాలు పైబడిన వృద్ధులు కావడం విశేషం. 17వ లోక్ సభకు 2019 లో జరిగిన ఎన్నికలలో యువతరం, విద్యావంతులు మరియు మహిళా ఓటర్లు అధిక సంఖ్యలో పాల్గొనడంతో పాటు పోటీ చేయడం కూడా విశేషం. తత్ఫలితంగా ఈ సారి లోక్ సభలో మహిళా పార్లమెంటేరియన్ల సంఖ్యాబలం 15 శాతానికి పెరిగింది. ఈ ఎన్నికలలో మొత్తం 543 స్థానాలకు గాను దాదాపు 8 వేల మంది అభ్యర్థులు నామినేషన్లు వేయగా కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ 303 (మిత్రపక్షాలతో కలిపి 351) స్థానాలు గెలుచుకుంది. భారత దేశ చరిత్రలో అత్యధికంగా ఈ సార్వత్రిక ఎన్నికలలో 67.4 శాతం (దాదాపు 61.5 కోట్ల మంది) ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవడమే కాక మొట్టమొదటిసారిగా, స్త్రీ-పురుష ఓటర్ల నిష్పత్తి దాదాపు సమానమయ్యింది.



### హాజరు శాతంలో వృద్ధి:

17వ లోక్‌సభ (జూన్ 2019 - మే 2024)ను, భారతదేశ పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో ఒక ముఖ్యమైన మైలురాయిగా పేర్కొనవచ్చు. 17వ లోక్‌సభ, గతంతో పోల్చితే అతి తక్కువ సంఖ్యలో 274 సార్లు సమావేశమైనప్పటికీ సభ్యుల హాజరు, ప్రశ్నోత్తరాల సమయం మరియు శాసనసభ కార్యకలాపాల పరంగా చెప్పుకోదగ్గ పరిణతి సాధించింది. ప్రత్యేకించి ఈ లోక్‌సభలో సగానికి పైగా సభ్యుల వయస్సు 60 ఏళ్ల కంటే తక్కువ కావడంతో పాటు మొత్తం సభ్యుల సంఖ్యలో 15 శాతం మంది మహిళా ప్రతినిధులు కావడం మహిళా సాధికారత కోణంలో హర్షించదగ్గ పరిణామం. కోవిడ్-19 మహమ్మారి వంటి సవాళ్లు ఉన్నప్పటికీ, 17వ లోక్‌సభలో సభ్యుల హాజరు 79 శాతానికి చేరుకోవడం సంతోషదాయకమైన విషయం. ప్రత్యేకించి 2019 మరియు 2023 సమావేశాలలో సభ్యులు అంకిత భావాన్ని ప్రదర్శిస్తూ అత్యధిక సంఖ్యలో హాజరు కావడం గమనార్హం. మొత్తం సభ్యులలో 277 మంది మొదటి సారి లోక్ సభకు ఎన్నికైన ప్రజా ప్రతినిధులు కావడం మరో విశేషం. మహారాష్ట్ర నుండి ప్రాతినిథ్యం వహిస్తున్న ఎంపీలు సగటున ప్రతి ఒక్కరు దాదాపు 370 ప్రశ్నలు సంధించగా, 60 ఏళ్లలోపు ప్రజా ప్రతినిధులు, సీనియర్ సభ్యుల కంటే ఎక్కువ ప్రశ్నలు సంధించి తమ ప్రజాస్వామ్య స్ఫూర్తిని చాటుకున్నారు.

### పాలనా విధానాలు:

2023 నాటికి ప్రపంచంలో పూర్తి ప్రజాస్వామ్యం (%ఖీబశ్రీశ్రీ ఎవఎశీఛీతీబఛిఅవం%) 24 (14.40 శాతం), లోపభూయిష్ట ప్రజాస్వామ్యాలు (%ఖీశ్రీబషవస ఎవఎశీఛీతీబఛిఅవం%) 50 (29.90 శాతం), హైబ్రిడ్ పాలనలు (%నఎఎతీఅస తీవస్త్రఅఎవం%) 34 (24.40 శాతం) మరియు అధికార పాలనలు (%ూబ్‌ష్త్రశీతీఛ్ఞితీఛిఅ తీవస్త్రఅఎవం%) 59 (35.30 శాతం) విధానాన్ని అవలంబిస్తున్నాయి. 2023 ఫిబ్రవరిలో స్టాటిస్టా(%హ్ఛఅర్ఛు%) సంస్థ విడుదల చేసిన నివేదిక ప్రకారం 10 పాయింట్ల ఆధారంగా నిర్వహించిన సర్వేలో నార్వే 9.8, న్యూజిల్యాండ్ 9.61, ఐస్ ల్యాండ్ 9.52, స్వీడన్ 9.39, ఫిన్లాండ్ 9.29, డెన్మార్క్ 9.28, స్విట్జర్లాండ్ 9.14, ఐర్లాండ్ 9.13, నెదర్లాండ్స్ 9.0, తైవాన్ 8.99 పాయింట్లు దక్కించుకుని ప్రపంచంలోని పది అత్యంత ప్రజాస్వామిక దేశాల సూచీలో (%×అఎవఇ%) నిలువగా 140 కోట్ల పై చిలుకు జనాభాతో అతి పెద్ద ప్రజాస్వామ్య దేశంగా ఉన్న మన దేశం 6.9 పాయింట్లతో నలభై ఆరవ స్థానంలో ఉంది.

### అత్యంత ఖరీదైన ఎన్నికలు:

భారత్ లో జరిగే 2024 సార్వత్రిక ఎన్నికలను ప్రజాస్వామ్య చరిత్రలో నిర్వహింపబడుతున్న అతి పెద్దవిగా అభివర్ణించవచ్చు. ఈ ఎన్నికలు అమెరికాను మించిపోవడమే కాదు, ప్రపంచంలోనే అత్యంత ఖరీదైనవి. 2019లో జరిగిన సార్వత్రిక ఎన్నికలలో 90 కోట్ల అర్హులైన ఓటర్లను ఆకర్షించడానికి వివిధ రాజకీయ పార్టీలు మరియు అభ్యర్థులు 8.7 బిలియన్ల అమెరికా డాలర్లను వెచ్చించారంటే ఆశ్చర్యం కలుగక మానదు. ఈ ఎన్నికలలో 673 పార్టీలకు ప్రాతినిధ్యం వహిస్తూ 8,054 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. ఎన్నికల నియమావళి అమలులో ఉన్న సమయంలో ఓటర్లను ప్రభావితం చేయడానికి అక్రమంగా తరలిస్తున్న దాదాపు రు.3100 కోట్ల విలువ గల మద్యం, నగదు, బంగారం, మత్తు పదార్థాలు వగైరాలను ఎన్నికల సంఘం జప్తు చేయడం విస్మయం కలిగిస్తుంది.

### స్వామీ వివేకానంద స్ఫూర్తి

"లేవండి.. మేల్కోండి... గమ్యం చేరేవరకూ ఆగకండి.. బలమే జీవితం, బలహీనతే మరణం. ఎప్పుడూ జాగృతంగానే ఉండండి. ఇనుప కండరాలు, ఉక్కు నరాలు, వజ్ర సంకల్పం మనసులో ఉన్న యువత ఈ దేశానికి ఆవశ్యకం" అని ప్రవచించిన స్వామీ వివేకానందుడి మాటలను స్ఫూర్తిగా తీసుకుని దేశ జనాభాలో సగానికి పైగా ఉన్న 30 సంవత్సరాల లోపు యువత దేశాభివృద్ధి కోసం నైరాశ్యం వీడి, నడుం బిగించి తాము చైతన్యవంతులై ప్రత్యక్ష రాజకీయాల లోకి వచ్చి చట్ట సభలలో అర్ధవంతమైన చర్చలు సుహృద్భావ వాతావరణంలో జరిగేల చూసి ప్రజలకు పారదర్శకమైన, నీతివంతమైన సుపరిపాలనను అందించడానికి కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. 2019 సార్వత్రిక ఎన్నికలలో విజయం సాధించి మొదటి సారి 17వ లోక్ సభకు ప్రాతినిథ్యం వహిస్తున్న 277 సభ్యుల ద్వారా ఈ అంశానికి బలం చేకూరినట్లయ్యింది. ఇదే స్ఫూర్తితో 2024 లోక్ సభ ఎన్నికలలో కూడా సమాజ శ్రేయస్సును, దేశాభివృద్ధిని కాంక్షించే విద్యావంతులైన యువకులు, సచ్ఛీలురు ప్రత్యక్ష రాజకీయాలలో పాల్గొని తమ దేశభక్తిని చాటుకోవాల్సిన తరుణం ఆసన్నమైంది. ప్రపంచవ్యాప్తంగా 1960వ దశకం చివరి వరకు 77 శాతం పైగా పౌరులు తమ ఓటు హక్కును వినియోగించుకోగా 2010 తర్వాత సగటు ఓటింగ్ శాతం 67 కంటే తక్కువకు చేరడం గమనార్హం. ఓటర్లను నాయకులు తమను అందలానికి ఎక్కించే సాధనాలుగా కాక ప్రజా సమస్యల పరిష్కారానికి చొరవ చూపి వారికి మానసికంగా దగ్గరయ్యే ప్రయత్నం చేసినప్పుడు మాత్రమే ఓటర్లలో ఉదాసీనత తగ్గి నిజమైన ప్రజాస్వామ్య స్ఫూర్తి పరిఢవిల్లడంతో పాటు ఓటింగ్ శాతంలో వృద్ధి నమోదవుతుంది. అంతేకాదు పౌరులు తమ హక్కులతో పాటు బాధ్యతలను గుర్తెరిగి ప్రశ్నించేతత్త్వం అలవర్చుకుని దేశాభివృద్ధికి తోడ్పాటునందించిన నాడు మరియు ప్రజా ప్రతినిధులలో జవాబుదారీతనం పెరిగి దేశ విశాల ప్రయోజనాల కోసం శ్రమించిన నాడు భరత జాతి కీర్తి ఖండాంతరాలను దాటుతుంది.

**యేచన్ చంద్ర శేఖర్ 8885050822**



### నిమిషానికి రెండున్నర లక్షల ఖర్చు

ఉభయ సభలను నడపడానికి తీసుకునే పన్ను చెల్లింపుదారుల డబ్బు కంటే పార్లమెంట్‌లో అంతరాయాలకు ఎక్కువ ఖర్చవుతుంది. మార్చ్ 2023 లో లోక్‌సభ మాజీ సెక్రటరీ జనరల్, పి డి టి ఆచారి, ఫైనాన్షియల్ ఎక్స్ప్రెస్ తో మాట్లాడుతూ, పార్లమెంటు కార్యకలాపాలు నిర్వహించడానికి భవనం యొక్క నిర్వహణ, విద్యుత్, నీరు, పెట్రోల్, ఆహారం, పార్లమెంటు భద్రత, ఎంపీలు, వారి అంగరక్షకులు, పార్లమెంట్ సిబ్బంది మరియు ఉద్యోగులందరి జీతభత్యాలు వంటి ఇతర నిర్వహణ ప్రత్యక్ష, పరోక్ష ఖర్చుల నిమిత్తం నిమిషానికి దాదాపు రూ.2.5 లక్షలు ఖర్చవుతుందని వివరించారు. ప్రజల నుండి పన్నుల రూపంలో సేకరించిన ప్రజా ధనం దుర్వినియోగానికి ఉదాహరణగా 2021 లో వర్షాకాల సమావేశాల సందర్భంగా నిర్ధారిత 107 గంటలలో కేవలం 18 గంటలు పార్లమెంటు కార్యకలాపాలు కొనసాగాయి. ఫలితంగా పన్ను చెల్లింపుదారుల విలువైన రూ.133 కోట్లకు పైగా నష్టం వాటిల్లిందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. సాధారణంగా పార్లమెంట్ సమావేశాల సందర్భంగా ప్రతి రోజు, ఉభయ సభలలో దాదాపు ఆరు గంటల పాటు కార్యకలాపాలు నిర్వహించబడతాయి. 1978కి ముందు రెండు సభల ఉత్పాదకత 100 శాతం మార్కును దాటింది. ప్రాంతీయ పార్టీలు మరియు గ్రామీణ రాజకీయాల పెరుగుదలతో, పార్లమెంటులో చర్చ గణనీయంగా పెరిగి, కొన్నిసార్లు నిరసనకు దారితీస్తుందని చాలా మంది పార్లమెంటు సభ్యులు భావిస్తున్నారు. ఉత్పాదకత రేటు తగ్గడానికి ప్రధాన కారణం నినాదాలు మరియు నిరసనల కారణంగా సమావేశాలలో అంతరాయం ఏర్పడిందని భావిస్తున్నారు. 2017-18లో పార్లమెంటు శీతాకాల సమావేశాలకు అంతరాయం కలగడంతో ప్రభుత్వ ఖజానాకు 140 కోట్ల రూపాయల నష్టం వాటిల్లింది. దీంతో పార్లమెంటు పనితీరుపై పన్ను చెల్లింపుదారులలో తీవ్ర అసంతృప్తి చెలరేగింది. 2019 బడ్జెట్ సమావేశాలలో, లోక్‌సభ ఉత్పాదకత 137 శాతానికి మరియు రాజ్యసభ 103 శాతానికి చేరుకుంది. లోక్‌సభ 480 గంటలపాటు అద్భుతంగా పనిచేసింది మరియు 37 సెషన్‌లలో, వాయిదాలు మరియు అంతరాయాల కారణంగా సమయం కోల్పోలేదు. దీనిని ఆహ్వానిస్తూ, పన్ను చెల్లింపుదారులు అధికార మరియు ప్రతిపక్ష పార్టీల ప్రయత్నాలను ప్రశంసించారు.



## జట్టు నుంచి నన్ను ఎందుకు తప్పించారు? : రవి బిష్ణోయ్

ఐపీఎల్లో సత్తాచాటి టీ20 ప్రపంచకప్ భారత జట్టులో చోటు సంపాదించడానికి ప్రయత్నిస్తానని లెగ్ స్పిన్నర్ రవి బిష్ణోయ్ పేర్కొన్నాడు. రేపటి నుంచి ఐపీఎల్ 17వ సీజన్ ప్రారంభం కానున్న విషయం తెలిసిందే. ఈ సీజన్లో రవి లక్నో సూపర్ జెయింట్స్ తరఫున ప్రాతినిథ్యం వహిస్తున్నాడు. అయితే గతేడాది తనని సెలక్టర్లు టీమిండియా నుంచి తప్పించడానికి గల కారణాలు ఇప్పటికీ తెలియట్లేదని రవి బిష్ణోయ్ పేర్కొన్నాడు. 2022 సెప్టెంబర్ నుంచి 2023 ఆగస్టు వరకు రవి బిష్ణోయ్ను సెలక్టర్లు పక్కనపెట్టారు. అయితే సెలక్టర్లు వన్డే వరల్డ్ కప్పు దృష్టిలో ఉంచుకున్నప్పటికీ టీ20 జట్టులో తనకి చోటు దక్కాల్సిందని బిష్ణోయ్ అభిప్రాయపడ్డాడు. మొత్తంగా ఇటీవల భారత జట్టులో చోటు దక్కించుకున్న సౌతాఫ్రికా, అఫ్గానిస్థాన్ సిరీస్లో సత్తాచాటాడు. ఓ సందర్భంలో టీ20 బౌలింగ్ ర్యాంకింగ్స్లో నంబర్ వన్ ర్యాంక్కు చేరుకున్నాడు. అయినప్పటికీ జట్టులో ఉన్న విపరీతమైన పోటీతో అతడి స్థానంపై గ్యారెంటీ లేదు. ”నన్ను జట్టు నుంచి తప్పించడానికి గల కారణాలు నాకు తెలియదు. ఈ విషయంలో నేను కుంగిపోకుండా నా కోచ్లు ప్రద్యోత్ సింగ్ రాథోర్, షారుక్ ఖాన్ ఇద్దరూ అండగా నిలిచారు. సరైన దిశలో పయనించేలా చేశారు. ఐపీఎల్లో అయినా, దేశవాళీ క్రికెట్లో అయినా వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడానికి ప్రయత్నిస్తాను. ప్రస్తుతానికి నా స్థానంపై నాకు అభద్రతా భావం లేకపోవడం కాస్త సంతోషకరం. బౌలింగ్పై శ్రద్ధ వహిస్తూనే బ్యాటింగ్ కూడా సాధన చేస్తున్నా. ఎక్కువగా బౌలింగ్ చేస్తే ఆటలో మరింత మెరుగవుతామనే సిద్ధాంతాన్ని నమ్ముతా” అని రవి బిష్ణోయ్ పేర్కొన్నాడు. భారత అండర్-19 జట్టులో తన సహచరులు యశస్వీ జైస్వాల్, ధ్రువ్ జురెల్, తిలక్ వర్మ సత్తాచాటడం ఆనందంగా ఉందని రవి బిష్ణోయ్ తెలిపాడు. యశస్విని చూస్తుంటే టెస్టు క్రికెట్ ఆడాలనే ప్రేరణ కలుగుతుందని అన్నాడు. టీ20 వరల్డ్ కప్ జట్టులో చోటు గురించి స్పందిస్తూ.. ”ప్రపంచకప్ జట్టులో ఉండటానికి ఎవరు ఇష్టపడరు? అది నా కల. ఐపీఎల్లో మంచి ప్రదర్శన ఎంపిక అవ్వడానికి సాయపడుతుంది” అని రవి బిష్ణోయ్ అన్నాడు.

# నేడే ఐపీఎల్ ప్రారంభం

**• తొలి మ్యాచ్లో చెన్నై సూపర్ కింగ్స్ వర్సెస్ ఆర్సీబీ • భారత్లో ఎన్నికల కోలాహలం... అదే సమయంలో ఐపీఎల్**



దేశంలో క్రికెట్ పండగకు వేళైంది. రేపటి నుంచి ఐపీఎల్ 17వ సీజన్ ప్రారంభం కానుంది. తొలి మ్యాచ్లో డిఫెండింగ్ ఛాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తలపడనున్నాయి. ఈ పోరు రాత్రి 8 గంటలకు మొదలవుతుంది. ఈ హైవోల్టేజ్ మ్యాచ్కు చెపాక్ స్టేడియం వేదికగా మారింది. స్టార్ ప్లేయర్లకు కొదవలేని ఇరు జట్లు ఫేవరేట్గా రంగంలోకి దిగుతున్నాయి. కానీ గణాంకాల్లో బెంగళూరుపై చెన్నైదే పైచేయి. చెపాక్లో సీఎస్కే, ఆర్సీబీ ఎనిమిది మ్యాచ్లో తలపడింది. 2008 తర్వాత ఇప్పటివరకు రాయల్ ఛాలెంజర్స్ ఒక్కసారి కూడా గెలవలేదు. ఐపీఎల్లో ఓవరాల్గా ఇరు జట్లు 31 మ్యాచ్లో తలపడ్డాయి. చెన్నై 20, బెంగళూరు 10 మ్యాచ్లో గెలిచాయి. ఓ మ్యాచ్ ఫలితం రాలేదు. అయితే చరిత్రను పక్కనపెట్టి సీజన్ను విజయంతో ఆరంభించాలని, కప్ కలను సాకారం చేసుకోవాలని ఆర్సీబీ కసిగా బరిలోకి దిగుతోంది. మరోవైపు తన సొంత మైదానంలో ప్రత్యర్థిని మట్టకరిపించి ఆరో టైటిల్ వేటను ఘనంగా ప్రారంభించాలని సీఎస్కే ఉవ్విళ్లూరుతోంది. కానీ సీఎస్కేను గాయాల బెడద వేదిస్తోంది. దీంతో చెన్నై తుదిజట్టులో ఎవరుంటారనే ఆసక్తి అందరిలోనూ మొదలైంది.

కాగా, రేవు మైండ్ గేమ్తో ధోనీ తన మార్కు మరోసారి చూపించనున్నాడు. అంచనాలకు మించి తుదిజట్టును సిద్ధం చేస్తున్నాడు. స్పిన్కు అనుకూలించే చెపాక్లో ఆర్సీబీ బలాలు, బలహీనతలను లెక్కకట్టి జట్టుకూర్పు చేస్తున్నాడు. గాయాలతో డెవాన్ కాన్వే, పతిరన దూరమవ్వడం సీఎస్కే ఎదురుదెబ్బే. కానీ వాళ్ల గైర్హాజరీ జట్టుపై ప్రభావం చూపకుండా ప్రణాళికలు రచిస్తున్నాడు.


కాన్వే స్థానంలో ఓపెనర్గా రచిన్ రవీంద్రకు అవకాశం ఇవ్వనున్నాడు. రుతురాజ్ గైక్వాడ్తో కలిసి రచిన్ ఇన్నింగ్స్ ప్రారంభించనున్నాడు. లెఫ్ట్-రైట్ హ్యాండెడ్ జోడీ జట్టుకు శుభారంభాన్ని ఇస్తుందని భావిస్తున్నాడు. వన్డౌన్లో అజింక్య రహానె రానున్నాడు. గత సీజన్లో మాదిరిగానే మెరుపు బ్యాటింగ్ చేయాలని రహానెకు సూచనలు అందాయి. అయితే నాలుగో స్థానం కోసం మొయిన్ అలీ, డారిల్ మిచెల్ పోటీపడుతున్నారు. స్పిన్నర్లపై దూకుడుగా అలీ బ్యాటింగ్ చేయగలడు. కానీ అలీ లెఫ్ట్ హ్యాండర్ బ్యాటర్. తుదిజట్టులో ఉండే రచిన్ రవీంద్ర, శివమ్ దూబె, రవీంద్ర జడేజా కూడా ఎడమచేతి వాటం బ్యాటర్లే. దీంతో మిచెల్ జట్టులోకి వచ్చే ఛాన్స్ ఉంది. అంతేగాక ఆర్సీబీ జట్టులో మాక్స్వెల్ పార్ట్టైమ్ స్పిన్నర్. లెఫ్ట్ హ్యాండర్లను ఎక్కువగా తీసుకుంటే మాక్సీకి నాలుగు ఓవర్ల కోటా పూర్తి చేసే అవకాశం తామే ఇచ్చినట్లు అవుతుందని ధోనీ భావిస్తున్నాడు. ఆఫ్ స్పిన్నర్ అయిన మాక్సీ ఎడమచేతి వాటం బ్యాటర్లను ఇబ్బంది పెట్టగలడు. అందుకే తొలి మ్యాచ్లో అలీపై వేటు వేయాలనుకుంటున్నాడు.

పతిరన గాయంతో దూరమవ్వడంతో ముస్తాఫిజుర్ జట్టులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఇప్పుడిప్పుడే గాయం నుంచి కోలుకుంటున్న ముస్తాఫిజుర్కు విశ్రాంతి ఇవ్వాలని భావిస్తే ముకేశ్ చౌదరి జట్టులోకి వస్తాడు. స్పిన్నర్ తీక్షణ జట్టులో ఉంటాడు. దీపక్ చాహర్, శార్దూల్ ఠాకూర్ పేస్ బాధ్యతలను అందుకుంటారు.

**చెన్నై సూపర్ కింగ్స్ తుదిజట్టు (అంచనా)...**

రుతురాజ్ గైక్వాడ్, రచిన్ రవీంద్ర, అజింక్య రహానె, డారిల్ మిచెల్, శివమ్ దూబె, రవీంద్ర జడేజా, ధోనీ, శార్దూల్ ఠాకూర్, దీపక్ చాహర్, ముస్తాఫిజుర్/ముకేశ్ చౌదరి, తీక్షణ

# చెన్నై సూపర్ కింగ్స్కు కొత్త కెప్టెన్ వచ్చాడు!



**• ఇప్పటివరకు చెన్నై సూపర్ కింగ్స్ను టాప్ టీమ్గా నిలబెట్టిన ధోనీ**
**• ఐపీఎల్ తాజా సీజన్లో చెన్నై సారథిగా రుతురాజ్ గైక్వాడ్**
**• ఐపీఎల్ ట్రోఫీ అధికారిక ఫొటోషూట్కు హాజరైన గైక్వాడ్**
**• చెన్నై కొత్త కెప్టెన్ ఇతడేనంటూ పరిచయం చేసిన ఐపీఎల్ నిర్వాహకులు**

ఐపీఎల్ 2024 సీజన్ ప్రారంభానికి ముందు చెన్నై సూపర్ కింగ్స్(సీఎస్కే) అభిమానులకు బిగ్ షాక్. ఆ జట్టు సారథ్య బాధ్యతల నుంచి మహేంద్ర సింగ్ ధోనీ తప్పుకున్నాడు. దాంతో సీఎస్కే నూతన సారథిగా రుతురాజ్ గైక్వాడ్ను ఎంపిక చేసింది. ఈ విషయాన్ని చెన్నై సూపర్ కింగ్స్ ఫ్రాంచైజీ అధికారికంగా వెల్లడించింది.

మహేంద్ర సింగ్ ధోనీ తన సారథ్య బాధ్యతలను రుతురాజ్ గైక్వాడ్కు అందించాడని ప్రకటించింది. ఐపీఎల్ 2024 సీజన్ నేపథ్యంలో ధోనీ ఈ నిర్ణయం తీసుకున్నాడని తెలిపింది. ఐపీఎల్ 2019 సీజన్ నుంచి చెన్నైకి ఆడుతున్న రుతురాజ్ గైక్వాడ్ ఇప్పటి వరకు 52 మ్యాచ్లు ఆడాడని తమ ప్రకటనలో ప్రస్తావించింది. ధోనీ అందుబాటులో ఉండే విషయంపై ఎలాంటి విషయాన్ని వెల్లడించలేదు.

ఐపీఎల్ 2024 ట్రోఫీ ఫొటో షూట్లో 10 ఫ్రాంచైజీల కెప్టెన్లు పాల్గొన్నారు. కాసేపటి క్రితమే ఈ ట్రోఫీ షూట్కు సంబంధించిన ఫొటోలను ఐపీఎల్ నిర్వాహకులు అభిమానులతో పంచుకున్నారు. ఇందులో ధోనీకి బదులు రుతురాజ్ గైక్వాడ్ ఫోజివ్వడంతో అంతా అవాక్కయ్యారు. ఆ వెంటనే ఐపీఎల్ నిర్వాహకులు ధోనీ తన సారథ్య బాధ్యతలను రుతురాజ్ గైక్వాడ్కు అప్పగించాడని వివరణ ఇచ్చారు. కొద్ది రోజుల క్రితమే కొత్త సీజన్లో కొత్త పాత్రలో కనిపించబోతున్నానని ధోనీ సోషల్ మీడియా వేదికగా పోస్ట్ చేశాడు. అందుకు తగ్గట్లుగానే అతను సారథ్య బాధ్యతల నుంచి తప్పుకున్నాడు. దాంతో ఈ సీజన్లో అతను పూర్తి స్థాయిలో బరిలోకి దిగుతాడా? లేక ఇంపాక్ట్ ప్లేయర్గా బరిలోకి దిగుతాడా? అనేది తెలియాల్సి ఉంది. లేకుంటే ఐపీఎల్కు రిటైర్మెంట్ ప్రకటించి మెంటార్గా కొనసాగుతాడా? అనేది చూడాలి. ధోనీ సారథ్యంలో చెన్నై సూపర్ కింగ్స్ 5 టైటిళ్లు గెలిచింది. అత్యధికసార్లు ప్లే ఆఫ్స్ చేరిన జట్టుగా కూడా చరిత్రకెక్కింది. ఐపీఎల్ 2022 సీజన్ మెగా వేలం అనంతరం ధోనీ.. తన సారథ్య బాధ్యతలను జడేజాకు అందజేశాడు. ఈ ప్రయోగం మిస్ఫైర్ అవ్వడంతో మధ్యలోనే మళ్లీ కెప్టెన్సీ బాధ్యతలను చేపట్టాడు. ఆ సీజన్లో చెన్నై దారుణంగా విఫలమైనా.. మరుసటి ఏడాది ధోనీ సారథ్యంలో టైటిల్ గెలిచింది. మరోసారి సారథ్య బాధ్యతలను వదులుకోవడంతో ఈ సీజన్లో కూడా చెన్నైకి గడ్డు పరిస్థితులు ఎదురవుతాయని ఫ్యాన్స్ ఆందోళనకు గురవుతున్నారు.

## ఈసారి ఐపీఎల్లో కొత్త రూల్..

**ఇటీవల ఐసీసీ తీసుకొచ్చిన ఆ రూల్కు మాత్రం బ్రేక్!**



రేపటి నుంచి ఐపీఎల్-2024కు తెరలేవనుంది. సుమారు రెండున్నర నెలల పాటు క్రికెట్ అభిమానులకు వినోదాన్ని అందించనుంది. ఇప్పటికే టోర్నీలో పాల్గొనే పది జట్లు ప్రాక్టీస్ ముమ్మరం చేశాయి. ఇక ఈ 17వ సీజన్ శుక్రవారం చెపాక్ స్టేడియం వేదికగా జరిగే చెన్నై సూపర్ కింగ్స్, బెంగళూరు రాయల్ ఛాలెంజర్స్ మ్యాచ్తో మొదలు కానుంది.

అంతకంటే ముందు ప్రారంభ వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ ప్రారంభ వేడుకల్లో ఏఆర్ రెహమాన్, సోను నిగమ్, అక్షయ్ కుమార్, టైగర్ ష్రాఫ్ ప్రదర్శనలు ఉండనున్నాయి. ఇదిలాఉంటే.. ఈసారి ఐపీఎల్లో కొన్ని కొత్త రూల్స్ను ప్రవేశపెడుతున్నారు. అవేంటో ఒకసారి చూద్దాం. గత సీజన్ వరకు ఓవర్కు ఒక బౌన్సర్ మాత్రమే వేయాలనే రూల్ ఉండేది. ఈసారి ఈ రూల్ను మారుస్తున్నారు. ఈ ఐపీఎల్ సీజన్లో ఓవర్కు రెండు షార్ట్ బాల్స్ (బౌన్సర్) వేసుకోవచ్చు. ఈ రూల్ను బీసీసీఐ ఇటీవల నిర్వహించిన సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో అమలు చేసింది. అలాగే స్టంపింగ్ కోసం థర్డ్ అంపైర్కు రెఫర్ చేసినప్పుడు ముందుగా క్యాచ్ను చెక్ చేసే రూల్ యధావిధిగా కొనసాగనుంది.

ఇంకా ఔట్, నాటౌట్తో పాటు వైడ్, నో బాల్ కోసం ఒక్కో జట్టుకు రెండు రివ్యూలను అలాగే కంటిన్యూ చేస్తున్నారు. అయితే, ఇటీవల ఐసీసీ తీసుకొచ్చిన 'స్టాప్ క్లాక్' రూల్ను అమలు చేయడం లేదు. కాగా, ఈ రూల్ ప్రకారం ఓవర్ పూర్తయిన వెంటనే బౌలింగ్ సైడ్ టీమ్ 60 సెకన్ల లోపు మరో ఓవర్ మొదలు పెట్టాల్సి ఉంటుంది. వైట్బాల్ క్రికెట్లో నిర్ణీత సమయంలోపు మ్యాచ్లను పూర్తి చేయాలనే ఉద్దేశంతో ఐసీసీ ఈ రూల్ను తీసుకోచ్చింది.

## మహ్మద్ షమీ స్థానంలో కొత్త ఆటగాడిని తీసుకున్న గుజరాత్



చీలమండ గాయానికి సర్జరీ చేయించుకొని చికిత్స పొందుతున్న స్టార్ పేసర్ మహ్మద్ షమీ స్థానంలో సందీప్ వారియర్ అనే కొత్త ఫాస్ట్ బౌలర్ను గుజరాత్ టైటాన్స్ భర్తీ చేసింది. ఈ విషయాన్ని ఐపీఎల్ పాలక మండలి ప్రకటించింది. షమీ ప్రస్తుతం కోలుకుంటున్నాడని, అతడి స్థానంలో తీసుకున్న సందీప్ ఇప్పటివరకు 5 ఐపీఎల్ మ్యాచ్లు ఆడాడని వెల్లడించింది. సందీప్ ను బేస్ ధర రూ.50 లక్షల మొత్తానికి గుజరాత్ దక్కించుకున్నట్టు వివరించింది. మరోవైపు గాయం కారణంగా 2024 ఎడిషన్ నుంచి మధుశంక వైదొలగడంతో అతడి స్థానంలో అండర్-19 వరల్డ్ కప్లో మెరిసిన దక్షిణాఫ్రికా ఆటగాడు క్వేనా మఫాకాను ముంబై ఇండియన్స్ జట్టులోకి తీసుకుందని ఐపీఎల్ పాలకమండలి వెల్లడించింది. కాగా సందీప్ వారియర్ కోల్కతా నైట్ రైడర్స్ తరఫున 2019 - 2021 మధ్య 5 మ్యాచ్లు ఆడాడు. మధుశంక ఐపీఎల్ 2024 ఎడిషన్కు దూరమయ్యాడని ఐపీఎల్ పాలకమండలి నిర్ధారించింది. దిల్షాన్ మధుశంక గాయం కారణంగా తొలగాడని తెలిపింది. అతడి స్థానంలో తీసుకున్న క్వేనా మఫాకా దక్షిణాఫ్రికాకు చెందిన ఆటగాడని, ఎడమచేతి వాటం పేసర్ అని తెలిపింది. ఇటీవల ముగిసిన ఐసీసీ అండర్-19 పురుషుల క్రికెట్ ప్రపంచ కప్లో దక్షిణాఫ్రికాకు ప్రాతినిధ్యం వహించాడని, ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్గా కూడా ఎంపికయ్యాడని పేర్కొంది. బేస్ ధర రూ.50 లక్షల మొత్తానికి ముంబై ఇండియన్స్ అతడిని జట్టులో చేర్చుకుందని వివరించింది.

## పాకిస్థాన్ మాజీ కెప్టెన్ కన్నుమూత!

- అనారోగ్యంతో కన్నుమూసిన సయీద్ అహ్మద్
- 1958-73 మధ్య పాక్ తరఫున 41 టెస్టులు ఆడిన మాజీ క్రికెటర్
- 1958లో విండీస్తో టెస్టు ద్వారా అరంగేట్రం
- 1969లో పాక్ టెస్టు జట్టు సారథిగా బాధ్యతలు
- కేవలం మూడు మ్యాచులకు మాత్రమే పరిమితమైన కెప్టెన్సీ
- 1972-73లో మెల్బోర్న్ వేదికగా చివరి టెస్టు మ్యాచ్ ఆడిన అహ్మద్



పాకిస్థాన్ క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ సయీద్ అహ్మద్ (86) అనారోగ్యంతో కన్నుమూశారు. అహ్మద్ 1958-73 మధ్య పాకిస్థాన్ తరఫున 41 టెస్టులు ఆడారు. 5 సెంచరీలు, 16 అర్ధ శతకాల సాయంతో 2991 పరుగులు చేశారు. కాగా, అహ్మద్ కొట్టిన ఐదు శతకాలలో మూడు భారత్పైనే నమోదు చేశారు. రైట్ ఆర్మ్ స్పిన్నర్ అయిన సయీద్ అహ్మద్ 22 వికెట్లు కూడా తీశారు. 1958లో విండీస్తో బ్రిడ్జ్టౌన్ వేదికగా జరిగిన టెస్టు ద్వారా అరంగేట్రం చేశారు. 1972-73లో మెల్బోర్న్ వేదికగా తన చివరి టెస్టు మ్యాచ్ ఆడారు. అహ్మద్ పాకిస్థాన్కు ఆరో టెస్టు కెప్టెన్. పాక్ దిగ్గజం హనీఫ్ మహ్మద్ తర్వాత ఆ జట్టు పగ్గాలు 1969లో ఈయనకే దక్కాయి. ఆ ఏడాది ఇంగ్లండ్లో పర్యటించిన పాక్ జట్టుకు ఆయన కెప్టెన్గా ఉన్నారు. అయితే, అహ్మద్ కేవలం మూడు టెస్టులకు మాత్రమే కెప్టెన్గా వ్యవహరించడం గమనార్హం. ఇక మాజీ టెస్టు సారథి మృా ఎతిపట్ల పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) ఛైర్మన్ మోసిన్ నఖ్వీ సంతాపం తెలిపారు. సయీద్ అహ్మద్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

# సూర్య సినిమా

## సోషల్ మీడియాలో సరికొత్త రికార్డు సృష్టించిన ఐకాన్ స్టార్



ఐకాన్‌స్టార్ అల్లు అర్జున్ ఫ్యాన్ ఫాలోయింగ్, ఆయనకున్న క్రేజ్ ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. పుష్ప చిత్రంతో అంతర్జాతీయంగా అభిమానులను సంపాదించుకున్న ఐకాన్‌స్టార్ అల్లు అర్జున్ రోజు రోజుకు తన పాపులారిటీని పెంచుకుంటూనే పోతున్నాడు. ప్రతి విషయంలో తనకంటూ ఒక బలమైన మార్క్‌ను క్రియేట్ చేసుకుంటున్నాడు. ఇటీవల ఉత్తమ నటుడిగా నేషనల్ అవార్డ్‌తో అందుకున్న తొలి తెలుగు హీరోగా రికార్డ్ క్రియేట్ చేసిన అల్లు అర్జున్ అన్ని విషయాల్లోనూ అందర్నీ దాటి ముందుకు దూసుక వెళ్తున్నాడు. తాజాగా తన సోషల్ మీడియా ఇన్‌స్టా అకౌంట్ ఫాలోవర్స్ విషయంలో ఐకాన్ స్టార్ కొత్త రికార్డును నెలకొల్పాడు. అల్లు అర్జున్ ఇన్‌స్టా అకౌంట్‌ను కోట్ల మంది ఫాలో అవుతున్నాడు. ఇన్‌స్టాలో ఎప్పుడూ యాక్టివ్‌గా వుండే ఈ ఐకాన్ స్టార్ 25 మిలియన్ల ఫాలోవర్స్‌ను చేరుకున్నాడు. ఇన్‌స్టాలో ఇంత మంది ఫాలోవర్స్ వున్న మొదటి సౌత్ హీరో అల్లు అర్జున్ కావడం విశేషం. ఈ విషయాన్ని ఐకాన్‌స్టార్ తన అకౌంట్లో తెలుపుతూ మీ అభిమానానికి ఎప్పటికి థ్యాంక్స్ అంటూ పోస్ట్‌ను పెట్టాడు. ఇక ఈ విషయంలో తమ హీరో క్రియేట్ చేసిన రికార్డు విషయంలో ఐకాన్‌స్టార్ అభిమానులు ఫుల్ ఖుషీలో వున్నారు. అంతేకాదు అల్లు అర్జున్ నటిస్తున్న తాజా చిత్రం పుష్ప ది రూల్ (పుష్ప-2) ఎన్ని రికార్డులు క్రియేట్ చేయనుందో అంటూ లెక్కలేసుకుంటున్నారు ఐకాన్‌స్టార్ అభిమానులు.

## విశ్వంభర హైదరాబాద్ షెడ్యూల్ పూర్తి

మెగాస్టార్ చిరంజీవి మోస్ట్ ఎవైటెడ్ మాగ్నమ్ ఓపస్ 'విశ్వంభర'. వశిష్ట దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం టైటిల్ గ్లింప్స్ విడుదలయ్యాక అంచనాలు ఆకాశాన్ని తాకాయి. తాజాగా హైదరాబాద్లో ఓ కీలక షెడ్యూల్ను చిత్ర బృందం పూర్తి చేసుకుంది. చిరంజీవి, త్రిష కృష్ణన్ తదితరులు షూటింగ్‌లో పాల్గొన్నారు. ఈ షెడ్యూల్లో కొన్ని టాకీ పార్ట్స్, పాట, యాక్షన్ బ్లాక్‌ని చిత్రీకరించారు. చిరంజీవి నివాసంలో సంగీత దర్శకుడు ఎంఎం కీరవాణితో సహా మొత్తం బృందంతో పాటు త్రిష కృష్ణన్ కొన్ని ఫోటోలని సోషల్ మీడియాలో షేర్ చేశారు. ఇదొక లెజెండరీ, అద్భుతమైన రోజు విశ్వంభర అని ఆమె పోస్ట్ చేశారు. చిరంజీవి, త్రిష, వశిష్ట, కీరవాణి, విక్రమ్, వంశీ, ఛోటా కె నాయుడు, ఎఎస్ ప్రకాష్ కనిపిస్తున్న మరో పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ మెగా ఫాంటసీ అడ్వెంచర్‌ను ప్రముఖ నిర్మాణ సంస్థ యువి క్రియేషన్స్ నిర్మిస్తోంది. విక్రమ్, వంశీ, ప్రమోద్ ఈ భారీ బడ్జెట్ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. రిచ్ ప్రొడక్షన్, అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో అద్భుతంగా వుండబోతోంది.. కోటగిరి వెంకటేశ్వర రావు, సంతోష్ కామిరెడ్డి ఈ చిత్రానికి ఎడిటర్లుగా వ్యవహరిస్తున్నారు. శ్రీ శివశక్తి దత్తా, చంద్రబోస్ లిరిక్ రైట్స్ కాగా, శ్రీనివాస్ గవిరెడ్డి, గంటా శ్రీధర్, నిమ్మగడ్డ శ్రీకాంత్, మయూఖ్ ఆదిత్య స్క్రిప్ట్ అసోసియేట్లుగా ఉన్నారు. విశ్వంభర 2025 సంక్రాంతికి జనవరి 10న విడుదల కానుంది.



## వైభవంగా జరిగిన తలకోన ప్రి రిలీజ్



అక్షర క్రియేషన్ పతాకంపై నగేష్ నారదాసి దర్శకత్వంలో దేవర శ్రీధర్ రెడ్డి ( చేవెళ్ల) నిర్మాతగా అప్సర రాణి ప్రధాన పాత్రలో రూపొందిన సస్పెన్స్ థ్రిల్లర్ తలకోన. ఈ చిత్రం అన్ని హంగులు పూర్తి చేసుకుని మార్చి 29న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా చిత్ర యూనిట్ ఫిల్మ్ ఛాంబర్‌లో ప్రి రిలీజ్ వేడుక నేడు నిర్వహించారు. ఈ కార్యక్రమం లో ముఖ్య అతిథులుగా ప్రముఖ నిర్మాతలు రామ సత్యనారాయణ, సాయి వెంకట్, రావు, ప్రముఖ హీరో రమాకాంత్ ప్రముఖ డిస్ట్రిబ్యూటర్ పార్థు రెడ్డి తదితరులు పాల్గొని చిత్ర యూనిట్ కు శుభాకాంక్షలు తెలియచేశారు. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత శ్రీదర్ రెడ్డి మాట్లాడుతూ.. మా హీరోయిన్ అప్సర రాణి ఇప్పటివరకు చేయని వెరైటీ సబెక్ట్ ఇది. అవుట్ అండ్ అవుట్ యాక్షన్ నేపథ్యంలో సాగే ఈ కథాంశం మొత్తం ఫారెస్ట్ బ్యాక్ డ్రాప్ లో ఉండబోతోంది. అయితే ఫారెస్ట్ అనగానే కేవలం ప్రకృతి అందాలే కాదు అందులో ఇంకో కోణం కూడా వుంటుందని చూపించాం. అదే విదంగా పాలిటిక్స్, మీడియాను సైతం మిక్స్ చేసి చూపించడం జరుగుతుంది. అందుకు తగ్గ టీమ్ ను, టెక్నికల్ టీమ్ కూడా సినిమాకు తీసుకోవడం జరిగింది. అలాగే థ్రిల్లింగ్ సస్పెన్స్ తో మార్చి 29 న ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రేక్షకులు ఆదరిస్తారని ఆశిస్తు న్నాను అన్నారు. దర్శకుడు నగేష్ నారదాసి మాట్లాడుతూ.. అప్సర రాణి నీ చూస్తే కాశ్మీర్ యాపిల్ ల కనిపిస్తుంది. కానీ ఈ సినిమాలో తను కాశ్మీర్ మిర్చి లా నటించింది . చాలా వెరైటీ స్టోరీ ఇది .షూటింగ్ తలకొనలో అద్భుతంగా జరిగింది అని అన్నారు. హీరోయిన్ అప్సర రాణీ మాట్లాడుతూనా కెరీర్ లో ఈ చిత్రం డెఫినెట్ గా ఓ మైలు రాయి గా నిలుస్తుంది. నేనింతవరకు చేయని ఫైట్స్ ఈ చిత్రంలో చేయడం జరిగింది. మాస్ క్లాస్ ఆడియన్స్ కు కావలసిన అన్ని అంశాలు ఈ చిత్రంలో వున్నాయి. కచ్చితంగా ఈ సినిమా హిట్ అవుతుందని ఆశిస్తున్నాను అని అన్నారు.

## ప్రైమ్ వీడియోస్ సంచలనం...70కిపైగా సిరీస్‌లు



ప్రైమ్ వీడియో, భారతదేశం అత్యంత ఇష్టపడే వినోద గమ్యస్థానం, తన రెండవ ప్రైమ్ వీడియో ప్రెజెంట్స్ ఇండియా షోకేస్లో దేశంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన మరియు విభిన్నమైన కంటెంట్ స్లేట్ను ఆవిష్కరించింది, దాదాపు 70 సిరీస్లు మరియు చలనచిత్రాలు ఉన్నాయి, వాటిలో ఎక్కువ భాగం ఈ సేవలో తదుపరి 2 సంవత్సరాలు ప్రీమియర్ అవుతాయి. 40 ఒరిజినల్ సిరీస్లు మరియు చలనచిత్రాలు మరియు 29 భారతదేశంలోని అతిపెద్ద మరియు అత్యంత అంచనాలు ఉన్న చలన చిత్రాలలో కొన్నింటితో, కొత్త స్లేట్ కస్టమర్లను ఆహ్లాదపరిచేందుకు మరియు నిమగ్నమవ్వడానికి అత్యుత్తమ భారతీయ వినోదాన్ని అందజేస్తుందని హామీ ఇచ్చింది. ప్రైమ్ వీడియో రాబోయే ఒరిజినల్లు ఇంటిలోని ప్రతి ఒక్కరికీ ఏదో ఒకదానిని అందిస్తాయి, ఇందులో హిందీ, తమిళం మరియు తెలుగులో అనేక రకాలైన అనేక రకాల సిరీస్లు మరియు చలనచిత్రాలు ఉన్నాయి. ఉత్కంఠభరితమైన థ్రిల్లర్లు మరియు ఆకట్టుకునే డ్రామాల నుండి పక్కటెముకలను కదిలించే కామెడీలు మరియు వెన్నెముకను చిలికిపోయే భయానక, చమత్కారమైన స్క్రిప్ట్ లేని షోలు, యువకులకు మనోహరమైన కథనాలు, హై-ఆక్టేన్ యాక్షన్ మరియు ఆకట్టుకునే సంగీత నాటకాల వరకు, విభిన్నమైన స్లేట్ ఉత్తమ స్థానిక కథలను తెరపైకి తెస్తుంది. ఇది భారతదేశంలోని అత్యంత ప్రతిష్టాత్మకమైన ఫిల్మ్ స్టూడియోలలోని కొన్ని భాషల సినిమాలకు అదనం.

## తిరుపతిలో డిస్ట్రిబ్యూషన్ ఆఫీస్ ఓపెన్ చేసిన యంగ్ ప్రొడ్యూసర్ ధీరజ్ మొగిలినేని

ఊర్వశివో రాక్షసివో, బేబి, అంబాజీపేట మ్యారేజి బ్యాండు వంటి విజయవంతమైన చిత్రాలతో సక్సెస్ ఫుల్ యంగ్ ప్రొడ్యూసర్‌గా టాలీవుడ్ లో పేరు తెచ్చుకున్నారు ధీరజ్ మొగిలినేని. ఆయన ప్రొడ్యూసర్ గానే కాదు సక్సెస్ ఫుల్ డిస్ట్రిబ్యూటర్‌గా పలు సూపర్ హిట్ సినిమాలను పంపిణీచేస్తున్నారు. బేబి, గుంటూరు కారం, హనుమాన్, గామి వంటి బ్లాక్ బస్టర్ మూవీస్‌ను పంపిణీ చేసి డిస్ట్రిబ్యూషన్ రంగంలో దూసుకెళ్తున్నారు ధీరజ్ మొగిలినేని. ఆయన తాజాగా సీడెడ్ ఏరియా పంపిణీ రంగంలోకి అడుగుపెట్టారు. ప్రముఖ సీడెడ్ డిస్ట్రి బ్యూటర్ యతితో కలిసి తిరుపతిలో డిస్ట్రిబ్యూషన్ ఆఫీస్ ఓపెన్ చేశారు ధీరజ్ మొగిలినేని. ప్రస్తుతం ఆయన శ్రీ విష్ణు హీరోగా నటించిన 'ఓం భీమ్ బుష్', సిద్దు జొన్నలగడ్డ 'టిల్లు స్క్వేర్'తో పాటు మరికొన్ని ఇంట్రెస్టింగ్ ప్రాజెక్ట్స్ డిస్ట్రిబ్యూట్ చేస్తున్నారు. తిరుపతిలో ధీరజ్ మొగిలినేని ఎంటర్ టైన్ మెంట్స్ ఆఫీస్ ఓపెన్ సందర్భంగా ఆయనకు ఇండస్ట్రీ మిత్రులు, శ్రేయోభిలాషులు, సన్నిహితుల నుంచి శుభాకాంక్షలు అందుతున్నాయి.



## ది గోట్ లైఫ్ లిరికల్ సాంగ్



మలయాళ స్టార్ హీరో పృథ్వీరాజ్ సుకుమారన్ నటించిన ది గోట్ లైఫ్ (ఆడు జీవితం) సినిమా ఈ నెల 28న పాన్ ఇండియా స్థాయిలో మలయాళంతో పాటు హిందీ, తెలుగు, తమిళ, కన్నడ భాషల్లో థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. ఈ సినిమాను బెన్యామిన్ రాసిన గోట్ డేస్ నవల ఆధారంగా అవార్డ్ విన్నింగ్ డైరెక్టర్ బ్లెస్సీ రూపొందించారు. విజువల్ రొమాన్స్ బ్యానర్ ఈ సినిమాను మలయాళ చిత్ర పరిశ్రమలో ప్రెస్టీజియస్ ప్రాజెక్ట్ గా భారీ బడ్జెట్ తో నిర్మించింది. డబుల్ ఆస్కార్ విన్నర్ ఏఆర్ రెహమాన్ సంగీతాన్నందించిన ది గోట్ లైఫ్ (ఆడు జీవితం) సినిమా నుంచి 'తేజమే రెహమానేనా..' అనే లిరికల్ సాంగ్ ను ఇవాళ విడుదల చేశారు. 'తేజమే రెహమానేనా..' లిరికల్ సాంగ్ కు రాకేందు మౌళి లిరిక్స్ అందించగా జితిన్ రాజ్ పాడారు. ఏఆర్ రెహమాన్ ఎప్పటిలాగే బ్యూటిఫుల్‌గా కంపోజ్ చేశారు. 'తేజమే రెహమానేనా తేజమే రహీమ్, యాడున్నావోయాడు న్నావో గుండె తడవగ వానై పో.. ఉప్పే లేని కన్నీరొలికి, ఆవిరి పెదవుల తాకగ రా.. ఆటు పోటుల ఆకలి ఎడారిలో చూడన చూడన నీ కలకై...' అంటూ ఎడారి కష్టాల్లో ఉన్న హీరో తన ప్రేయసిని తల్చుకుంటూ పాడే ఎమోషనల్ సాంగ్ ఇది.

## కొత్త అనుభూతిని పంచుతూ అందరినీ మెప్పించే చిత్రం టిల్లు స్క్వేర్

తెలుగునాట యువతలో కల్ట్ ఫాలోయింగ్ సంపాదించుకున్న సినిమాలలో 'డీజే టిల్లు' ఒకటి. టిల్లుగా స్టార్ బాయ్ సిద్ధు జొన్నలగడ్డ పంచిన వినోదాన్ని ప్రేక్షకులు అంత తేలికగా మరిచిపోలేరు. టిల్లు మాటలు, చేష్టలు ప్రేక్షకుల హృదయాల్లో చెరగని స్థానాన్ని సంపాదించుకున్నాయి. ఇప్పుడు 'డీజే టిల్లు' చిత్రానికి సీక్వెల్‌గా 'టిల్లు స్క్వేర్' వస్తోంది. అనుపమ పరమేశ్వరన్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి మల్లిక్ రామ్ దర్శకత్వం వహిస్తున్నారు. సితార ఎంటర్టైన్మెంట్స్ , ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకంపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ ఈ చిత్రాన్ని సమర్పిస్తోంది. మార్చి 29న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానున్న ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. తాజాగా దర్శకుడు మల్లిక్ రామ్ మీడియాతో ముచ్చటించి చిత్ర విశేషాలను పంచుకున్నారు. సిద్ధుతో నాకు ఎప్పటి నుంచో పరిచయం ఉంది. దాదాపు ఇద్దరం ఒకేసారి సినీ ప్రయాణం మొదలుపెట్టాం. మేమిద్దరం కలిసి సినిమా చేయాలని ఎప్పటి నుంచో అనుకుంటున్నాం. నా మొదటి సినిమా నరుడా ఓ నరుడా. ఆ తర్వాత అద్భుతం అనే సినిమా చేశాను. మధ్యలో పెళ్లి గోల అనే వెబ్ సిరీస్ కూడా చేశాను. అది చాలా పెద్ద హిట్ అయింది. డీజే టిల్లు, అద్భుతం సినిమాలు ఇంచుమించు ఒకే సమయంలో వచ్చాయి. ఆ తర్వాత నేను, సిద్ధు కలిసి ఒక సినిమా చేయాలి అనుకున్నాం. అదే సమయంలో నాగవంశీగారు 'టిల్లు స్క్వేర్' చేస్తే బాగుంటుందని చెప్పడం, డీజే టిల్లు దర్శకుడు విమల్ కృష్ణ ఇతర కమిట్ మెంట్స్‌తో బిజీగా ఉండటంతో నేను ఈ ప్రాజెక్ట్‌లోకి వచ్చాను. మొదట కాస్త సంకోచించాను కానీ కథ బాగా వచ్చేసరికి ఇక వెనకడుగు వేయలేదు. అద్భుతం సినిమాకి కూడా కథ నాది కాదు. ప్రశాంత్ వర్మ ఇచ్చిన కథకు నేను దర్శకత్వం వహించాను. నరుడా డోనరుడా కూడా రీమేక్. నాకు ఆ కథ బాగా నచ్చి చేశాను. నేను కథలు రాయగలను.. అలాగే ఇతరులు రాసిన కథలను తెరకెక్కించి వాటికి న్యాయం చేయగలను. అలాగే సిద్ధుకి పేరు వస్తుందంటే నాకు ఆనందమే. ఎందుకంటే నేను, సిద్ధు, ప్రశాంత్‌వర్మ, తేజ సజ్జా మేమంతా ఈ స్థాయికి రావడం కోసం దాదాపు 12 ఏళ్లుగా కష్టపడుతున్నాం. ఇప్పుడు కలిసి సినిమాలు చేస్తున్నాం. కాబట్టి ఎవరికి క్రెడిట్ వచ్చినా సంతోషమే. డీజే టిల్లు, టిల్లు స్క్వేర్ కి వ్యత్యాసం ఉంటుంది. డీజే టిల్లు డెడ్ బాడీ నేపథ్యంలో సాగే బ్లాక్ కామెడీ. కానీ టిల్లు స్క్వేర్ అలా ఉండదు. ఒక కమర్షియల్ సినిమాలా ఉంటుంది. టిల్లు పాత్ర తీరు అలాగే ఉంటుంది. రాధిక పాత్ర ప్రస్తావన ఉంటుంది. మొదటి భాగాన్ని ముడిపెడుతూ కొన్ని సన్నివేశాలు ఉంటాయి. డీజే టిల్లుని గుర్తు చేస్తూనే టిల్లు స్క్వేర్ మీకొక కొత్త అనుభూతిని ఇస్తుంది.



## ఇళయరాజా బయోపిక్ లాంఛనంగా ప్రారంభం



మాస్ట్రో, ఇసైజ్ఞానిగా ప్రేక్షకులను తన సంగీత స్వర సాగరంలో ముంచెత్తిన ఇళయరాజా అభిమానులు ఎంతో సంబరపడుతున్నారు. అందుకు కారణం చాలా రోజుల నుంచి వారు ఆయన ఇళయరాజా బయోపిక్ ఎప్పుడు ప్రారంభమవుతుందా! అని ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఎట్టకేలకు మ్యాస్ట్రో బయోపిక్ ఇళయరాజా పేరుతో బుధవారం చెన్నైలో ప్రారంభమైంది. ఈ వేడుకకు యూనివర్సల్ హీరో కమల్ హాసన్ ముఖ్య అతిథిగా హాజరై పోస్టర్ను విడుదల చేశారు. పోస్టర్ను గమనిస్తే ఇళయరాజా మూర్తీభవించిన రెట లుక్లో ధనుష్ కనిపిస్తున్నారు. కెప్టెన్ మిల్లర్ సినిమాతో ప్రేక్షకులను మెప్పించిన దర్శకుడు అరుణ్ మాదేశ్వరన్ ఈ బయోపిక్కు డైరెక్ట్ చేస్తున్నారు. కనెక్ట్ మీడియా, పి.కె.ప్రైమ్ ప్రొడక్షన్, మెర్క్యురీ మూవీస్ బ్యానర్లపై శ్రీరామ్ భక్తిశరణ్, సి.కె.పద్మకుమార్, వరుణ్ మాథుర్, ఇలం పరితి గజేంద్రన్, సౌరభ్ మిశ్రా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. కె.నిరవ్ షా సినిమాటోగ్రఫీ అందిస్తోన్న ఈ చిత్రానికి ముత్తురాజ్ ప్రొడక్షన్ డిజైనర్గా వర్క్ చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో లెజెండ్రీ మ్యూజిక్ డైరెక్టర్ మ్యాస్ట్రో ఇసైజ్ఞాని ఇళయరాజా కూడా పాల్గొన్నారు. ఇంకా డైరెక్టర్ వెట్రిమారన్, త్యాగరాజన్ కుమారరాజా సహా పలువురు సినీ ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ధనుష్ మాట్లాడుతూ చిన్నప్పటి నుంచి నేను మాస్ట్రో ఇళయరాజాగారు అందించిన అద్భుతమైన మెలోడి పాటలను విని మైమరచిపోయేవాడిని. ఇప్పుడు ఆయన బయోపిక్ చేస్తుండటం చూస్తుంటే కల నిజమైనట్లు అనిపిస్తుంది. నా జీవితంలో మరచిపోలేని క్షణాలవి. మనం మనసులో బలంగా కోరుకుంటే అవి నిజమవుతాయని అంటుంటాం. జీవితం అనేది అసాధారణమైన విషయం ఎన్నో మరుపరాని క్షణాలు, అనుభవాలతో అల్లిన వస్త్రంలాంటిది. మనం హృదయపూర్వకంగా బలంగా ఏదైనా కావాలని కోరుకున్నప్పుడు అవి నిజమవుతాయి. చాలా మంది ప్రశాంతమైన నిద్ర కోసం ఆయన పాటలతో సాంత్వన పొందుతుంటారు. అయితే నేను మాత్రం ఆయన అసాధారణ జీవితాన్ని వెండితెరపై చిత్రించాలనే కలల్లో మునిగిపోయాను. నా కెరీర్ ప్రారంభం నుంచి ఇప్పటి వరకు ఇళయరాజాగారి సంగీతం నన్ను నటుడిగా మెరుగుపరుచు కోవటానికి ఎంతగానో ఉపయోగపడ్డాయి.

## శశివదనే పెద్ద హిట్ కావాలి- హీరో రక్షిత్ శెట్టి



పలాస 1978 ఫేం రక్షిత్ అట్లూరి, కోమలీ ప్రసాద్ హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం శశివదనే. గౌరీ నాయుడు సమర్పణలో ఏజీ ఫిల్మ్ కంపెనీ, ఎస్.వి.ఎస్.స్టూడియోస్ బ్యానర్‌పై అహితేజ బెల్లంకొండ, అభిలాష్ రెడ్డి గోడల నిర్మించారు. గోదావరి నేపథ్యంలో లవ్ అండ్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కిన ఈ సినిమాకు సాయి మోహన్ ఉబ్బర దర్శకత్వం వహించారు. ఏప్రిల్ 19న సినిమా రిలీజ్ అవుతుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో...హీరో రక్షిత్ అట్లూరి మాట్లాడుతూ శశివదనే చిత్రాన్ని ఏప్రిల్ 5 ని కాకుండా ఏప్రిల్ 19న విడుదల చేస్తున్నాం. ఎందుకు వాయిదా వేశామనేది మా దర్శకుడు చెప్పారు. సినిమా ఫస్ట్ కాపీ చూసుకుని కాన్ఫిడెంట్ గా ఉన్నాం. సినిమా చాలా బ్రహ్మాండంగా వచ్చింది. దర్శకుడు సాయి మోహన్ కథ చెప్పిన విధానం నాకు ముందు అర్థం కాలేదు. అప్పుడు నేను తనని నువ్వు పలాస సినిమా చూశావా అని అడిగాను. దానికి తను లేదు సార్ అన్నాడు. పలాస సినిమా చూడకుండా నేను ఈ సినిమాను ఎలా పెర్ఫామ్ చేయగలను అనుకున్నావ్ అని అడిగాను. రాత్రికి సినిమా చూసి మాట్లాడుతానని అన్నాడు. అలా జర్నీ ప్రారంభమైంది. హను రాఘవపూడిగారి దగ్గర సాయి వర్క్ చేశాడు. తను కూడా హనుగారంత పెద్ద డైరెక్టర్ కావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. అబ్బాయి, అమ్మాయి మధ్య ఉండే ఎమోషన్ తో పాటు తండ్రి ఎమోషన్ని సాయి ముందుగా రాసుకున్నాడు. పలాస కంటే శశివదనే పెద్ద హిట్ కావాలని కోరుకుంటున్నాను. అవుతుందని నమ్మకంగా ఉన్నాను. అలాగే డైరెక్టర్ రాసుకున్న కథను బ్రహ్మాండంగా మా సినిమాటోగ్రాఫర్ సాయికుమార్ దారి విజువలైజ్ చేసి, అద్భుతంగా చూపించారు. తను పెద్ద సినిమాటోగ్రాఫర్ అవుతాడు సోషల్ మీడియాలో సరికొత్త రికార్డు సృష్టించిన ఐకాన్ స్టార్ ఐకాన్‌స్టార్ అల్లు అర్జున్ ఫ్యాన్ ఫాలోయింగ్, ఆయనకున్న క్రేజ్ ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. పుష్ప చిత్రంతో అంతర్జాతీయంగా అభిమానులను సంపాదించుకున్న ఐకాన్‌స్టార్ అల్లు అర్జున్ రోజు రోజుకు తన పాపులారిటీని పెంచుకుంటూనే పోతున్నాడు. ప్రతి విషయంలో తనకంటూ ఒక బలమైన మార్క్ను క్రియేట్ చేసుకుంటున్నాడు.




PRINTED & PUBLISHED BY NUKARAPU PADMAJA ON BEHALF OF SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. PRINTED AT SPR PRINTING PRESS, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081, TELANGANA, PUBLISHED AT SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR,NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. EDITOR : NUKARAPU PADMAJA. Fax No:040-30473232 RNI Registration No. APTEL/2007/22044.